మార్క్సిస్టు

జూన్
2020

170

సంపుటి : 15 సంచిక : 2 వెల రు. 10/-

## ఈ సంచికలో........

మొదటి పార్టీ మహాసభ -1943
కరోనా మహమ్మారి : వైద్యం ప్రయివేటుపరం, ఉపద్రవాలు సమాజపరం
మోడీ లాక్‌డౌన్‌లు: వలస కార్మికుల వెతలు
చైనాపై విషం, కమ్యూనిజానికి వక్రభాష్యం
ప్రయివేటీకరణ ప్యాకేజి
భారతదేశంలో సైద్ధాంతిక పోరాటం : ప్రత్యేకతలు
పోరాటమే జీవన సూత్రం
కమ్యూనిస్ట్ లీగ్ ఏర్పాటు



epaper.prajasakti.com

# మొదటి పార్టీ మహాసభ-1943

భారత కమ్యూనిస్టు పార్టీ మొదటి మహాసభ 1943లో బొంబాయిలో మే 23 నుండి జూన్ 1 వరకు 8 రోజులు నిర్వహించ బడింది. 15,563 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 139 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆ నాటికి 11 భాషలలో పార్టీ పత్రికలు వెలువడుతున్నాయి. వాటి సర్క్యులేషన్ 60,000 ఉంది. కనీసంగా 6,00,000 మంది ప్రజలు పార్టీ పత్రికలను గాని ఇతర కరపత్రాలు గాని చదువుతారని ఒక అంచనా. మహాసభ జరుగుతున్న నాటికి పార్టీ సభ్యత్వం, కార్మిక సంఘాల సభ్యత్వం, ఇతర ప్రజాసంఘాల సభ్యత్వం పెరుగుతున్న దశలో ఉన్నాయి. దేశంలో ఉన్న కమ్యూనిస్టు గ్రూపులన్నీ కలిసి ఒక కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడిన తరువాత జరిగిన మొదటి మహాసభ అది. 1941లో మహాసభకు కొద్దిరోజుల ముందు గదర్ కీర్తి గ్రూపు పార్టీలో కలిసిపోయింది. ఆ గ్రూపు నాయకుడు బాబా సోహన్ సింగ్ మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యారు.

1933లో కేవలం 150 ఉన్న పార్టీ సభ్యత్వం 1942లో 4,400కి చేరి 1943 మేడే నాటికి 15,563కి పెరిగిందని పార్టీ సభ్యత్వం గురించి మహాసభ నివేదికలో రిపోర్ట్ చేయబడింది. అలాగే 2,637 మంది పూర్తికాలం కార్యకర్తలు పని చేస్తున్నారు. 32,166 మంది స్వచ్ఛంద సేవకులు ఉన్నారు. కిషోర్ వాహిని సభ్యత్వం 9,000, మహిళా సంఘాల సభ్యత్వం 41,100 ఉంది. (అందులో 700 మంది పార్టీ సభ్యులు ఉన్నారు). ఆ కాలంలో మొత్తం పార్టీ సభ్యత్వంలో 5 శాతం మహిళలు గల ఏకైక పార్టీ ఇదే. విద్యార్థి సంఘ సభ్యత్వం 39,155, కిసాన్ సభ సభ్యత్వం 3,85,370 (ఇందులో 5,500 మంది పార్టీ సభ్యులు), కార్మిక సంఘాలలో 3,01,400 మంది సభ్యులు ఉన్నారు(అందులో 4,000 మంది పార్టీ సభ్యులు ఉన్నారు). కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎస్ ఏ డాంగే కార్మిక సంఘానికి, బంకిం ముఖర్జీ కిసాన్ సభకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇది పార్టీ ఆయా తరగతులలో చేసిన పనిని ప్రతిబింబిస్తుంది. పార్టీ మహాసభకు వచ్చిన ప్రతినిధులను చూస్తే పార్టీ ప్రభావం సమాజంలోని అన్ని తరగతులలో ఎంతగా విస్తరించిందో అర్థమవుతుంది. మహాసభలో వచ్చిన అర్హతల పత్రాల ఆధారంగా హాజరయిన 139 ప్రతినిధులలోను 22 మంది కార్మికులు, 25 మంది రైతాంగం, 86 మంది మేధావులు. (అందరూ ప్రజా ఉద్యమాలలో పని చేస్తున్నవారే, మార్క్సిజాన్ని కష్టజీవుల్లలో ప్రచారం చేస్తున్నవారే, పార్టీని కార్మికవర్గంలో పని చేస్తున్న ఒక మార్క్సిస్టుల సమూహం నుంచి పెద్ద రాజకీయ పార్టీగా మార్చినవారు) ముగ్గురు జమీందారులు, ఇద్దరు చిన్న భూస్వాములు, ఒక వ్యాపారవేత్త. ప్రతినిధులతో 13 మంది మహిళలు, ముగ్గురు దళితులు, 13 మంది ముస్లిములు, 8 మంది సిక్కులు, ఇద్దరు పార్శీలు, ఒక జైనుడు ఉన్నారు.

పార్టీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసినా, 695 మంది పార్టీ సభ్యులు మహాసభ జరిగే నాటికి ఇంకా వివిధ జైళ్లలో మగ్గుతున్నారు. అందులో 105 మంది జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్నారు. 70 శాతం ప్రతినిధులు ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ సార్లు జైళ్లలో బందీలుగా జీవితాన్ని గడిపిన వారు. జైళ్లలో గడిపిన సరాసరి కాలం 411 సంవత్సరాలుగా అంచనా వేయడం జరిగింది. వారందరిలోను ఇద్దరు మహిళలు, కమలా ఛటర్జీ, కల్పనాదత్ చెరో ఏడున్నర సంవత్సరాలు జైళ్లలో గడిపారు. 53 శాతం ప్రతినిధులకు రహస్య జీవిత అనుభవం ఉంది. మొత్తం ప్రతినిధులందరు కలిసి 54 సంవత్సరాలు రహస్య జీవితం గడిపారు. పార్టీ మహాసభలకు హాజరైన ప్రతినిధులు పార్టీలో ఉన్న వయో మిశ్రమాన్ని ప్రతిఫలించారు - 68 శాతం 35 సంవత్సరాలలోపు వారే. 1929కి ముందు పార్టీ స్థాపనకు కృషి చేసిన వారు 8 మంది ప్రతినిధులలో ఉన్నారు. ప్రతినిధులతో ఎవరూ చదువు రానివారు లేకపోవడం ఆసక్తికరమైన విషయం. కార్మికులకు, కర్షకులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేకమంది ప్రతినిధులు ఆంగ్ల భాషను తమకు తామే నేర్చుకొని మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్ పుస్తకాలను చదివారు. ఆ సిద్ధాంతాన్ని మన దేశానికి ఎలా అన్వయించాలో గ్రహించ గలిగారు.

మహాసభ 25,000 మంది ప్రజలు హాజరయిన బహిరంగ సభతో ప్రారంభమయింది. కామ్రేడ్ ముజఫర్ అహ్మద్, డాంగే, భయ్యాజీ కులకర్ణి, కలకత్తా నుండి మహిళా నాయకురాలు మణికుంటల సేన్, రైల్వే కార్మికుడు, బొంబాయి కమిటీ కార్యదర్శి డి ఎస్ వైద్య, విద్యార్థి నాయకుడు నెర్గిస్ బాట్లీవాలా అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. బంకిం ముఖర్జీ పతాకావిష్కరణ చేసారు. బాబా సోహన్ సింగ్ భక్నా అమరవీరులకు సంతాపం తెలిపే తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. పార్టీ కార్యదర్శి పి సి జోషి రాజకీయ తీర్మానాన్ని ప్రవేశ పెట్టడానికి 9 గంటల సమయం పట్టింది. బి టి రణదివె, 'కార్మిక వర్గ కర్తవ్యాలు, జాతి రక్షణ' అనే రిపోర్ట్‌ను ప్రవేశ పెట్టారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు మహాసభలో వివిధ నివేదికలు ప్రవేశపెట్టటం, గ్రూప్ చర్చలు జరిగేవి. ఆ చర్చలను మహాసభలో చేసేవారు. మధ్యాహ్న భోజనానికి, రాత్రి భోజనానికి స్వల్ప విరామాలు మాత్రం ఉండేవి. ఆరు సౌహార్ద్ర దేశాలు - గ్రేట్ బ్రిటన్, సౌత్ ఆఫ్రికా, అమెరికా, చీలి, క్యూబా, కెనెడా-మహాసభకు సౌహార్ద్ర సందేశాలు పంపించాయి. శ్రీలంక, బర్మా నుండి ప్రతినిధులు హాజరయ్యారు. చిట్టగాంగ్ వంటి పోరాటాలలో తమ పిల్లలను త్యాగం చేసిన తల్లులు, అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకులు కూడా మహాసభకు తమ సందేశాలను పంపించారు. వారందరూ కమ్యూనిస్టు పార్టీ కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేసారు.

బెంగాల్‌కి చెందిన చిత్త ప్రసాద్ అనే కళాకారుడు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ చిత్రాలను చిత్రించి వాటిని గాంధీ, జిన్నా చిత్రాలతోపాటు మహాసభ వేదికను అలంకరించారు. కాంగ్రెస్, ముస్లింలీగ్ జెండాలుకూడా మహాసభ వేదిక వెనుక అలంకరించబడ్డాయి. ఆ విధంగా చిత్రాలను, జండాలను పెట్టడం పార్టీ రాజకీయ ఎత్తుగడను ప్రతిబింబిస్తుంది - ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యవేదికను నిర్మించడం, కాంగ్రెస్, లీగ్ల ఐక్యతను నొక్కి చెప్పడం, పి సి జోషి ప్రవేశ పెట్టిన రాజకీయ తీర్మానం, జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను, భారత కమ్యూనిస్టు పార్టీ అవలంబిస్తున్న ఎత్తుగడలను, పారిశ్రామిక వ్యవసాయ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకోడానికి

(మిగతా 32వ పేజీలో)



epaper.prajasakti.com

## ఈ సంచికలో...


**1. మొదటి పార్టీ మహాసభ -1943..........** 2

**2. కరోనా మహమ్మారి : వైద్యం ప్రయివేటుపరం, ఉపద్రవాలు సమాజపరం**
అజయ్ గుడవర్తి, జి విజయ్.... 4

**3. మోడీ లాక్‌డౌన్‌లు: వలస కార్మికుల వెతలు**
ఎస్. వెంకట్రావు ....... 9

**4. చైనాపై విషం, కమ్యూనిజానికి వక్రభాష్యం**
ఎంవిఎస్ శర్మ....... 17

**5. ప్రయివేటీకరణ ప్యాకేజి**
ఎ కోటి రెడ్డి ......... 19

**6. భారతదేశంలో సైద్ధాంతిక పోరాటం : ప్రత్యేకతలు**
దేవీప్రసాద్ చటోపాధ్యాయ ..... 24

**7. పోరాటమే జీవన సూత్రం**
కార్ల్ మార్క్స్‌తో ఇంటర్వ్యూ.......... 29

**8. కమ్యూనిస్ట్ లీగ్ ఏర్పాటు**
ఎం శివరామకృష్ణన్ ................. 31



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పెట్టుబడి కర్కశత్వం

పెట్టుబడి చాలా దుర్మార్గమైనది. "100 శాతం లాభాలు వస్తాయనుకుంటే అది అన్ని రకాల మానవ న్యాయ సూత్రాలనూ తుంగలో తొక్కేస్తుంది" అని ప్రఖ్యాత బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ నాయకుడు థామస్ జోసెఫ్ డన్నింగ్ చెప్పిన మాటలను కార్ల్ మార్క్స్ తన పెట్టుబడి గ్రంథంలో ఉటంకించారు. ఈ మాటల్లో ఎంతటి నిజం ఉందో నేడు కరోనా వైరస్ విషయంలో పెట్టుబడిదారీ ప్రపంచం, పెట్టుబడిదారీ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు మన కళ్లకు కడుతోంది.

కరోనా మహమ్మారితో చైనా సతమతవుతున్నప్పుడు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలేవీ దానికి సాయం చేయడానికి ముందుకు రాలేదు. కమ్యూనిస్టు చైనాకు 'శిక్ష'గా భావించాయి. ప్రపంచీకరణ యుగంలో ఒక దేశంలో ప్రబలిన అంటువ్యాధి ఇతర దేశాలకు పాకడానికి పెద్ద సమయం పట్టదన్న హెచ్చరికలను అవి పట్టించుకోలేదు. లాభాలు తెచ్చే ప్రయివేటు విమానయాన రంగాన్ని నియంత్రించడానికి ఏ దేశమూ సిద్ధం కాకపోవడంతో మహమ్మారి విమానాల్లో ప్రపంచ మంతటికీ పాకింది. కరోనా విజృంభించిన తరువాత కూడా పెట్టుబడిదారుల లాభాలు ఏమవుతాయన్న ఆలోచనే మినహా ప్రజలను ఎలా కాపాడాలన్న ఆలోచన లేకపోవడంతో మహ్మమార్మి నేడు అన్ని దేశాల్లోనూ విజృంభిస్తోంది.

"ఇళ్లలో ఉండండి, సురక్షతంగా ఉండండి" అంటూ సెలబ్రిటీలచేత ప్రకటనలు ఇప్పించిన పాలక వర్గాలకు రెండు మాసాలు తిరక్కముందే తత్వం బోధపడింది. తమ దగ్గర పెట్టుబడులు పోగై ఉన్నా కార్మికులు ఇళ్లలో ఉంటే ఉత్పత్తి కాదనీ, లాభాలు రావనీ అర్థమయింది. అందుకే ఇప్పుడు వారిని ఇళ్ల బయటకు రపించేందుకు 'కరోనాతో సహజీవనం', 'సామాజిక రోగనిరోధకం' (సోషల్ ఇమ్యూనిటీ) వగైరా కొత్త కొత్త వాదనలు తెస్తున్నారు.

ఈ వాదనల సారాంశం ఒక్కటే.. కరోనా సోకినా సామాజిక ఉత్పత్తి చేయగల శక్తులకు ఏమీ కాదు. వారు తట్టుకుని నిలబడతారు. చనిపోయే వారిలో ముసలివారు, రోగ నిరోధక శక్తి లేనివారు ఎక్కువగాఉంటారు. ఎటొచ్చీ వీరి వల్ల ఉత్పత్తికీ, పెట్టుబడిదారీ లాభాలకూ ప్రయోజనం లేదు, పైగా పెన్షన్లు వగైరా ఖర్చులు తగ్గుతాయి. లాభాలకు మినహా ప్రజల ప్రాణాలకు విలువనివ్వని ఈ రకమైన ఆలోచనా విధానమే పెట్టుబడిదారీ దేశాల్లో మహమ్మారి విజృంభణకు కారణమవుతోంది. దీనికి భిన్నంగా క్యూబా, చైనా, వియత్నాం వంటి సోషలిస్టు దేశాల్లో ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు, వారి ఆరోగ్యమే పరమావధిగా చర్యలు తీసుకుంటున్నాయి గనకనే అక్కడ మహమ్మారిని కట్టడి చేయగలుగుతున్నాయి. రాజ్యాంగ పరమైన అనేక పరిమితుల్లో పనిచేస్తున్నప్పటికీ కేరళలోని వామపక్ష ప్రభుత్వం కూడా ఇదే మార్గం అనుసరిస్తోంది గనుకనే అక్కడ రోగాన్ని కట్టడి చేయడం సాధ్యపడుతోంది.

మోడీ ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌లో కూడా ఇదే కర్కశత్వం మనకు కనిపిస్తుంది. లాక్‌డౌన్ ముందు నగరాల్లో చిక్కుకు పోయిన కోట్లాది మంది వలస కార్మికుల సంగతి దానికి పట్టలేదు. స్వగ్రామాలకు పంపమంటే పంపలేదు. ఉన్న చోట వారికి ఆహారం, నివాసం లేదు. దాంతో జాతీయ రహదారులపైనా, రైలు పట్టాలు పట్టుకుని లక్షల సంఖ్యలో వలస కార్మికులు ఎండలో, పిల్లా పాపలతో, ఆహారం మంచినీరు లేకుండా వేల కిలోమీటర్లు నడుచుకుంటూ ప్రయాణం సాగించారు. మార్గ మధ్యంలో ప్రమాదాల్లోనూ, ఆకలికి గురయ్యి, జబ్బులతోనూ వందల మంది చనిపోయారు. అయినా మోడీ ప్రభుత్వం వారి నుండి శ్రామిక రైళ్లలో అదనపు ఛార్జీలు వసూలు చేయడం ఎంత కర్కశం. పెట్టుబడిదారులకు రూ. 20 లక్షల కోట్ల ప్యాకేజీలు ప్రకటించిన ప్రభుత్వం సంపద సృష్టించే కోట్ల మంది వలస కార్మికులు, ఇతర కార్మిక వర్గ ఆదాయాలు పెంచే ప్యాకేజీ ఒక్కటీ ప్రకటించలేదు. పైగా ఇదే అదనుగా కార్మిక హక్కులను హరించే అనేక చర్యలు తీసుకుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక్కోసారి మంచిగా కనిపించొచ్చు, మరోసారి కర్కశత్వం బయట పెట్టొచ్చు. కానీ దాని పరమార్థం మాత్రం కార్మికులను శ్రమ దోపిడీ చేసి లాభాలు పోగుచేసుకోవడమే. అందువల్ల ప్రత్యామ్నాయ వ్యవస్థ నిర్మించుకోవడమే మన ముందున్న మార్గం.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100, పోస్టు ద్వారా రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**




epaper.prajasakti.com

# కరోనా మహమ్మారి

## వైద్యం ప్రయివేటుపరం : ఉపద్రవాలు సమాజపరం

**అజయ్ గుడవర్తి**

అసిస్టెంట్ ప్రొఫెసర్
జవహర్‌లాల్ నెహ్రూ
యూనివర్శిటీ,





**జి**

అసిస్టెంట్ ప్రొఫెసర్
హైజివిజయ్ంట్రల్
యూనివర్శిటీ,

**కో**విడ్ 19 మహమ్మారి సాధారణ ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నది. వ్యాధికి, మరణాలకే అది పరిమితం కాలేదు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, నైతిక రంగాలన్నింటా తీవ్రమైన చర్చలను ప్రేరేపించింది. సాధారణంగా ఇలాంటి వ్యాధులు సామాజికంగా, ఆర్థికంగా బలహీనమైన రాజ్యాలను అధికంగా పీడిస్తాయి. కానీ కోవిడ్-19 మహమ్మారి యూరప్, అమెరికా, ఇంగ్లాండ్ వంటి అభివృద్ధి చెందిన సమాజాల్లోనే విజృంభించింది. ఎక్కువ ప్రాణాలను బలితీసుకుంటోంది. ఆయా సమాజాల్లో స్థానికంగా నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా దాని తీవ్రతలో కొంత తేడాలుండొచ్చు.

భారత రాజకీయవ్యవస్థ సమాజంలో సహకారాన్ని, సమాజంపై నమ్మకాన్ని పెంచగల్గివుంటే, అతి తీవ్రమైన ప్రతి స్పర్థలనూ, దోపిడీ సిద్ధాంతాలనూ ముందుకు తీసుకురాకుండా వుండి వుంటే ఈ మరణాలు నివారించబడేవా? ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న, బలహీనమైన ఆర్థిక వ్యవస్థల్లోని నిరుపేదలు, అట్టడుగు వర్గాల ప్రజల రోగాలు, మరణాలకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు తొలిసారి ఎదురౌతున్నాయి.

నయా సరళీకరణ విధానాల మూలంగా ప్రయివేటీకరణ హద్దులు దాటుతోంది. ప్రజావైద్యం, ఇతర ప్రభుత్వ సరుకులు, సేవలు వాణిజ్యపరమవుతున్న రాజ్యం మనది. అలాంటి రాజ్యంలో మార్కెట్ ఆర్థికవ్యవస్థ విఫలమైనందువల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయని అంగీకరిస్తారా? ప్రభుత్వాలు అసమర్ధంగా, నాణ్యత లేకండా ఉండాలనీ, జీవించే హక్కులో వైద్యం భాగమే అన్న అంశం పౌరుల అవగాహనలో లేకుండా చేయాలనీ, అభివృద్ధి పేర హక్కులను కుదించాలనీ నయా వుదారవాదం ప్రచారం చేసింది. ఆ ప్రచారం లేకుంటే ఈనాడు అనేక జీవితాలు కాపాడబడేవా?

అభివృద్ధి కేంద్రంగా పనిచేసే సరళీకరణ విధానాల స్థానంలో, ప్రజలు కేంద్రంగా ఉండే విధానాలను అమలు చేస్తే బహుశా అనేక ప్రాణాలు కోవిడ్ బారిన పడకుండా కాపాడబడేవి. సామాజిక విధాన ప్రాధాన్యతల్లో, ద్రవ్య క్రమశిక్షణపేరుతో ప్రభుత్వ పెట్టుబడులను నిరుత్సాహ పరచకూడదు. నయా ఉదారవాద అభివృద్ధి నమూనాలో స్థూల అభివృద్ధిని పెంచుకునే క్రమంలో, పెద్ద సంఖ్యలో వున్న అసంఘటిత, రక్షణ లేని వలస కార్మికవర్గాన్ని సమాజం నుండి వేరు చేస్తున్నారు. తమ మాటలు, చేతలు, సెక్స్‌పరమైన దురాగతాలతో యజమానులు కార్మికవర్గాన్ని పీడిస్తున్నారు. అవి చాలవన్నట్లు చట్టం వారిని అనాథలుగా మార్చేస్తున్నది. రెగ్యులేటరీ సంస్థలను సంప్రదించేందుకు వారికి అవకాశమే లేదు. పట్టణ అసంఘటిత కార్మికులు దుర్భర దారిద్ర్యంలో వున్నారు. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన గ్రామీణ ఆర్థికవ్యవస్థ నుండి వారందరూ బయటపడుతున్నారు. మనుగడ కోసం అన్వేషిస్తున్నారు. కొందరు అనేక దశాబ్దాలుగా పట్టణ ఆర్థికవ్యవస్థలో కలసిపోతూ అక్కడే స్థిరపడ్డారు.

అలా తరలివచ్చినవారికి యజమానులు వేతనాల్లో భారీగా కోతలు పెడుతున్నారు. తద్వారా వ్యాపారాల్లో తమ పట్టు నిలబెట్టుకుంటున్నారు. మార్కెట్ ఒడిదుడుకులను సర్దుబాటు చేసుకుంటున్నారు. పెట్టుబడి సృష్టించిన గండాల నుండి వారు బయటపడేందుకు ఈ కార్మికవర్గాన్ని పావులుగా ఉపయోగించుకుంటోంది.

### వైద్యం ప్రైవేటుపరం, ఉపద్రవాలు సమాజపరం

2018 ఆరోగ్య సూచికల ప్రకారం 2015లో దిగువ మధ్యతరగతి దేశాల్లో ప్రజలు తమ ఆరోగ్యంపైన సగటు ఖర్చు ఆయాదేశాల జిడిపిలో 2.5శాతంగా వుంది. అది భారతదేశంలో ఒక శాతంగా వుంది.

ఇది కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి నమూనాలకు మాత్రమే పరిమితం కాదు. రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుంది. ఆసుపత్రుల్లో సరైన మౌలిక సదుపాయాలు లేనందున పెద్ద సంఖ్యలో పసిపిల్లలు మరణిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆధిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం, రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై ధోరణులకు సరైన నమూనాలు. క్రింది ముఖ్యమైన అంశాన్ని పరిశీలిద్దాం :

ప్రస్తుత ప్రభుత్వ హయాంలో, వైద్యరంగానికి కేటాయింపులపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇప్పట్లో అలాంటి ఆంక్షలు రద్దయ్యే అవకాశాలు లేవు.

ప్రధానమంత్రి జన ఆరోగ్య



epaper.prajasakti.com

యోజన(పియంజెఎవై)వంటి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్నది. పరిమితమైన మాధ్యమిక, తృతీయస్థాయి వైద్య సేవలకు ఉద్దేశించిన ఆరోగ్య బీమా ఆధారిత పథకాలకు నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ప్రజలకు భారీగా అవసరమైన ప్రాథమిక, మాధ్యమిక స్థాయి వైద్యసేవలను పణంగా పెడుతున్నారు. ప్రైవేటు వైద్య ఇన్సూరెన్స్ కంపెనీలకు లబ్ధి చేకూర్చుతున్నారు.

లోపభూయిష్టమైన ఇన్సూరెన్స్‌పై ఆధారపడిన ప్రజావైద్య రంగం, కొన్ని రాష్ట్రాల్లో ఒక పథకం ప్రకారం నిర్లక్ష్యం చేయబడుతున్నది. ప్రధానంగా లక్షలాది ప్రజలు ఆధారపడిన గ్రామీణ ప్రాథమిక, మాధ్యమిక వైద్య వ్యవస్థ సరైన మౌలిక సౌకర్యాలు లేక నిర్లక్ష్యానికి గురౌతున్నది. ఈ సమస్యను పరిష్కరించటంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. పైగా పియంజెఎవై పథకం సమస్యను మరింత జటిలం చేసింది. దీనికితోడు, ప్రయివేటు వైద్య కళాశాలలకు తరలివస్తున్న పెట్టుబడులు పరిస్థితిని మరింత అధ్వాన్నంగా మార్చేస్తున్నాయి. కార్పొరేట్ వైద్యశాలలు నడుపుతున్న తీరు ఆరోగ్య రక్షణ స్వభావాన్ని వ్యాపారాల స్థాయికి దిగజార్చింది. ఆరోగ్య రక్షణలో ఫలితాల బేరీజు కంటే, ఆర్థిక లావాదేవీల బేరీజులే అధిక ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈ పరిణామం వైద్యవృత్తిలో నైతిక ప్రమాణాలతోపాటు, వైద్యపరమైన సంఘీభావంపట్ల కూడా నమ్మకాన్ని క్షీణింపచేసింది.

ప్రణాళికా బద్ధమైన పరీక్షల నిర్వహణ, వ్యూహాత్మక క్వారంటైన్ పద్ధతులు లేకపోవటం లాక్‌డౌన్‌ను ఒక అనిశ్చితమైన ప్రక్రియ స్థాయికి దిగజార్చాయి. అత్యధిక కార్పొరేట్ ఆసుపత్రులు తమ సంపాదనా లక్ష్యాలకు అనుగుణంగా వైద్యవృత్తిని మలిచాయి. డాక్టర్లను కమీషన్ ఏజంట్లుగా మార్చారు. ఒకనాడు వైద్యవృత్తిని ప్రాణాలను రక్షించే వృత్తిగా ప్రజలు గౌరవించేవారు. గతంలో ఆ వృత్తిపట్ల నెలకొన్న ఆరాధన, విశ్వాసం సన్నగిల్లి పోయేలా చేశారు. ఎంతో నిజాయితీగా సేవలందించే వైద్యులు కూడా ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక వైద్యశాలల్లో వైద్యసేవలు అందించేందుకు ఉత్సాహం చూపటం లేదు. అక్కడ కనీస మౌలిక సదుపాయాల కొరతతో, సరైన వైద్యసేవలు అందించలేక పోతున్నారు. అలాంటి సందర్భాల్లో రోగులకు నమ్మకం నశించిపోతున్నది. వైద్యులు, సిబ్బందిపై తిట్లు, శాపనార్థాలతోపాటు భౌతికదాడులకూ

❝కార్పొరేట్ వైద్యశాలలు నడుపుతున్న తీరు ఆరోగ్య రక్షణ స్వభావాన్ని వ్యాపారాల స్థాయికి దిగజార్చింది. ఆరోగ్య రక్షణలో ఫలితాల బేరీజు కంటే, ఆర్థిక లావాదేవీల బేరీజులే అధిక ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈ పరిణామం వైద్యవృత్తిలో నైతిక ప్రమాణాలతోపాటు, వైద్యపరమైన సంఘీభావంపట్ల కూడా నమ్మకాన్ని క్షీణింపచేసింది.❞


భారత్‌లో ప్రభుత్వాలు వైద్యాన్ని ప్రైవేటుపరం చేయడంతో ఉపద్రవాలు సమాజపరం అయినాయి

పాల్పడుతున్నారు.

కనీస మౌలిక సదుపాయాల (ఉదా: వాడిపడేసే సిరంజీలతో సహా) కొరత, వైద్యశాలల్లో అవసరాలకు అనుగుణంగా సమర్థత పెరగకపోవటం, సిబ్బంది కొరత( కొత్త నియామకాలు లేవు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెద్ద సంఖ్యలో ఏర్పడిన వైద్యుల ఖాళీలను రాష్ట్ర ప్రభుత్వాలు నింపకపోవటం) –పై సమస్యలన్నిటి ఫలితంగా భారతదేశంలో వైరస్‌కు ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా పరీక్షలు నిర్వహించలేని, క్వారంటైన్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఆ రెండు ప్రక్రియల్లో విఫలమైన నేపథ్యంలో, లాక్‌డౌన్ అంటే అదొక "అనిశ్చిత క్రియ" (యాక్షన్ అన్‌సర్టెనిటి)గా దిగజార్చబడింది. పై వైఫల్యాల మూలంగా లాక్‌డౌన్ శక్తిసామర్థ్యాలపై అనుమానాలు నెలకొంటున్నాయి. లాక్‌డౌన్ కాలంలో భౌతిక దూరాన్ని పాటించాలన్న నియమాన్ని అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమవుతున్నది. పై సమస్యల్లో ఎక్కువ భాగాన్ని పరిష్కరించకుండానే మరొకసారి లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు.

భారత్‌లో వ్యాధిగ్రస్థతకు సంబంధించిన సమాచారం చాలా పేలవంగా వుంది. అందుకే కోవిడ్ 19 విజృంభిస్తున్న కాలంలో ఆ వ్యాధి సమాచారాలను ప్రతివొక్కరూ అనుమానించవలసి వస్తున్నది. సమీప భవిష్యత్తులో ఆర్థిక వ్యయాలను అంచనా వేయటం అత్యంత ప్రాధాన్యతగల అంశం. లాక్‌డౌన్‌ల వల్ల దేశ జిడిపిలో 4 శాతం లేదా 15 నుండి 33 శాతం వరకూ తరుగుదల వుందనుకుంటే అవన్నీ చాలా ముఖ్యమైన సమాచారాలు. ఇంత భారీ నష్టాలకు కారకులు ఎవరు? భవిష్యత్‌లో ఇలాంటి సవాళ్లు ఎదురైతే వాటిని నివారించటం ఎలా?

లక్షలాది వలసకార్మికులు అత్యంత బాధాకరమైన పరిస్థితుల్లో స్వస్థలాలకు చేరుతున్నతీరు హృదయ విదారకంగా వుంది. దేశంలో క్షీణిస్తున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అది అద్దం పడుతున్నది. కుదించుకుపోతున్న జిడిపియే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అసంఖ్యాకమైన కల్పితగాథలు సృష్టించటంలోను,



epaper.prajasakti.com

బైటపడేందుకు ప్రభుత్వం ఢిల్లీ నిజాముద్దీన్ తబ్లిక్ జమాత్ అంతర్జాతీయ సమావేశాలను సాకుగా చూపుతున్నది. పలు కథనాలతో సోషల్ మీడియాలో తనకు అనుకూలంగా ప్రచారం చేపట్టింది. తమ స్వస్థలాలకు చేరేందుకు చేస్తున్న పోరాటంలో లక్షలాది వలస కార్మికులు వందలాది మైళ్లు నడచివస్తున్న బాధాకర, విషాదకర దృశ్యాలు జనం హృదయాలను కలచివేస్తున్నాయి. గర్భిణీ స్త్రీలు, పసిబిడ్డలు, పిల్లలు ఈ దీర్ఘయాత్రలో సాగిపోతున్నారు. పట్టుదలతో సాగిన మితిమీరిన నడకతో కొందరు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విషాదకర దృశ్యాలస్థానే ప్రత్యామ్నాయ దృశ్యాలను ప్రవేశపెట్టారు. ముస్లిం యువత చెంచాలు, పండ్లను నాకుతున్నట్లు, ఆహార పొట్లాలపై, పక్కవారిపై వుమ్ముతున్నట్లు వగైరా వీడియో దృశ్యాలను ప్రవేశపెట్టారు. ఆధిపత్య జాతీయవాదుల కోసం ఈ ప్రత్యామ్నాయ దృశ్యాలు కల్పించారు. ఈ నకిలీ వీడియోలతో దేశంలో కోవిడ్ 19 వైరస్ వ్యాప్తికి తబ్లిక్ జమాత్ సమావేశాలే కారణమని ప్రచారం చేస్తున్నారు.

తబ్లిక్ జమాత్‌లో పాల్గొన్నవారు కొన్ని చట్టాలను వుల్లంఘించి వుండవచ్చు. కానీ అవి లాక్‌డౌన్ నియమాల వుల్లంఘనల వంటివి కాదు. ఇందులో దాగివున్న కుట్రయేమిటో స్పష్టం కావాలి. ఒకటి. ఈ సభలకు ఎందుకు అనుమతి ఇచ్చారు? మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సభల నిర్వహణకు అనుమతిని నిరాకరించింది. రెండవది. అందరికీ వీసాలు ఇచ్చారు. ఇంత జరిగాక అనేకమంది విదేశీయులు దేశ రాజధాని నగరంలో జరిగే సభలకు హాజరౌతున్నట్లు తమకు సమాచారం లేదని కేంద్ర ప్రభుత్వం ఎలా వాదిస్తుంది? చివరిగా విదేశీయులు దేశంలో ప్రవేశిస్తున్నపుడు వారిలో వ్యాధిగ్రస్తులను గుర్తించే పరీక్షలు, నియమ నిబంధనలు ఏమయ్యాయి?

దేశంలో గుర్తించిన కోవిడ్ 19 కేసుల్లో 50శాతం నిజాముద్దీన్ సమావేశాలవల్లే వ్యాపించినట్లు మొదట చెప్పారు. తరువాత ఆ సంఖ్యను 1/3వ వంతుగా కుదించారు. దేశంలో కరోనా రోగుల సంఖ్య పెరిగే కొద్దీ ఆ సంఖ్య మరింతగా పల్చబడింది. ఇపుడు వలస కార్మికులు, వారి వ్యధలు, గాధలు ప్రధానంగా ముందుకు వచ్చాయి. తాబ్లీక్ సమావేశాలకు హాజరైన వారందరినీ గుర్తించారు. వారందరూ క్వారంటైన్ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. దేశవ్యాపితంగా అనేక ప్రాంతాల్లో వైరస్‌కేసులు, మరణాలు వేగంగా పెరుగుతున్నాయి.

> ❝ ప్రపంచంలోని అనేక దేశాలు కరోనా పరిణామాలను నిరంతరం సూచించే రేఖాపటాలను గమనిస్తూ వ్యాధిని అదుపు చేయటంపై కేంద్రీకరిస్తున్నాయి. కానీ భారత ప్రభుత్వం మాత్రం అలాంటి దృష్టితో పనిచేయటం లేదు. తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యాధి గణాంకాల వివరణలిస్తున్నారు. కరోనా సంబంధిత సమస్యలను దైవ నిర్ణయానికి వదిలేశారు. ❞



ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోతే
స్వగ్రామాలకు వెళుతున్న వలస కార్మికులు పెద్ద ఆరోగ్య విపత్తును ఎదుర్కొంటారు

లాక్‌డౌన్‌లను వరుసగా పొడిగిస్తున్నారు. నేటి అభివృద్ధి విధానం ప్రమాదకరమైన నయా ఉదారవాద నమూనా సృష్టిస్తున్న విచ్ఛిన్నాలపై దృష్టి సారించటంలేదు. అదేవిధంగా సోషల్ మీడియాలో అల్లిన తబ్లిక్ కథనాల చెల్లుబాటు, ప్రాధాన్యత, యోగ్యతలపై దృష్టి సారించేందుకు హిందుత్వ మానసిక స్థితి సుముఖంగా లేదు.

ప్రపంచంలోని అనేక దేశాలు కరోనా పరిణామాలను నిరంతరం సూచించే రేఖాపటాలను గమనిస్తూ వ్యాధిని అదుపు చేయటంపై కేంద్రీకరిస్తున్నాయి. కానీ భారత ప్రభుత్వం మాత్రం అలాంటి దృష్టితో పనిచేయటం లేదు. తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యాధి గణాంకాల వివరణలిస్తున్నారు. కరోనా సంబంధిత సమస్యలను దైవ నిర్ణయానికి వదిలేశారు. కోవిడ్‌కు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో దేశవ్యాపితంగా ఏకీభావం, సంఘీభావాలు వెల్లువెత్తవలసి వుంది. అలాంటి స్థితిలో,సామాజిక తరగతుల మధ్య నమ్మకం, సహకారాలను విచ్ఛిన్నం చేసే ప్రమాదకరమైన పాత్రను పాలకులు పోషిస్తున్నారు. నకిలీ వీడియోలతో, మతపరమైన ఉద్రిక్తతలు, విద్వేషాలను పెంచుతున్నారు. హిందుత్వశక్తులు జరుపుతున్న సైద్ధాంతిక ప్రచారాల దుష్ఫలితాలు పై రూపంలో వ్యక్తమౌతున్నాయి. వ్యాధిని ఎదుర్కోవటంలో తన వైఫల్యాలను గుర్తించేందుకు, తన బాధ్యతను అంగీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. మన జనాభాను పరిశీలిస్తే వైరస్‌ను నిరోధించగలమన్న ఆశాభావం కలుగుతుంది. దేశంలో యువజనుల సంఖ్య చాలా ఎక్కువగా వుంది. ఇక్కడి కార్మికులు అపరిశుభ్ర వాతావరణంలో, బాధాకరమైన జీవితాలు గడుపుతూ జీవిస్తున్నారు. అలాంటి జీవితాల నుండే వారు తమ రోగనిరోధకశక్తిని పెంచుకుంటున్నారు. ఈ అంశంలో విఫలమైతే వూహించని విషాదం ఎదురౌతుంది.

**నయా ఉదారవాద హిందుత్వ**

హిందుత్వ, నయా ఉదారవాద సిద్ధాంతాల సంయోగం వల్ల సామాజిక నడవడికలో అనేక పరివర్తనలు జరుగుతాయి. ప్రజల ఆరోగ్య



epaper.prajasakti.com

> **❝ లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు అమలు పరుస్తున్నందు వలన పలుదేశాలు తమ జిడిపిలో 5 నుండి 15శాతం వరకూ ప్యాకేజీని ప్రకటించాయి. కానీ భారత ఆర్థికశాఖామంత్రి ప్రకటించిన ఆర్థిక ఉద్దీపన అతి స్వల్పంగానూ, జిడిపిలో ఒక శాతంలోపు మాత్రమే వుంది. అత్యవసర ఆరోగ్యరక్షణ వసతుల కల్పనకు ఉద్దేశించిన మొత్తం కూడా ఆ ప్యాకేజిలోనే కలిసివుంది. ❞**

నకిలీ డాక్యుమెంట్ల తయారీలోను ప్రభుత్వం అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నది. చురుకైన విమర్శకులను అదుపుచేసేందుకు నిరంకుశ చర్యలకు పాల్పడుతున్నారు. వలసకార్మికుల సంక్షోభంపై ప్రభుత్వానికి కొరవడిన అవగాహనలను ఒక్క లాక్‌డౌన్ స్పష్టం చేసింది. దారితప్పిన ప్రాధాన్యతలతో ప్రస్తుత వ్యవస్థ పాలనలో చురుకుదనాన్ని కోల్పోయినట్లు స్పష్టమౌతున్నది.

మహమ్మారి కబంధహస్తాల నుండి బైటపడేందుకు అనేక దేశాలు ఆర్థిక ఉద్దీపనలు ప్రకటించాయి. ఉదాహరణకు కెనడా ప్రభుత్వం కోవిడ్ 19 వల్ల ఆదాయం కోల్పోయిన ప్రతి కార్మికునికీ నాలుగు నెలల పాటు నెలకు 2వేల డాలర్లు (1.1 లక్షల రూపాయల) వంతున నగదు సహకారం అందిస్తున్నది. ఈ ప్యాకేజి కాంట్రాక్టు కార్మికులకు, గ్రామీణ కార్మికులకు కూడా అమలు చేస్తున్నారు. ఈ వ్యాధి పీడితులకు, వారికి సేవచేస్తున్నవారికి, ఇంటివద్దేవుండి పిల్లల బాధ్యతలు చూసుకుంటున్న వారికి కూడా ఈ నగదు సాయం అందిస్తున్నారు. కోవిడ్ 19 కుదుపును ముందస్తుగా అర్థం చేసుకోగల యంత్రాంగం భారత్‌కు లేదు. లాక్‌డౌన్ కాలంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలు అమలు పరుస్తున్నందు వలన పలుదేశాలు తమ జిడిపిలో 5 నుండి 15శాతం వరకూ ప్యాకేజీని ప్రకటించాయి. కానీ భారత ఆర్థికశాఖామంత్రి ప్రకటించిన ఆర్థిక ఉద్దీపన అతి స్వల్పంగానూ, జిడిపిలో ఒక శాతంలోపు మాత్రమే వుంది. అత్యవసర ఆరోగ్యరక్షణ వసతుల కల్పనకు ఉద్దేశించిన మొత్తం కూడా ఆ ప్యాకేజిలోనే కలిసివుంది.

**శ్రామికులు- విషాదకరమైన వలసలు**

మార్చి 24రాత్రి 21రోజుల లాక్‌డౌన్ ప్రకటించారు. కార్మికుల వేతనాల్లో కోతలు పెట్టరాదని, ఎవరినీ పని నుండి తొలగించరాదని కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఒక ప్రకటన మాత్రం చేసింది. ఆ ప్రకటన అమలుకు ఎలాంటి చట్టబద్ధతాలేదు. అది మినహా లాక్‌డౌన్ బాధితులైన కోట్లాది(ఒక అంచనా ప్రకారం 2.5 నుండి 5కోట్లమంది) కార్మికుల సామాజిక భద్రతకు ఎలాంటి సమగ్ర ప్యాకేజీని ప్రకటించలేదు. ఇంటి అద్దెలు, ఆహార భద్రత, కనీస అవసరాలు పట్టించుకోనందున లాక్‌డౌన్ ఒక ప్రహసనంగా మారింది. లక్షలాది జనం దాన్ని ఉల్లంఘించారు.

అసంఘటిత కార్మికుల పరిస్థితులపై అసంఖ్యాకమైన పరిశోధనా పత్రాలు వెలువడ్డాయి. పనిచేసిన తర్వాత పలు సందర్భాల్లో కార్మికులకు వేతనాలు చెల్లించకపోవటం కూడా వాటిలో ప్రస్తావించారు. ప్రభుత్వానికి అలాంటి పరిస్థితులను తెల్సుకోవాలన్న ఆసక్తివుంటే పై పరిశోధనా పత్రాలను పరిశీలించవచ్చు. ఎదురవబోతున్న వలస కార్మికుల సంక్షోభాన్ని ముందుగా ఆలోచించకుండా ప్రభుత్వం పెద్ద తప్పుచేసింది. వలస కార్మికుల సంక్షోభం మొదలయ్యాక ప్రభుత్వం సుప్రీంకోర్టు ముందుకు వెళ్లవలసి వచ్చింది. ప్రభుత్వం తగు రక్షణ కల్పించి కార్మికుల్లో భయాలను తొలగించి వుండాలి. కానీ అందుకు భిన్నంగా కోవిడ్ 19 సంక్షోభంపై స్వతంత్ర కథనాలు వెలువరిస్తున్న మీడియాకు వ్యతిరేకంగా ప్రభుత్వం అనేక ఆరోపణలు చేయసాగింది.

వలసకార్మికుల సమస్యలపై ముందస్తు సహాయక చర్యలు చేపట్టకుండా ఈ ప్రభుత్వం పెద్ద తప్పు చేసింది. నోబుల్ గ్రహీత ప్రొఫెసర్ అమర్త్యసేన్, ఇటీవలే విడుదలైె బాగా ప్రఖ్యాతిగాంచిన తన పత్రం ''ఆహారం, స్వేచ్ఛ''లో ఇలా వెల్లడించారు : ''నా చిన్నతనంలో భారత్‌ను గొప్ప ప్రజాస్వామ్య దేశంగా భావించాను. కానీ దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలు అంతర్గతంగా నిర్వీర్యం చేయబడతాయని నేను ఏనాడూ వూహించలేదు.'' పై విశ్లేషణను ఈ సందర్భంగా మననం చేసుకోవటం ఎంతో సముచితం. ఎందుకంటే భారత్‌ను చైనాతో పోల్చి చూస్తున్నారు. గతంలో చైనా తనదేశంలో సంభవించిన రాకాసి కరువులో మరణాల సంఖ్యను అరికట్టగల్గింది. చైనా కేంద్రంగా ప్రారంభమైన ప్రస్తుత కోవిడ్ 19 మహమ్మారిని కూడా ఆ దేశం అలాగే ఎదుర్కోగల్గుతున్నది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సేన్ ఒక ముఖ్యమైన వాదనను ముందుకు తెచ్చారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తరువాత భారతదేశం, ఇక్కడి రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులను పోల్చి విశ్లేషించారు.

''భారత రాజకీయాల స్వభావాన్ని పరిశీలిస్తే ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నంగా వుంది. కరువు కాటకాలను ఎదుర్కోవటంలో ముందస్తు చర్యలను చేపట్టాలి. అలా చేయటంలో విఫలమైతే కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్రాల స్థాయిలో అతి పెద్ద రాజకీయ నష్టాలను భరించవలసి వస్తుంది. చురుకైన ప్రతిపక్ష పార్టీలు, స్వేచ్ఛాయుతమైన ప్రసార సాధనాలు లేకుండా కరువుల (కోడ్) విధి విధానాలను యధాతథంగా ప్రజలముందు వుంచటం సాధ్యంకాదు.

ఆ తరువాత భారత్‌ను చైనాతో పోల్చేందుకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వాదనలు ఇలా వున్నాయి : '' 1958-61 మధ్య మూడు సంవత్సరాల పాటు చైనాను భయానక కరువు ఆవహించింది. ఆ కరువు రక్కసి 2.95 కోట్లమంది ప్రాణాలను బలితీసుకుంది. మౌలికమైన విధాన మార్పులు రాకుండా, అంతటి భారీస్థాయి కరువు వివరాలు నమోదు చేయకపోవటం, ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ అంశమే. నాటి ప్రభుత్వాలను స్వేచ్ఛగా విమర్శించి, కట్టడిచేయగల ప్రచార మాధ్యమాలు, శక్తివంతమైన ప్రతిపక్ష పార్టీలు లేకపోవటమే పై వైఫల్యానికి కారణం. కరువు, ఆకలి వల్ల సంభవించిన భారీ మరణాలకు, సమాచార స్వేచ్ఛ, విమర్శనా స్వేచ్ఛ లేకపోవటానికి సన్నిహిత సంబంధంవుందని నిర్ధారించవచ్చు.''

**తబ్లిగీ జమాత్ :ఒక కుట్ర కాదు.నిర్లక్ష్యం**

ఈ ప్రభుత్వానికి సంక్షోభాల పరిష్కారంపై కంటే తన ప్రతిష్టను పెంచుకోవటంపైనే మక్కువ ఎక్కువగా వుంది. అందుకు మీడియాను తమ అదుపులో వుంచుకోవటం అంతకంటే ముఖ్యమైన అంశంగా భావిస్తున్నది. ఈపాటికే వలస కార్మికుల నిష్క్రమణ ప్రభుత్వపు ఏకైక అతిపెద్ద తప్పిదంగా మారింది. వారు తమ స్వస్థలాలకు చేరేందుకు వందలాది మైళ్లు నడిచిపోతున్నారు. వలసల సంక్షోభం నుండి



epaper.prajasakti.com

(రాష్ట్రవాదీ) జపంచేసే బిజెపి ప్రభుత్వం 'భారత్ ఫస్ట్' విధానానికై పట్టుపట్టనేలేదు.

ఒక ప్రజారోగ్య విలయాన్ని మతోన్మాదం వైపు మళ్లించాలని ప్రయత్నం చేస్తున్నప్పటికీ అంతిమంగా కొన్ని హేతుబద్ధ ఆలోచనలు మనుగడలోకి వస్తున్నాయి. ఆరోగ్య రక్షణకు అవసరమైన సేవల కీలక విభాగాల్లో పనిచేస్తున్న వారి అవసరాలను ప్రస్తుత ప్రభుత్వం విస్మరిస్తున్నది. గిరాకీకి దోహదపడుతున్న వారిలో ప్రధాన భాగస్వాములైన లక్షలాది

**❝ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ముందున్న డాక్టర్లతోపాటు ఇతరులందరికీ గౌరవ సూచకంగా చప్పట్లు కొట్టించటం, హారన్‌ల శబ్దాలు చేయించటం, చెంచాలతో ప్లేట్లు, గంటలు మోగించటం ద్వారా వారి సేవలను గుర్తించాలని ప్రధాని పిలుపునిచ్చారు. కానీ అదే ఆరోగ్య సంరక్షకులు తమకు కనీస రక్షణలు కల్పించాలని కోరినందుకు అనేక శిక్షలకు గురిచేస్తున్నారు. తమ పని ప్రదేశంలోని ఇబ్బందులతోపాటు, తమ నివాసాల్లోని కుటుంబ సభ్యులకు వైరస్ సోకుతుందేమోనన్న ఆందోళన వారిని వెంటాడుతున్నది. ❞**

సంరక్షణలో ముందు వరుస యోధులుగా గుర్తించబడుతున్న డాక్టర్లతోపాటు ఇతరులందరికీ గౌరవ సూచకంగా చప్పట్లు కొట్టించటం, హారన్‌ల శబ్దాలు చేయించటం, చెంచాలతో ప్లేట్లు, గంటలు మోగించటం ద్వారా వారి సేవలను గుర్తించాలని ప్రధాని పిలుపునిచ్చారు. కానీ అదే ఆరోగ్య సంరక్షకులు తమకు కనీస రక్షణలు కల్పించాలని కోరినందుకు అనేక శిక్షలకు గురిచేస్తున్నారు. తమ పని ప్రదేశంలోని ఇబ్బందులతోపాటు, తమ నివాసాల్లోని కుటుంబ సభ్యులకు వైరస్ సోకుతుందేమోనన్న ఆందోళన వారిని వెంటాడుతున్నది. అందుకే వారు తమ నివాసాలకు వెళ్లటం లేదు. లేదా ఇళ్లకు దూరంగా వుంటున్నారు. వారి కష్టాలు అంతటితో ముగియ లేదు.



భారత దేశంలో కరోనా మహమ్మారిని సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే ముందుగా మతపరంగా ప్రజల మధ్య అనైక్యతను సృష్టించే శక్తులను అదుపు చేయాలి

(గతంలో పశువుల కళేబరాలను శుద్ధిచేసే శ్రామికులపై, వైరస్‌లను వ్యాప్తి చేస్తున్నారని ఆరోపిస్తూ మూక దాడులు చేసేవారు. ఆ సంస్కృతి కొనసాగింపుగానే ఈ దాడులు). వైరస్ వ్యాప్తికి ఆరోగ్య రక్షణ సిబ్బందే ప్రధాన కారకులని ఆరోపిస్తున్నారు. ఆ సాకుతో తమ నివాసాలను ఖాళీచేసి దూరంగా వెళ్లాలని వత్తిడి చేస్తున్నారు.

ఈ విధంగా పరివర్తన చెందిన నీచమైన సిద్ధాంతాల సమూహం అంతర్జాతీయ వలసదారులకు, అంతర్గత వలసదారులకు మధ్య వివక్షను పురిగొల్పుతున్నది. మొదటివారికి స్వీయ క్వారంటైన్ పాటించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ఫలితంగా విదేశాల నుండి దేశంలోకి వస్తున్న వారి సంఖ్యకు, క్వారంటైన్ చేసినవారి సంఖ్యలకు బారీ తేడా కన్పిస్తున్నది. వాస్తవంగా వైరస్ సోకిన అంతర్జాతీయ వలసదారులను రోగుల్లా కాకుండా సెలబ్రిటీలుగా పరిగణిస్తున్నారు. వారు పార్టీలకు, సామాజిక కార్యక్రమాలకు హాజరౌతూ అనేక మంది ప్రాణాలకు ముప్పుతెస్తున్నారు. వేరొక వైపున తమ ప్రాణాలకు తెగించి తమ స్వస్థలాలకు చేరేందుకు బయలుదేరిన దేశీయ వలసదారులను వారి సొంత రాష్ట్రాల సరిహద్దుల్లోనే ఆపేశారు. వైరస్‌ల నిరోధానికి వాహనాలపై చల్లే పురుగుమందులను వలస కార్మికులపై పిచికారీ చేస్తున్నారు. లేదా, వైరస్ సోకనివారిని కూడా తాత్కాలికంగా ఏర్పరచిన గుడారాల్లోకి తరలించి క్వారంటైన్ చేస్తున్నారు. ఆదరా బాదరా ప్రపంచాన్ని చుట్టివచ్చిన ఉన్నత వర్గీయులను నయా ఉదారవాద సమర్ధకులు సత్కరించి బహుమతి ప్రదానాలు చేస్తున్నారు. వేరొక వైపున వైరస్ ఈ ఇరువురి పట్ల వివక్ష చూపించటం లేదు. పరివర్తన చెందిన సైద్ధాంతిక మహమ్మారి యొక్క 'జాతీయత' నిర్వచనాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటున్నారు. మరణాలను తగ్గించగల ఔషధాల ఎగుమతుల కోసం డోనాల్డ్ ట్రంప్ బెదిరింపుకు ప్రధాని మోడీ లొంగిపోయాడు. నిరంతరం హిందుత్వ ప్రేరిత_జాతీయత అసంఘటిత నిరుపేద శ్రామికులను నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రభుత్వ బాధ్యతారాహిత్య వైఖరితో వైరస్ విజృంభణ ప్రమాదకర స్థాయికి చేరుతుంది. అందుకే ఈసారి ప్రభుత్వం తన ప్రమాదకరమైన విధానాలను సరిచేసుకుని మరణాలను అదుపుచేస్తుందని ఆశిద్దాం.

నయా ఉదారవాదం సిద్ధాంతంపై పునరాలోచన రావాలి. అది సమిష్టి తత్వాన్ని సమాధి చేస్తుంది. వ్యక్తి తత్వమే ఏకైక వాస్తవంగా గుర్తిస్తుంది. 2008 ప్రపంచ ఆర్ధిక సంక్షోభాన్నే అది విస్మరించింది. సమాజానికి తన అవసరానికి సంబంధించిన అది అతిపెద్ద సవాలును అది ఎదుర్కొంటున్నది. తద్వారా ప్రజల భాగస్వామ్యం కేంద్రంగా ఉండే అభివృద్ధి విధానాల వైపు మారాలని వత్తిడి పెరుగుతుంది. భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాల నివారణకు ప్రపంచం సమిష్టిగా కృషిచేసే దిశగా అది మార్పుచెందుతుంది.

**(అనువాదం: వై సిద్ధయ్య)**



epaper.prajasakti.com

ఈ మాసం ప్రత్యేకం

# మోడీ లాక్‌డౌన్‌లు: వలస కార్మికుల వెతలు



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకుడు

**ఎస్ వెంకట్రావు**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విధించిన లాక్‌డౌన్ దేశమంతటా అమలవుతున్న వేళ వేలాది మంది వలస కార్మికులు రహదారులు, రైల్వే లైన్లు పట్టుకుని వందలు, వేల కిలో మీటర్ల దూరంలో ఉన్న స్వగ్రామాలకు నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలు మానవత్వమున్న ప్రతి మనిషినీ కలచివేశాయి. ఢిల్లీ, ముంబయి, చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాల్లోనే కాక పనుల కోసం వెళ్లి వివిధ ప్రాంతాల్లో చిక్కుకు పోయిన వలస కార్మికులు పిల్లాజెల్లత్తో సామానులు పట్టుకుని కాలినడకన, కొందరు సైకిళ్లపైనా స్వగ్రామాలకు పయనమయ్యారు. అలా వెళుతున్న వందలాది మంది మార్గ మధ్యంలో ఆకలి చావుల బారిన పడ్డారు. అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. ఇంకొందరు వేసవి కాలం ఎండ తట్టుకోలేక వడదెబ్బకు మృతి చెందారు. మార్చి 24న ప్రధాన మంత్రి లాక్‌డౌన్ ప్రకటించిన తరువాత మే 18 వరకు కేవలం రోడ్డు ప్రమాదాల్లోనే 159 మంది వరకు వలస కూలీలు చనిపోయారని, 630 మంది గాయపడ్డారని సేవ్ లైఫ్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది.

పై ఘటనలన్నీ పత్రికల్లోనూ, మీడియాలోనూ వచ్చిన నివేదికలను బట్టి తెలిసినవే. మీడియాలో రాకుండా ఇంకా ఎన్ని రోడ్డు ప్రమాద మరణాలు సంభవించాయో చెప్పలేం.

రోడ్డు ప్రమాదాలు కాకుండా ఆకలితో, గుండెపోటుతో, వడదెబ్బతగిలి అనేక మంది మరణించారు. వీటికి సంబంధించిన వార్తలు కొన్ని స్థానిక మీడియాలో వచ్చినా ప్రధానంగా జాతీయ మీడియా వీటి గురించి పెద్దగా పట్టించుకోలేదు. వలస కార్మికుల వెతలు ప్రభుత్వాలకే కాకుండా, మీడియాకు కూడా పట్టలేదు. ఒక అంచనా ప్రకారం కరోనా వైరస్ వ్యాధి సంక్రమించిన తరువాత కనీసం 189 మంది కార్మికులు తమ స్వగ్రామాలకు తిరిగి వెళుతూ ఆకలితో, నీరసంతో, వడదెబ్బ తగిలి, కొందరు ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. వలస కార్మికుల ఈ దుస్థితికి కారణమేమిటి?

**మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి**

మోడీ ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించే ముందు వలస కార్మికుల గురించి, వారి ఆహారం, నివాసం, భద్రత మొదలైన అంశాల గురించి అస్సలు పట్టించుకోకపోవడం వల్లనే వారికీ దుస్థితి వచ్చింది. నిజానికి లాక్‌డౌన్ విధించే ముందే కేంద్ర ప్రభుత్వం వీరి గురించి ఆలోచించాల్సింది. సమయం లేదనడానికి కరోనా వైరస్ అకస్మాత్తుగా వచ్చింది కూడా కాదు. జనవరి 30వ తేదీన మన దేశంలో మొదటి కరోనా వైరస్ కేసు కేరళలో బయటపడింది. అప్పటి నుండి దేశంలో కరోనా కేసులు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. ఈ కాలంలో, దాదాపు రెండు మాసాల పాటు కళ్లు మూసుకున్న కేంద్ర ప్రభుత్వం మార్చి 23న జనతా కర్ఫ్యూ విధించింది. వెనువెంటనే మార్చి 25 నుండి 21 రోజులు లాక్‌డౌన్ విధిస్తున్నట్లు నాలుగు గంటల ముందు అకస్మాత్తుగా ప్రకటించింది. తరువాత దాన్ని నెలల తరబడి పొడిగించుకుంటూ వచ్చింది. ఇంత సుదీర్ఘ కాలం బయటకు వెళ్లకుండా తట్టుకోగల వనరులు ధనికులు, ఎగువ మధ్యతరగతి ప్రజల వద్ద ఉండొచ్చు. కానీ అసంఘటిత కార్మికులు, ముఖ్యంగా వలస కార్మికులు రోజువారీ లేక వారం బట్వాడాల మీద ఆధారపడే వారి పరిస్థితి ఏమిటి అనే విషయం ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఇంత మంది వలస కార్మికులున్నారా అని సామాన్య ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యేంతగా ఈ తిరుగు వలసలు జరిగాయి. కానీ దేశంలో ప్రభుత్వ పెద్దలకు మాత్రం ఈ విషయం తెలియందేమీ కాదు. "మన దేశంలో వలస కార్మికుల సంఖ్యా వివరాలు లాక్‌డౌన్ విధించే టప్పటికే బహిరంగంగానే అందుబాటులో ఉన్నాయి" అని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా చెప్పారు. ప్రభుత్వ అంచనాల ప్రకారమే 12 కోట్ల మంది వలస కార్మికులు పెద్ద నగరా ల్లోనూ, పట్టణాల్లోనూ ఉన్నారు. వీరిలో రాష్ట్రాలు దాటి వచ్చిన వారు న్నారు, అదే రాష్ట్రంలో ఇతర జిల్లాలకు వలస వెళ్లిన వారున్నారు. అంతర్రాష్ట్ర వలస కార్మికులు 7 కోట్లకు పైన ఉంటారని అంచనా. వీరంతా యూపి, బీహార్, బెంగాల్, ఒడిషా వంటి రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల నుండి పొట్ట గడవడానికి పనులకోసం వలస వచ్చిన వారు. మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, ప్రకాశం, అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాలనుండి పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు, రాష్ట్రంలోనే ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు.

నిజానికి 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ప్రజల్లో 37 శాతం మంది అంటే 45 కోట్ల మంది ఏదో ఒక రకంగా దేశంలో ఒక చోటునుండి మరో చోటికి వలసలు పోతున్నారు. వీరిలో 33 శాతం మంది 15-29 ఏళ్ల మధ్య యువకులు. 1.5 కోట్ల మంది పిల్లలు కూడా వలసలు పోయే వారిలో ఉన్నారు. అయితే దేశం లోపల వలసలు పోయేవారిలో మూడింట నాలుగు వంతుల మంది ఆయా జిల్లాల్లోపలే ఉంటున్నారు. మిగిలిన వారు సుమారు 12 కోట్ల మంది ఇతర జిల్లాలకూ, ఇతర రాష్ట్రాలకు కూలి పనుల కోసం వలస పోతున్నారు.



epaper.prajasakti.com

అందలేదని 96 శాతం మంది చెప్పారు. 70 శాతం మందికి భోజనం కూడా అందలేదు. ప్రభుత్వం నుండి ఎటువంటి నగదు సాయం కూడా అందలేదని 98 శాతం మంది చెప్పారు. చేతిలో వంద రూపాయలు కూడా లేని వలసకార్మికులు 90 శాతానికి పైగా ఉన్నారు. తగినంత సమయం ఉన్నప్పటికీ కోట్ల సంఖ్యలో ఉన్న ఈ వలస కార్మికుల బాగోగులు పట్టించుకోకుండా లాక్‌డౌన్ ప్రకటించడం అంటే దేశ ప్రధానికి, ప్రభుత్వానికీ వారు కనీసం మనుషుల్లాగా కూడా కనిపించలేదన్నమాట.

### చట్టాలు - హక్కులు

మోడీ ప్రభుత్వం చేపట్టిన కార్మిక చట్ట సంస్కరణల ఎజెండాలో భాగంగా...వలస కార్మికులకు ఉన్న ఏకైక చట్టం 'అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979' ను రద్దు చేస్తోంది. దేశంలోని మొత్తం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 కార్మిక వ్యతిరేక కోడ్‌లు ఏర్పాటు చేసే క్రమంలో ఈ చట్టాన్ని కూడా రద్దు చేసింది. ఇది కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను నాశనం చేయడమే. తమంతట తాముగా వలస వెళ్ళిన కార్మికులను మినహాయించి, కాంట్రాక్టర్ల ద్వారా వెళ్ళిన వలస కార్మికుల సమస్యలకు మాత్రమే ఉద్దేశించబడిన '1979 చట్టం' అసంపూర్ణ మైనదే అయినప్పటికీ... కాంట్రాక్టర్ల ద్వారా వెళ్ళిన వలస కార్మికుల చెల్లింపులకు, వారి స్వస్థలాలకు వెళ్ళడానికి ఉచిత ప్రయాణ ఏర్పాట్లకు హామీ ఇస్తుంది.

### మోడీ ప్రభుత్వ అమానవీయత

క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన రిపోర్టుల ప్రకారం అంతర్ రాష్ట్ర వసల కార్మికుల్లో 2.5 కోట్ల మంది స్వస్థలాలకు తిరిగి పయనమయ్యారు. 2 కోట్ల మంది కార్మికులు ఇప్పటికీ పని ప్రదేశాల్లోనే చిక్కుకున్నారు. వీరికి ఎలాంటి ఆహారం కానీ, ఆర్థిక సాయం కానీ ఇంతవరకు అందలేదు. వీరిలో చాలా మంది ఆకలి చావులకు చేరువకు వెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో పేద కార్మికులకు అన్ని విధాలా ఆపన్న హస్తం అందించి ఆదుకోవలసిన నరేంద్ర మోడీ ప్రభుత్వం అలా చేయకపోగా వారిపట్ల అమానుషంగా వ్యవహరించింది.

ప్రభుత్వం మార్చి 26న ప్రకటించిన తొలి అరకొర సహాయక చర్యల ప్యాకేజీలో వలస కార్మికుల ఊసే లేదు. వీరిని ఆదు కోవడం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రభుత్వం వీరిని యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. పారిశ్రామిక వేత్తల కోసం 20 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించిన బిజెపి ప్రభుత్వానికి దేశ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వలస కార్మికులకు ప్యాకేజీ ప్రకటించడానికి చేతులు రాలేదు.

"ప్రభుత్వం మార్చి 26న ప్రకటించిన తొలి అరకొర సహాయక చర్యల ప్యాకేజీలో వలస కార్మికుల ఊసే లేదు. వీరిని ఆదు కోవడం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రభుత్వం వీరిని యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. పారిశ్రామిక వేత్తల కోసం 20 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించిన బిజెపి ప్రభుత్వానికి దేశ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వలస కార్మికులకు ప్యాకేజీ ప్రకటించడానికి చేతులు రాలేదు."



ఢిల్లీ నుండి యూపీలోని స్వగ్రామాలకు వేల కిలో మీటర్లు రోడ్లపై నడుచుకుంటూ వెళుతున్న వలస కార్మికులు

ఈ పరిస్థితుల్లో వలసకార్మికులు తమ వద్ద ఉన్న కొద్దిపాటి వస్తువులు అమ్ముకుని సైకిళ్లు కొనుగోలు చేసి వాటిపై ప్రయాణం సాగించారు. కొందరు అధిక డబ్బుకు వాహనాలు మాట్లాడుకుని స్వగ్రామాలకు పయనమయ్యారు. అవేవీ లేని వారు కాలి నడక ప్రారంభించారు. అయితే ఇలా బయల్దేరిన వారిని రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో ప్రభుత్వం అడ్డుకుంది. సరిహద్దు దాటి వచ్చే వలసకార్మికులను క్వారంటైన్స్ కమ్ షెల్టర్స్‌కు తరలిస్తామని బెదిరించింది.

చివరికి మీడియాలో వీరి వెతలు చూసిన ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం శ్రామిక రైళ్లు ఏర్పాటు చేసి వారిని స్వస్థలాలకు పంపుతామని ప్రకటించింది. అయితే అప్పుడు కూడా మోడీ ప్రభుత్వం ఆకలి అంచులకు చేరిన కార్మికులనుండి రైలు టిక్కెట్ల కోసం అదనపు ఛార్జీలు పిండి వసూలు చేసింది. దీనిపై దేశమంతటా ఆగ్రహం వ్యక్తం కావడంతో ఛార్జీల్లో కొంత భాగం రైల్వేలు భరిస్తాయని ప్రకటించి చేతులు దులుపుకుంది. అయితే అప్పటికే అత్యధిక కార్మికులు భరించలేని ఛార్జీలు చెల్లించి ఇళ్లకు చేరుకున్నారు.

దీంతోబాటు కొన్ని రాష్ట్రాల్లో పోలీసులు, అధికార యంత్రాంగం వలస కార్మికులపై దారుణమైన నిర్బంధాన్ని ప్రయోగించారు. ఉత్తర ప్రదేశ్‌లో వలస కార్మికులను మందలుగా కూర్చోబెట్టి వారిపై విష రసాయనాలు పిచకారీ చేశారు. ఈ కిరాతక చర్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. ఆంధ్ర ప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల్లో వలస కార్మికులపై పోలీసులు లాఠీ చార్జీకి పాల్పడ్డారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులను తాము రాష్ట్రంలోకి రానివ్వబోమంటూ అమానవీయంగా వ్యవహరించారు.

### మానవతా సహాయం

అయితే వలస కార్మికుల వెతలు చూసిన ప్రజల నుండి మానవతా స్పందన పెద్ద ఎత్తున



epaper.prajasakti.com

> **" ప్రపంచీకరణ విధానాల వల్ల దేశంలో ఏర్పడిన వ్యవసాయ సంక్షోభం వలసలకు ప్రధాన కారణం. దానికి తోడు నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు స్థిరమైన ఉద్యోగాలు లేకుండా చేశాయి. అసంఘటిత రంగం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, వ్యవసాయం గిట్టుబాటు కాక చిన్న రైతులు పనులకోసం నగరాలు, పట్టణాల బాట పడుతున్నారు. "**

భవన నిర్మాణాలు, రోడ్లు, కర్మాగారాలు, హోటళ్లు, ఇంటి పనులు, వ్యవసాయ పనులు వగైరా అనేక పనుల్లో వీళ్లు కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నారు. ఎక్కడ ప్రాజెక్టులు నిర్మాణం జరిగినా అక్కడ వలస కార్మికులే పనిచేస్తారు. రోడ్డు పక్క దాబాల్లో పని దగ్గరినుండి రోడ్ల నిర్మాణం వరకు, ఇటుక బట్టీ పనుల నుండి ఫ్లైఓవర్ పనుల వరకు అన్ని చోట్లా మనకు వీరి శ్రమే కనిపిస్తుంది. నిజానికి ఆధునిక భారత నిర్మాణంలో వలస కార్మికులది ముఖ్యమైన పాత్ర.

### ఎందుకీ వలసలు?

ప్రపంచీకరణ విధానాల వల్ల దేశంలో ఏర్పడిన వ్యవసాయ సంక్షోభం వలసలకు ప్రధాన కారణం. దానికి తోడు నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు స్థిరమైన ఉద్యోగాలు లేకుండా చేశాయి. అసంఘటిత రంగం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, వ్యవసాయం గిట్టుబాటు కాక చిన్న రైతులు పనులకోసం నగరాలు, పట్టణాల బాట పడుతున్నారు. పట్టణాలు, నగరాల్లో కూడా పనులు దొరక్క, దొరక్క పనులు దొరికే చోటుకు వలసలు పోతున్నారు. ప్రయివేటు యజమానులు, కాంట్రాక్టర్లు తమ ప్రయోజనాల కోసం ఈ వలసలను ప్రోత్సహిస్తున్నారు. ఆయా ప్రాజెక్టుల్లో యజమానులు ఆ ప్రాంతాల్లోని కార్మికులచేత పనిచేయించుకునే కన్నా ఇతర ప్రాంతాలనుండి, ముఖ్యంగా బాగా వెనుకబడి ప్రాంతాలనుండి కూలీల వలసలు ప్రోత్సహిస్తే యజమానులకు లాభం. ఎందుకంటే వలస కార్మికుల చేత యజమానులు రోజుకు 12 గంటలకు పైనే పనిచేయించు కుంటారు. స్థానిక కూలీల కన్నా తక్కువ వేతనాలిస్తారు. కాంట్రాక్టర్లను ప్రోత్సహించి వెనుకబడిన ప్రాంతాలనుండి కూలీలను తెప్పించుకుంటారు. వారికి సరైన సదుపాయాలుండవు. ప్రమాదాలు జరిగినా అడిగే వారుండరు. దూర ప్రాంతాల



**మే 17న యుపిలో రోడ్డుపై నడుస్తూ ఆకలితో మరణించిన 60 ఏళ్ల వలస కార్మికుడు విక్రమ్**

నుండి వస్తారు గనుక, పైగా వివిధ రాష్ట్రాల నుండి, వివిధ భాషలు మాట్లాడే వారు వస్తారు గనుక సమ్మెలు, ఆందోళనలు చేసే అవకాశాలు తక్కువ. ప్రభుత్వాలు, కార్మిక శాఖ అధికారులు వీరిని పట్టించుకోరు. ఈ విధంగా యజమానుల దురాశ, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల దేశంలో వలస కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది.

### వలస వెతలు

రెక్కాడితేగాని డొక్కాడని బడుగు జీవులైన వలస కార్మికులు ఈ దేశంలో పుట్టినప్పటికీ భారత పౌరులుగా లెక్కల్లో ఉండరు. దేశ సంపద సృష్టికర్తలైన వీరు పని చేసే ప్రాంతంలో ఎలాంటి హక్కులకు, ప్రయోజనాలకు నోచుకోరు. ఓటు హక్కు ఉండదు. చాలా మందికి రేషన్ కార్డులుండవు. కాబట్టి ప్రభుత్వాలు ఇచ్చే సదుపాయాలు వారికి రావు. ఎక్కువ మంది కాంట్రాక్టుమీద పనికి వస్తారు గనుక ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలకు దూరంగా ఉంటారు. ప్రమాదం జరిగినా పట్టించుకునే వారుండరు. పని భద్రత అస్సలు ఉండదు. సమాజం దృష్టిలోనే కాదు కార్మిక శాఖ దృష్టిలో కూడా వీరు 'కనిపించని' కార్మికులు

వీరంతా కటిక పేదలు, సామాజికంగా అణచివేతకు గురైన వర్గాల నుంచి వచ్చిన వారు. జాతీయ శాంపిల్ సర్వే, భారత మానవాభివృద్ధి సూచి (ఐహెచ్‌డిఎస్) సర్వేలు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ వలస కార్మికుల్లో ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి, పేదరిక ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన అత్యంత పేదలు. అందులోనూ ఎస్టీ, ఎస్సీ, ఇతర వెనుకబడిన తరుగతులకు చెందినవారే ఎక్కువ. వీరిలో ఎక్కువ మంది వెట్టిచాకిరీ, అక్రమంగా తరలించబడిన శ్రామికులుగా ఉన్నారు. వీరి పని స్వభావాన్ని మూడు 'డీ' లుగా పరిగణిస్తారు. అవి డర్టీ (మురికి), డేంజరస్ (ప్రమాదకరం), డిఫికల్ట్ (క్లిష్టతరం). వీరు ఇప్పుడు ఇంకొక 'డీ' ని కూడా ఎదుర్కొంటున్నారు. అదే డిస్క్రిమినేషన్ (వివక్ష). వలస కార్మికుల్లో 70 శాతం మంది పట్టణ, దాని శివార్లలో అభివృద్ధి జరుగుతున్న కేంద్రాల చుట్టు పక్కల ప్రాంతాల్లో నివసిస్తారు. అక్కడ వారికి ఎటువంటి మౌలిక సదుపాయాలు ఉండవు.

'జాతీయ శాంపుల్ సర్వే' ప్రకారం 1992-93 నుంచి 2007-08 మధ్య కాలంలో వలస వచ్చిన కుటుంబాలలో మిగతా వారికంటే షెడ్యూల్డ్ తెగలకు చెందిన కుటుంబాలు ఎక్కువగా వున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఆదివాసీ ప్రజలను నిరాశ్రయులను చేస్తూ వారి భూమిని, అడవి ఆధారిత వనరులను చేజిక్కించుకునే చర్యలు వేగవంతం కావడంతో వలస కార్మికులుగా మారే ఆదివాసీల సంఖ్య పెరుగుతోంది.

ప్రభుత్వం అకస్మాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించడంతో అప్పటికే పని చేసిన కాలానికి యజమాని జీతం అందకుండా పోయింది. దీంతో చాలా మంది వలసకార్మికులు తమ యజమానులు లేదా కాంట్రాక్టర్లు, లేదా అద్దె యజమానుల నుంచి అప్పు లేదా అడ్వాన్స్ రూపంలో తీసుకుని నెట్టుకురావాల్సి వస్తోంది.

లాక్‌డౌన్ మధ్యలో ఏప్రిల్ 9న 'స్వాన్' (నిలిచిపోయిన వలస కార్మికుల సహాయ సంస్థ) అనే స్వచ్ఛంద సంస్థ 11,000 మంది వలస కార్మికులను సర్వే చేసి నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం 50 శాతం మంది వలస కార్మికులకు ఒక్క రోజుకు సరిపడా రేషన్ మాత్రమే ఉంది. 72 శానికి రెండు రోజులకు సరిపడ్డా రేషన్ ఉంది. ప్రభుత్వం నుండి ఎటువంటి రేషన్



epaper.prajasakti.com

> **“ వలస కార్మికులకు సహాయం చేయడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గొప్ప కృషి చేసింది. ముఖ్యంగా మన రాష్ట్రంలో పెద్ద పెద్ద పార్టీలు, అధికారంలో ఉన్న వారు వలస కార్మికుల పట్ల కేవలం నోటి మాటలతో సానుభూతి ప్రకటించి ఊరుకుంటే సిపిఐ(ఎం) పార్టీ చిన్నదే అయినా జాతీయ రహదారులపై నడిచి వెళుతున్న వలస కార్మికులను ఆదుకో వడంలో పెద్ద కృషి చేసింది. ”**

వచ్చింది. స్వచ్ఛంద సంస్థలు ఎక్కడి కక్కడ వారికి ఆహారం, నీరు అందించడం ప్రారంభించాయి. మన రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, మానవతా వాదులు, వివిధ ప్రజాసంఘాలు ముందుకు వచ్చి జాతీయ రహదారులపై శిబిరాలు నిర్వహించి వలస కార్మికులకు ఆహారం, మంచినీరు అందించాయి. రాష్ట్ర ప్రభుత్వం తొలుత సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి వలస కార్మికులనెవ్వరినీ అనుమతివ్వలేదు. ప్రజల నుండి మీడియా నుండి వొత్తిడి రావడంతో తరువాత అనుమతించింది. జాతీయ రహదారులపై ఒకటి రెండు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేసి వారికి ఆహారం, మంచినీరు అందించింది. ఆర్‌టిసి, ప్రయివేటు బస్సులను ఏర్పాటు చేసి రాష్ట్ర సరిహద్దుల వరకు పంపింది.

**సిపిఐ(ఎం) సహాయం**

వలస కార్మికులకు సహాయం చేయడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గొప్ప కృషి చేసింది. ముఖ్యంగా మన రాష్ట్రంలో పెద్ద పెద్ద పార్టీలు, అధికారంలో ఉన్న వారు వలస కార్మికుల పట్ల కేవలం నోటి మాటలతో సానుభూతి ప్రకటించి ఊరుకుంటే సిపిఐ(ఎం) పార్టీ చిన్నదే అయినా జాతీయ రహదారులపై నడిచి వెళుతున్న వలస కార్మికులను ఆదుకో వడంలో పెద్ద కృషి చేసింది.

హిందూపూర్ టౌన్‌లో సిపిఐ(ఎం) పూర్తి కాలం కార్యకర్త ఆ పట్టణాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించడంతో తన స్వగ్రామం కన్నెసెట్టిపల్లి వెళ్లిపోయాడు. అక్కడ రోడ్డుమీద, తీవ్రమైన ఎండలో వలస కార్మికులు నడిచి వెళ్లిపోతుం డడం గమనించాడు. వారి దుస్థితికి చలించి పోయాడు. కానీ ఆయన దగ్గర డబ్బులేదు. ఆయన, ఆయన భార్య కూలికి వెళ్లారు. రూ. 600 వచ్చింది. దాంతో సరుకులు కొని అన్నం వండి రహదారులపై నడిచి వెళుతున్న వలస కార్మికులకు పంచిపెట్టాడు. దాన్ని చూసి ఇతర గ్రామస్థులు వారితో చేతులు కలిపారు. అదొక సమిష్టి కృషిగా మారింది. అక్కడ జాతీయ రహదారిపై కోడికొండ చెక్‌పోస్టు వద్ద ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసి నడిచి వెళుతున్న కార్మికులకు ఆహారం అందించడం ప్రారంభించారు. చెక్‌పోస్టుకు రెండో వైపున మరో సిపిఐ(ఎం) కార్యకర్త పోలీసులు వలస కార్మికులను ముందుకు వెళ్ల కుండా అడ్డుకుని, తిరిగి బెంగుళూరు వైపు బలవంతంగా గెంటేస్తున్న విషయం గమనించాడు. అక్కడ పోలీసుల వైఖరి వల్ల ఆహార శిబిరం ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. అందువల్ల మరికొందరు గ్రామస్థుల సహకారంతో మోటారు సైకిళ్లపై వలస కార్మికులను ఎక్కించుకుని, నాటు రోడ్ల గుండా వారిని చెక్‌పోస్టు దాటించడమే కాకుండా కార్మికులకు మార్గమధ్యంలో తినడానికి ఆహారం పొట్లాలు, మంచినీరు సరఫరా చేశాడు.

ఒంగోలు దగ్గర ఎండలో పిల్లలతో నడిచి వెళుతున్న వలస కార్మికుల బాధ చూసి జాతీయ రహదారికి అయిదు కిలోమీటర్ల దూరంలోని ఒక గ్రామం నుండి ప్రజలు ఆహారం వండి ట్రాక్టరులో తెచ్చి పంచిపెడుతున్న సంగతి తెలుసుకున్న ఒంగోలు సిపిఐ(ఎం) కార్యకర్తలు పట్టణానికి రెండు వైపుల ఆహార శిబిరాలు నెలకొల్పి కార్మికులకు ఆహారం అందజేయడం ప్రారంభించారు. వారికి కొద్ది రోజుల్లోనే అన్ని వైపులనుండి సహాయం రావడం ప్రారంభిం చింది. ఈ విధంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతా ల్లో పార్టీ నాయకత్వంలో వలస కార్మికుల ఆహారం అందజేశారు.

అనంతపురం జిల్లాలో వలస కార్మికుల తిరుగు ప్రయాణాలు సాగినన్ని రోజులూ సిపిఐ(ఎం) వారికి ఆహారం అందించడం కోసం అనేక చోట్ల శిబిరాలు నిర్వహించింది. ఈ విధంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పార్టీ నాయకత్వంలో వలసకార్మికుల ఆహారం అందజేశారు.

కాకినాడు, విజయవాడ నగరాల్లో సిఐటియు వారు అనేక చోట్ల శిబిరాలు ఏర్పాటు చేసి బెంగాల్, ఒడిషా, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళుతున్న వలస కార్మికులకు ఆహారం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని 46 మండలాలకు గాను 45 మండల సిఐటియు కమిటీలు కాకినాడ ఆహార శిబిరం నిర్వహణలో పాల్గొన్నాయి. విజయవాడలో బస్సుల్లో వెళు తున్న కార్మికులకు పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ, మంచినీరు అందజేశారు. ఈ శిబిరం దాదాపు 20 రోజుల పాటు నడిచింది.

**వలస కూలీలను ఆదరించడంలో కేరళ ప్రభుత్వ ఆదర్శం**

నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. అమలు జరిపే బాధ్యతను మాత్రం రాష్ట్రాలకు వదిలిపెట్టింది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక వివక్షను ఎదుర్కొంటూనే కేరళలో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం కరోనాను అద్భుత రీతిలో కట్టడి చేయడమే కాదు వలస కార్మికలను ఆదరించడంలో కూడా దేశానికి ఆదర్శంగా నిలిచింది.

కేరళలోని వివిధ జిల్లాల్లో ఉత్తర ప్రదేశ్, బీహార్, బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం తదిర ప్రాంతాలనుండి వచ్చిన వలస కార్మికులు పనులు చేస్తున్నారు. ప్రధాన మంత్రి అకస్మాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించడంతో తొలి దినాల్లో అంటే మార్చి చివరి వారంలో వీరంతా తమ భవిష్యత్తు పట్ల ఆందోళనకు గుర య్యారు. వేల కిలోమీటర్ల దూరంలోని తమ ప్రాంతాలకు వెళ్లడానికి కొన్ని చోట్ల కాలినడకన, కొన్ని చోట్ల సైకిళ్ల మీద బయలుదేరారు.

వెనువెంటనే ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉన్నతాధికారుల సమావేశం ఏర్పాటు చేసి వలస కార్మికల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు ప్రారంభించారు. వలస కార్మిలను ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని ఉన్నతాధికారులు “అతిథి కార్మికులు”గా పిలుస్తారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు ఆయా జిల్లాలో వలస కార్మికులు ఎక్కడెక్కడ ఎంతంత మంది ఉన్నారో సర్వే చేశారు. క్యాంపుల్లో ఉన్న కార్మికులకు వెంటనే ఆహారం వండి పెట్టడం ప్రారంభించారు. “కానీ కొద్ది రోజుల్లోనే వారికి కేరళ భోజనంతో మొహం మొత్తిందని మాకు అర్థమయింది. దాంతో వండిన భోజనం పెట్టడం ఆపేశాం. వారికి కావలసిన రేషన్ ఇవ్వడం ప్రారంభించాం. దాంతో వారే తమకు కావలసిన ఆహారం వండుకోవడం



epaper.prajasakti.com

ప్రారంభించారు" అని కొట్టయం జిల్లా కలెక్టర్ పికె సుధీర్ బాబు ఒక పత్రికకు చెప్పారు.

అయితే యజమానులు నిర్వహించే క్యాంపుల్లో నివసిస్తున్న వలస కార్మికుల సమస్య పరిష్కరించవచ్చు. కానీ విడిగా ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్న కార్మికుల పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. వీరిని ఇంటి యజమానులు అద్దెలు కట్టకపోతే ఖాళీ చేయాలని డిమాండ్ చేయడం ప్రారంభిం చారు. కాంట్రాక్టర్ల ద్వారా కాకుండా తమంత తాముగా వివిధ రాష్ట్రాలనుండి కేరళకు వచ్చి ఇళ్లు తీసుకుని నివసిస్తున్న వలస కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్క కొట్టయం జిల్లాలోనే ఇలాంటి వారు 30,000 మందికి పైగా ఉన్నారు. జిల్లా అధికారులు ఇటువంటి వారు ఎక్కడెక్కడ నివసిస్తున్నారో సర్వే చేశారు. ఆయా ఇళ్లకు వెళ్లి వారి అద్దెలు, నీరు, విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. దాంతో కార్మికులకు భరోసా ఏర్పడింది.

ముఖ్యమంత్రి పినరయి విజయన్ కరోనాపై పత్రికలతో మాట్లాడే ప్రతిసారీ అతిథి కార్మికులను (వలస కార్మికులను) గురించి పేర్కొనడం, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం వల్ల అక్కడక్కడా ఏవైనా లోపాలు జరిగినా కూడా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సరిదిద్దేవారు. అతిథి కార్మికులకు నివాసం, ఆహారం, మంచినీరు అందించడం ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి పదేపదే చెప్పేవారు. ఈ విషయంలో జిల్లా అధికారులనుండి స్థానిక పంచాయితీలు, మున్సిపాల్టీలు సమన్వయంతో కలిసి పనిచేశాయి. "వారి భద్రత మాకు మొట్టమొదటి ప్రాధాన్యత. అందుకని మేము జిల్లా అధికారులతోనూ, స్థానిక సంస్థలతోనూ, హోమ్ డిపార్ట్‌మెంట్‌తోనూ సమన్వయం చేసుకుని రాష్ట్ర వ్యాపితంగా 21,556 శిబిరాలు నెలకొల్పాము. వీటిలో కార్మికులను తీసుకువచ్చిన ప్రయివేటు కాంట్రాక్టర్లు నెలకొల్పినవి కూడా ఉన్నాయి. ఆ తరువాత క్యాంపుల్లో ఉన్న వారి వివరాలు సేకరించాం. దీనికోసం కార్మిక శాఖ అధికారులు, వాలంటీర్లు పనిచేశారు. ఈ వివరాలను స్ప్రెడ్ షీట్లలో నమోదు చేశాం. వలస కార్మికులు బాగా ఇరుకైన ప్రదేశాల్లో ఉంటున్నారనీ, భౌతిక దూరం పాటించడం సాధ్యం కాదని తెలిసిన ప్రతి చోటకూ వెళ్లి అక్కడి కార్మికులను ప్రభుత్వం నెలకొల్పిన విశాలమైన శిబిరాల్లోకి మార్చాం" అని రాష్ట్ర ఎడిషినల్ లేబర్ కమిషనర్ కె. శ్రీలాల్ వివరించారు.

"ముఖ్యమంత్రి పినరయి విజయన్ కరోనాపై పత్రికలతో మాట్లాడే ప్రతిసారీ అతిథి కార్మికులను (వలస కార్మికులను) గురించి పేర్కొనడం, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం వల్ల అక్కడక్కడా ఏవైనా లోపాలు జరిగినా కూడా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సరిదిద్దేవారు. అతిథి కార్మికులకు నివాసం, ఆహారం, మంచినీరు అందించడం ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి పదేపదే చెప్పేవారు."



**వలస కార్మికుల కోసం విజయవాడలో సిపిఐ(ఎం) ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులకు ఆహారం, పండ్లు, అందజేస్తున్న పార్టీ కార్యదర్శి పి. మధు, కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు తదితరులు**

ప్రతి వలస కార్మికునికీ స్థానిక పోలీసు అధికారి ఫోన్ నెంబర్‌నూ, రాష్ట్ర డిజిపి లోక్‌నాథ్ బెహ్రా ఫోన్ నెంబర్‌నూ ఇచ్చారు. సమయానికి వారికి భోజనం అందించే బాధ్యత అధికారులకూ, వాలంటీర్లకూ అప్పగించారు. అనేక చోట్ల కాంట్రాక్టర్లే వారికి భోజనం పెట్టారు. మిగిలిన చోట్ల కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేశారు. అన్ని పంచాయితీలు, మున్సిపాలిటీల్లో ఈ పని సక్రమంగా జరిగేట్లు కలెక్టర్లు పర్యవేక్షించేవారు.

దీన్నంతటినీ పర్యవేక్షించేందుకు కేరళ సెక్రటరియేట్‌లో ఒక వార్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుండి వలస కార్మికుల సమస్యలతో బాటు మొత్తం కరోనా వ్యాధి అరికట్టే పనులన్నింటినీ పర్యవేక్షించారు. ప్రత్యేకంగా వలస కార్మికుల సమస్యను పర్యవేక్షించేందుకు కార్మిక మంత్రిత్వ శాఖ ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడికి వలస కార్మికులు ఎవరైనా ఫోన్ చేయవచ్చు. అయిదు భాషల్లో సమాధానాలు చెప్పేవారిని ఏర్పాటు చేశారు. మే 2వ తేదీ వరకు ఈ సెల్‌కు 15,250 ఫోన్ కాల్స్ వచ్చాయి. "వారు చేసిన ఫిర్యాదులన్నిటినీ వేం పొల్లుపోకుండా పరిష్కరించాం" అని లేబర్ కమిషనర్ శ్రీలాల్ చెప్పారు.

ఇంత చేసినా వలస కార్మికులు తీవ్రమైన మానసిక ఆందోళనలో ఉన్నారు కాబట్టి వారి మానసిక సమస్యలను పరిష్కరించాల్సి అవసరం ఏర్పడింది. దానికోసం ప్రతి కార్మిక శిబిరాన్ని సందర్శించి వారి భయాలు, ఆందోళలను తొలగించేందుకు ఒక క్విక్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలనుండి వచ్చే వలస కార్మికులతో వారి వారి భాషల్లో మాట్లాడే వాలంటీర్లను నియమించారు. దీంతో పాటు శిబిరాల్లో ఉన్న వారికి ఆందోళన పోవాలంటే కాస్త వినోదం కూడా అవసరమే అని ప్రభుత్వం గుర్తించింది. దాంతో కొన్ని క్యాంపుల్లో టెలివిజన్ సెట్లు బిగించారు. కొన్ని క్యాంపుల్లో క్యారం బోర్డులు ఏర్పాటు చేశారు. కార్మికుల వద్ద డబ్బు మొత్తం అయిపోయింది గనుక స్వగ్రామాల్లో బంధువులతో మాట్లాడుకోడానికి వీలుగా సెల్ ఫోన్ రీచార్జి చేయించారు.

కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ సడలించిన



epaper.prajasakti.com

> **❝ మన దేశ ఆహార గిడ్డంగుల్లో 7.7 కోట్ల టన్నుల ఆహార నిల్వలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో కావలసిన ఆహార నిల్వలు (బఫర్ స్టాక్) 2.5 కోట్ల టన్నులు పోను ఇంకా సుమారు 5 కోట్ల టన్నుల ఆహారం అదనంగా గోదాముల్లో మూలుగుతోంది. "జాతీయ ఎమర్జెన్సీ పరిస్థితులు వచ్చినాయి గనుక" ఆ నిల్వలను పేద ప్రజలందరికీ కార్డులతో నిమిత్తం లేకండా పంపిణీ చేయాలి. ఇదే విషయం చాలా మంది ఆర్థిక వేత్తలు కూడా చెబుతున్నారు. ❞**

వెంటనే కార్మికులు మొదటి శ్రామిక రైళ్లలో టిక్కెట్లు బుక్ చేసుకోవాలని ఆత్రపడ్డారు. మే రెండవ వారం నుండి ఇళ్లకు వెళ్లాలనుకునే వారందరినీ ప్రభుత్వం రైళ్లలోనూ, బస్సుల్లోనూ తరలించడం ప్రారంభించింది. బయలుదేరే వారందరికీ దారిలో తినడానికి ఆహారం పొట్లాలు, మంచి నీరు ఇచ్చి పంపింది. కేరళలో మొత్తం 25 నుండి 30 లక్షల మంది వలస కార్మికులున్నారు. వారిలో చాలా కొద్ది మంది అంటే 42,000 మంది మాత్రమే శ్రామిక రైళ్ల ద్వారా ఇళ్లకు తిరిగి వెళ్లారు. రైళ్లలో అస్సాం తిరిగి వచ్చిన 50,000 మంది వలస కార్మికుల్లో కేరళ నుండి ఒక్కరు కూడా రాలేదని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక రాసింది. కేరళలో 40,000 మంది అస్సాం కార్మికులు పనిచేస్తున్నారు. "చాలా కొద్ది మంది మినహా మేమంతా ఇక్కడ సుఖంగానే ఉన్నాం. అందువల్ల ఇళ్లకు తిరిగి వెళ్ల దలుచుకోలేదు" అని అస్సాంలోని ధీమాజి జిల్లా నుండి వచ్చిన వలస కార్మికుడు దింబేశ్వర్ బారువా చెప్పినట్లు పత్రిక రాసింది.

కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలోనే కాకుండా వలస కార్మికుల కష్టాలు తీర్చి వారికి ఆదరించడంలో కూడా కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం రవాణా మీద పూర్తిగా ఆంక్షలు తొలగించినందున తిరిగి స్వగ్రామాలకు ఎందరు వెళతారో ఇప్పుడే తెలియదు. కానీ రాష్ట్రంలోనే ఉండిపోయిన కార్మికులకు తిరిగి వెనువెంటనే ఉపాధి కల్పించడం ఇప్పుడు ఆ రాష్ట్రానికి పెద్ద సవాలు కానుంది.

### వెంటాడుతున్న లాక్‌డౌన్ కష్టాలు

కరోనా వైరస్ కన్నా...ప్రధాని నరేంద్ర మోడీ విధించిన లాక్‌డౌన్, వలస కార్మికుల కష్టాలకు, బాధలకు ఎక్కువ కారణమైంది. తిరిగి వస్తున్న వలస కార్మికుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా మూడు సమస్యలు ఏర్పడతాయి. అవి వారి ఆహారం, ఉపాధి, ఆరోగ్య సమస్యలు

**ఆహారం:** లాక్‌డౌన్‌లో ఆహార భద్రత కోల్పోయిన వలస కార్మికుల కోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రెండవ దఫా ప్రకటించిన ప్యాకేజీలో కొన్ని చర్యలు ప్రతిపాదించారు. వాటిలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ నెలకు అయిదు కిలోల బియ్యం, కిలో శెనగలు అదనంగా ఇవ్వడం, రేషన్ కార్డు లేకపోయినా వలస కార్మికలకు ఈ రేషన్ అందించడం. దీనివల్ల దాదాపు 88 కోట్ల మంది ప్రజలకు రేషన్ అందుతుందని ఆమె చెప్పారు. కానీ అభివృద్ధి విషయాల నిపుణులు మేఘనా ముంజికర్, జీన్ డ్రెజ్, రీతికా ఖేరాలు చెప్పిన దాని ప్రకారం ప్రభుత్వ రేషన్ సరఫరాకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల 10.8 కోట్ల మంది ప్రజలకు రేషన్ కార్డులు లేకుండా పోయాయి. అప్పటి నుండి దేశంలో 15 కోట్ల జనాభా పెరిగింది. అంటే ప్రభుత్వ రేషన్ అందించేటప్పుడు వీరిని పరిగణలోకి తీసుకోవడం లేదు. అందుకనే చాలా మంది ఆర్థిక వేత్తలు ప్రస్తుత పరిస్థితుల్లో రేషన్ కార్డులతో నిమిత్తం లేకండా పేదలందరికీ ఉచిత రేషన్ అందించాలని గట్టిగా సిఫార్సు చేస్తున్నారు. రేషన్ కార్డులు లేని వారికే సమస్య అనుకుంటే ఇప్పుడు లాక్‌డౌన్ వల్ల అనేక కోట్ల మంది ప్రజలు పనులు కోల్పోయి ఆహార సమస్యను ఎదుర్కొంటున్నారు. 2018లో అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం కార్మికుల పరిస్థితిపై చేసిన సర్వే ప్రకారం దేశలో 85 శాతం మంది కార్మికుల ఆదాయం నెలకు రూ. 5000 కన్నా తక్కువ. 50 శాతం మంది ఆదాయం రోజుకు రూ. 166 మాత్రమే. లాక్‌డౌన్ వల్ల ఇప్పుడు వీరి ఆదాయాలు కూడా పోయాయి. ఆకలి బాధలకు గురవుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు ఆహారం అందించి ప్రాణాలు నిలబెట్టడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. నోబుల్ బహుమతి గ్రహీతలైన అమర్త్య సేన్, అభిజిత్ బెనర్జీ వారితోపాటు రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌లు ప్రభుత్వానికి సూచిస్తున్న సలహాలను ప్రభుత్వం ఆలకించడం అవసరం. వారు చెబుతున్నదేమంటే... మన దేశ ఆహార గిడ్డంగుల్లో 7.7 కోట్ల టన్నుల ఆహార నిల్వలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో కావలసిన ఆహార నిల్వలు (బఫర్ స్టాక్) 2.5 కోట్ల టన్నులు పోను ఇంకా సుమారు 5 కోట్ల టన్నుల ఆహారం అదనంగా గోదాముల్లో మూలుగుతోంది. "జాతీయ ఎమర్జెన్సీ పరిస్థితులు వచ్చినాయి గనుక" ఆ నిల్వలను పేద ప్రజలందరికీ కార్డులతో నిమిత్తం లేకండా పంపిణీ చేయాలి. ఇదే విషయం చాలా మంది ఆర్థిక వేత్తలు కూడా చెబుతున్నారు. ఆకలి బాధ నుండి ప్రజలను రక్షించాలంటే ఇది తక్షణ అవసరం.

కానీ మోడీ ప్రభుత్వం అందుకు నిరాకరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు కొనుక్కుంటే సరఫరా చేస్తానంటున్నది. మరోవైపు ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులను విడుదల చేయకుండా బిగపడుతోంది. ఇప్పుడు పుండు మీద కారం చల్లినట్లు అదనపు ధాన్యం నిల్వలతో ఎథనాల్ తయారు చేస్తానంటోంది. ఎథనాల్ ఎందుకంటే ఇప్పుడు ప్రజలకు శానిటైజర్లు అవసరం గనుక, వాటిని తయారు చేయడానికి ముడి పదార్థంగా ఎథనాల్ కావాలి గనుక ప్రజలను ఖాళీ కడుపులతో మాడ్చి వారి చేతులను శుభ్రంగా ఉంచుకోడానికి శానిటైజర్లను తయారు చేస్తుందట!

**ఉపాధి:** నగరాలు, పట్టణాల్లో ఉపాధి పోయి గ్రామాలకు తిరిగి వస్తున్న వలస కార్మికులు అక్కడ పెద్ద ఎత్తున ఉపాధి సమస్య ఎదుర్కొంటారు. వలస కార్మికులకు, దినసరి వ్యవసాయ కూలీలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్‌రెగా) ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ పథకానికి 9,500 కోట్ల రూపాయలు లేదా 13 శాతం కోత విధించింది.

2014-15 ఆర్థిక సంవత్సరం నుండి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులకోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య నిరంతరాయంగా పెరుగుతూ వస్తోంది. భారత దేశంలో ప్రస్తుతం 13.75 కోట్ల ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ రాజ్యాంగంలో నిర్దేశించినట్లు ఏడాదికి వంద రోజుల పనిదినాలు కల్పించాలంటే, పెంచిన వేతనాల ప్రకారం రోజుకు రూ. 200 చొప్పున కూలి ఇవ్వాలంటే బడ్జెట్‌లో రూ. 3 లక్షల



epaper.prajasakti.com

కోట్లు కేటాయించాలి. కానీ గత బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కేటాయించింది కేవలం రూ. 61000 మాత్రమే. కరోనా వైరస్ లాక్‌డౌన్ సందర్భంగా ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా ప్రభుత్వం ఈ పథకానికి మరో రూ. 40,000 కోట్లు కేటాయించింది. దాంతో మొత్తం కేటాయింపు సుమారు 1 లక్ష కోట్లయింది. అంటే కావలసిన దానిలో మూడో వంతు మాత్రమే డబ్బు కేటాయించారు. ఇప్పుడు తిరిగి గ్రామాలకు వస్తున్న వలస కార్మికుల్లో చాలా మంది ఉపాధి పథకం జాబ్ కార్డులు లేనివారే. అందువల్ల తిరుగు వలసల వల్ల మరిన్ని ఉపాధి జాబ్ కార్డులకు గిరాకీ ఏర్పడుతోంది. వీరందరికీ ఉపాధి కల్పించకపోతే గ్రామీణ నిరుద్యోగం మరింత తీవ్రమవుతుంది. దీని ఫలితం ఏమంటే కోట్లాది మంది ప్రజలకు కొనగోలు శక్తి మరింత తగ్గిపోతుంది. దాంతో పారిశ్రామిక గిరాకీ తగ్గి కరోనాకు ముందు ఉన్న మాంద్యం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ రోజున దేశంలోని 13.75 కోట్ల మంది ఉపాధి హామీ కూలీల్లో కేవలం 7.5 కోట్ల మంది మాత్రమే జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. మిగిలిన వారు పట్టణాలకు వలస పోవడం వల్లగానీ ఇతర కారణాల వల్ల గానీ కార్డులు రెన్యువల్ చేయించుకోలేదు. ఉన్న 7.5 కోట్ల మందికి కూడా ప్రభుత్వం ఏటా 100 రోజుల ఉపాధి కల్పించడం లేదు. ప్రభుత్వ అంచనా ప్రకారమే సుమారు 45 రోజుల మాత్రమే ఉపాధి లభిస్తోంది. కరోనా, లాక్‌డౌన్ నేపథ్యంలో స్వగ్రామాలకు తిరిగి వచ్చిన వలస కార్మికులు ఇప్పట్లో తిరిగి పనులకోసం పట్టణాలకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి వారి పట్ల ప్రభుత్వం, యజమానులు, కాంట్రాక్టర్లు చూపించిన నిర్లక్ష్యం, నిరాదరణ ప్రధాన కారణం. ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే ఉపాధి లేక, నిరుద్యోగం పెరిగి నిరుపేదలు ఆకలి చావులకు గుయ్యే ప్రమాదం ఉంది.

దేశంలో నిరుద్యోగం రానురాను మహమ్మారిలా పెరిగిపోతున్నదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. 2018లో నిరుద్యోగం రేటు గత నాలుగు దశాబ్దాల్లో అత్యంగా ఎక్కువగా నమోదయింది. ఈ ఏడాది మార్చి మొదటి వారంలో దేశంలో 7 శాతంగా ఉన్న నిరుద్యోగం మే 3 నాటికి అంటే రెండు దఫాల లాక్‌డౌన్ ముగిసే నాటికి 27 శాతానికి

> ❝ నగరాల మాదిరిగా గ్రామీణ ప్రాంతాలు ఇప్పటి వరకు పెద్దగా వైరస్ బారిన పడలేదు. కానీ వలస కార్మికులు తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటే ఆ ప్రాంతాల్లో కూడా కరోనా వ్యాపించవచ్చు. మన గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు తక్కువ. కాబట్టి గ్రామీణ ప్రాంతాలకు తిరిగి వచ్చే వలస కార్మికుల ఆరోగ్యంపై ప్రభుత్వాలు కేంద్రీకరించాలి. ఆదివాసీల నివాస ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు దారుణంగా ఉంటాయి. కాబట్టి, ఆదివాసీ వలస కార్మికులు ఇంటికి తిరిగి వచ్చినప్పుడు పెద్ద సమస్యగా ఉంటుంది. ❞




కేరళ ఎర్నాకుళం జిల్లా పెరంబవూర్‌లో వలస కార్మికులకు ఎల్ఇడి టీవీలు అందజేస్తున్న జిల్లా ఎస్‌పి కె. కార్తిక్

పెరిగిందని భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలించే సంస్థ (సిఎంఐఇ) తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులు ఉపాధి హామీ పథక జాబ్ కార్డులకు మరింత ఎక్కువగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. 2014-15లో 6.22 కోట్ల మంది జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా వారి సంఖ్య ఇప్పుడు 1.67 కోట్లు పెరిగి మొత్తం 7.89 కోట్లకు చేరింది. ఆర్థిక మందగమనం, కరోనా, లాక్‌డౌన్ పరిస్థితుల వల్ల ఇతర కూలీ పనులు మందగించడంతో ఈ జాబ్ కార్డులకు డిమాండ్ ఏర్పడిన విషయం అర్థమవుతోంది.

**ఆరోగ్యం:** నగరాలు, పట్టణాలు మాదిరిగా గ్రామీణ ప్రాంతాలు ఇప్పటి వరకు పెద్దగా వైరస్ బారిన పడలేదు. కానీ వలస కార్మికులు తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటే ఆ ప్రాంతాల్లో కూడా కరోనా వ్యాపించవచ్చు. మన గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు తక్కువ. కాబట్టి గ్రామీణ ప్రాంతాలకు తిరిగి వచ్చే వలస కార్మికుల ఆరోగ్యంపై ప్రభుత్వాలు కేంద్రీకరించాలి. ఆదివాసీల నివాస ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు చాలా దారుణంగా ఉంటాయి. కాబట్టి, ఆదివాసీ వలస కార్మికులు ఇంటికి తిరిగి వచ్చినప్పుడు పెద్ద సమస్యగా ఉంటుంది. గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదివాసీ ప్రాంతాలకు సంబంధించి విడుదల చేసిన వార్షిక నివేదిక అక్కడి పరిస్థితులను కళ్లకు కడుతుంది. సబ్ సెంటర్లలో 20.7 శాతం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 26 శాతం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో 23 శాతం కొరత ఉన్నట్లు నివేదిక పేర్కొంది. వైద్యుల లోటు మరీ ఎక్కువగా (27 శాతం) వుంది.

### ఏం చేయాలి?

కరోనా మహమ్మారి వల్ల కష్టాలకన్నా కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా, పేద కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా విధించిన లాక్‌డౌన్ వల్ల వలస కార్మికులకు, అసంఘటిత రంగ కార్మికులకు, పేద ప్రజలకు అనేక ఈతి బాధలు



epaper.prajasakti.com

> **"తొలుతగా కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులతో నిమిత్తం లేకుండా వలస కార్మికులతోపాటు ఆదాయపు పన్ను చెల్లించని ప్రతి కుటుంబానికీ నెలకు రూ. 7,500 చొప్పున మూడు మాసాల పాటు ఇవ్వాలి. అలాగే వలస కార్మికులతోపాటు ప్రతి వ్యక్తికీ నెలకు 10 కిలోలు చొప్పున బియ్యాన్ని ఆరు మాసాలపాటు ఇవ్వాలి. లబ్దిదారులకు ఆహారం వండుకునే సదుపాయాలు లేకపోతే వారికి ఆహర ధాన్యాలకు బదులు వండిన ఆహారం ఇవ్వడం అవసరం."**

ఎదురవుతున్నాయి. రెండు మాసాలు ఆకలిని, అభద్రతను తట్టుకోలేక దేశంలోని అనేక నగరాలు, పట్టణాలనుండి కోట్ల మంది వలస కార్మికులు స్వగ్రామాలకు వెళ్లారు, వెళుతున్నారు.

అసలే ఆర్థిక మందగమనం, దానికి తోడు కరోనా లాక్‌డౌన్, తరువాత కూడా ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందో తెలియని అయోమయం.... ఈ పరిస్థితుల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యాన్నీ, కార్మిక వ్యతిరేక ధోరణినీ విడనాడి వలస కార్మికులను ఆదుకోడానికి ముందుకు రావాలి. తక్షణం, దీర్ఘకాలంలో ఈ క్రింది చర్యలు తీసుకోవాలి. కార్మిక వర్గం సంఘటితమై ఈ చర్యలు తీసుకునేట్టు కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

**1.** తొలుతగా కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులతో నిమిత్తం లేకుండా వలస కార్మికులతోపాటు ఆదాయపు పన్ను చెల్లించని ప్రతి కుటుంబానికీ నెలకు రూ. 7,500 చొప్పున మూడు మాసాల పాటు ఇవ్వాలి. అలాగే వలస కార్మికులతోపాటు ప్రతి వ్యక్తికీ నెలకు 10 కిలోలు చొప్పున బియ్యాన్ని ఆరు మాసాలపాటు ఇవ్వాలి. లబ్దిదారులకు ఆహారం వండుకునే సదుపాయాలు లేకపోతే వారికి ఆహర ధాన్యాలకు బదులు వండిన ఆహారం ఇవ్వడం అవసరం. దేశ వ్యాపితంగా ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఈ అవసరం కోసం వినియోగించుకోవచ్చు. ఈ కాలంలో బియ్యంతోపాటు పప్పులు, వంట నూనె ఇతర నిత్యావసరాలను కూడా ఉచితంగా అందించాలి.

**2.** ఈ పంపిణీకి కావలసిన వాస్తవ వనరులు కేంద్రం దగ్గర ఉన్నాయి. కానీ పంపిణీ మాత్రం రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం తన వద్ద ఉన్న ఆహార ధాన్యాలను రాష్ట్రాలకు ఉచితంగా బదిలీ చేయాలి. అలాగే గ్రాంట్ల రూపంలో నగదు బదిలీ చేయాలి. రాష్ట్రాలు కూడా తమ వంతుగా స్థానిక సంస్థలకు తగినంత ఆర్థిక వనరులను సమకూర్చాలి. ప్రజలకు పంపిణీలో వాటి సహకారం ఎంతైనా అవసరం.

**3.** కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటూనే మరోవైపు తీవ్రమైన వ్యాధులకు గురయ్యే వలస కార్మికులు ఇతరులు అవసరమైన వైద్య సహాయం పొందేట్లు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహమ్మారితో పోరాడుతూనే మరోవైపు పిల్లలకు మరణాలనుండి రక్షించే వ్యాక్సిన్‌లు వేయడం, గర్భవతులకు తగిని వ్యాక్సిన్లు అందించడం తప్పక కొనసాగించాలి. దీంతోబాటు మందులు, రక్తం వంటి వాటికి కొరత రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. కరోనాను ఎదుర్కొనేందుకు వైద్య సదుపాయాలు పెంచేందుకు అంటే వెంటిలేటర్లు, మాస్కులు, రక్షణ దుస్తులు, టెస్టింగ్ పరికరాల సరఫరాలు పెంచేందుకు ప్రధాన మంత్రి పేరుతో ఏర్పాటు చేసిన ప్రయివేటు నిధికి వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయల నుండి రాష్ట్రాలకు సహాయం చేయాలి.

**4.** కేంద్రం నిధులు ఇచ్చినప్పటికీ, కరోనా మహమ్మారిని నేరుగా ఎదుర్కోవలసిన రాష్ట్రాలు కేవలం తమ వైద్య సదుపాయాల మీద మాత్రమే ఆధారపడితే ఎంత మాత్రమూ సరిపోవు. అందువల్ల స్పెయిన్ ప్రభుత్వం చేసినట్లు మహమ్మారి ఉన్నంత కాలం ప్రయివేటు వైద్య సదుపాయాలను అవి తమ స్వాధీనం లోకి తెచ్చుకోవాలి. ఈ సదుపాయాల్లో ప్రజలకు ఉచిత పరీక్షలు, చికిత్స అందించాలి. డాక్టర్లు, సిబ్బంది సర్వీసులను కూడా ప్రభుత్వం చౌక రేట్లకు అందించాలి.

**5.** ఈ సంక్షోభ సమయంలో ఉద్యోగాలు పోకుండా, వేతనాల కోత లేకుండా గ్యారంటీ కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. అత్యంత బలహీన సెక్షన్లయిన మహిళలు, ముఖ్యంగా ఆదివాసీలు, కాంట్రాక్టు, దళిత రోజువారీ పనివారిని రక్షించడం కోసం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. ప్రపంచంలోని అనేక దేశాల ఇటువంటి గ్యారంటీలు కల్పించాయి, కొన్ని దేశాలైతే వేతన బిల్లులో 80 శాతం గ్యారంటీ కల్పించాయి. కేంద్ర ప్రభుత్వం దీన్ని తక్షణం ప్రకటించాలి.

**6.** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎన్‌రెగా) విస్తరించి వలస కార్మికులతో సహా గ్రామీణ కూలీలందరికీ ఉపాధి కల్పించాలి. పట్టణాలనుండి తిరిగి వస్తున్న వలస కార్మికులకు ఉపాధి కల్పించడం కోసంగాను గతంలో ఈ పథకం కింద రిజిస్టరు చేసుకున్న వారికే కాకుండా పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి. 100 రోజుల పని గ్యారంటీని కుటుంబానికి పరిమితం చేయకుండా పనిచేయగల ప్రతి వయోజనునికీ విస్తరించాలి. అలాగే వారికి ఉపాధి చూపలేకపోతే చట్టంలో పేర్కొన్నట్లు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించాలి. పట్టణ ఉపాధి హామీ పథకం వర్తించే చిన్న పరిశ్రమల్లో ముఖ్యంగా అత్యవసర వస్తువులు, సేవలు అందించేవారికి దీన్ని విస్తరింపజేయాలి. దానికి తోడు లాక్‌డౌన్ వల్ల కుప్పకూలిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తరిగి తెరుచుకోడానికి కావలసిన రుణాలతో సహా అన్ని రకాల సహాయం అందించాలి. దీని వల్ల వలస కార్మికులకు తిరిగి ఉపాధి లభించే అవకాశాలు పెరుగుతాయి.

**7**. తమ స్వగ్రామాలకు తిరిగి వచ్చిన వలస కార్మికులను తిరిగి తమ పని ప్రదేశాలకు వెళ్లేట్లు ప్రోత్సహించాలి. దీనికి సమయం పడుతుంది. అంత సులువూ కాదు. ఎందుకంటే మహమ్మారి భయం ఒకవైపు, మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారన్న భయం మరోవైపూ వారిని చాలా కాలం వెంటాడుతుంది. వలస కార్మికుల భయాలను పోగొట్టాలి. మన ప్రభుత్వం తలతిక్క నిర్ణయాలు తీసుకుని వాటిని పోలీసు లాఠీలతో అమలు జరడం వల్ల వలస కార్మికులు వెతలు అనుభవించారు. ఇటువంటి ఘటనలే కాదు వలస కార్మికుల పట్ల మానవత్వంతో వ్యవహరించిన సందర్భాలు కూడా ఉన్నాయన్న విషయాన్ని వారికి తెలియజేయాలి. విదేశాలనుండి తిరిగి రావాలనుకుంటున్న వలస కార్మికులు తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేయాలి.


**8.** వలస కార్మికులతో సహా కోట్లాది మంది పేదలకు ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం విడనాడి తక్షణం ఆ రంగాన్ని సంక్షోభం నుండి కాపాడే చర్యలు తీసుకోవాలి.

❋


epaper.prajasakti.com

పుస్తక సమీక్ష

# చైనాపై విషం, కమ్యూనిజానికి వక్రభాష్యం



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ఎంవిఎస్ శర్మ


స్లావోయ్ జిజెక్ కరోనా సవాలు మీద రాసిన "పెట్టుబడికి బీటలు- భవిష్యత్తుకు బాటలు'' అన్న పుస్తకం 'ప్రపంచాన్ని చిదిమేస్తోన్న కరోనా' అన్న ఉపశీర్షికతో తెలుగులో సుంకర రామచంద్రరావుగారి అనువాదంగా వచ్చింది. బహుశా కరోనా మీద తెలుగులో వచ్చిన మొదటి పుస్తకం ఇదే కావొచ్చు.

రచయిత ఒక అధిభౌతికవాది. హెగెల్ భావవాదాన్ని బలపరిచేవాడు. ఈ విషయం అతనీ పుస్తకానికి రాసిన ఉపోద్ఘాతంలోనే వ్యక్తం చేశారు.

ఇంతకూ ఈ రచనద్వారా రచయిత ఏంచెప్పదలిచారనేది ప్రధానమైన అంశం. అది అర్ధం కావాలంటే మనకి ముందు కొన్ని ప్రస్తుత చర్చనీయాంశాలు తెలియాలి.

కరోనా విజృంభించకముందే నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ఆ సంక్షోభంనుండి బైటపడే దారులన్నీ మూసుకుపోయాయి. 2008 నుండే మొదలైన ఈ సంక్షోభ ప్రభావాన్ని తగ్గించి చూపేప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అంతేగాక 2018 నుండి దాని తీవ్రత మరింతగా పెరగసాగింది. కరోనా కి ముందే మన దేశంలో కూడా జిడిపి వృద్ధిరేటు బాగా పడిపోయిందని తాజా గణాంకాలు చెప్తున్నాయి.

ఈ సంక్షోభానికి కారణం ప్రజలకొనుగోలుశక్తి బాగా పడిపోవడం. నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. వేతనాలు తగ్గాయి. కార్పొరేట్ల లాభాలు మాత్రం బాగా పెరిగాయి. ఇదంతా నయా ఉదారవాద విధానాల పుణ్యమే. ఆ విధానాలను వదిలిపెట్టి ప్రత్యామ్నాయ విధానాలను చేపట్టాలన్న వాదనలు 2005 నుండే ప్రారంభం అయాయి. జోసెఫ్ స్టిగ్లిట్జ్, అమర్త్యసేన్, తదితరులు ఈ వాదనలను ముందుకు తెచ్చారు. కాని అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి మాత్రం ససేమిరా అంటోంది. దాంతో అంతకంతకూ ఈ సంక్షోభం ముదిరిపోయింది.




దీనికి ఇప్పుడు కరోనా తోడయింది. పెట్టుబడిదారీ ప్రపంచం యావత్తూ వణికిపోతున్నది. సర్వం కార్పొరేటీకరణమయం అన్నది నయా ఉదారవాద సిద్ధాంతం. పర్యవసానంగా ప్రజారోగ్యవ్యవస్థ పూర్తిగా కుదేలైంది. దానివలన కరోనా ముప్పును సమర్ధవంతంగా ఎదుర్కొనలేని అశక్తత సంపన్న, పెట్టుబడిదారీ దేశాలన్నింటినీ ఆవరించింది. మరోపక్క సోషలిస్టు చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాలు కరోనాను నిలవరించడంలో తమ సత్తా ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పాయి. ప్రపంచ ఆరోగ్యసంస్థ చైనా చేసిన కృషి అపూర్వమని పదే పదే చెప్పింది. క్యూబా ఏభైకి పైగా దేశాలకు వైద్యబృందాలను పంపగలిగింది. ఐదు దశాబ్దాలకు పైగా తమను ఏకాకిని చేసి దెబ్బతీయజూసిన అమెరికాకు సైతం క్యూబా సహాయం అందించింది. ఆ విధంగా కరోనా ఈ ప్రపంచానికి పెట్టుబడిదారీ విధానపు డొల్లతనాన్ని, సోషలిజం చేవను ఏకకాలంలో స్పష్టంగా చూపించింది. ఇది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి మరీ కంటగింపు అయింది.

ముందు తమ దేశాలలో ప్రజలకు ఏం చెప్పుకోవాలి? కరోనాముప్పు వచ్చి కూచున్నాక ఏం చెయ్యాలి? పెట్టుబడిదారీ దేశాలలో రెండు రకాలుగా పాలకవర్గాలు స్పందించాయి. బ్రిటన్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రజలకు నేరుగా అందే విధంగా ఆర్థిక సహాయ చర్యలను చేపట్టాయి. ఆరోగ్యవ్యవస్థలను తిరిగి ప్రభుత్వ అధీనంలోకి (తాత్కాలికంగానైనా) తెచ్చుకున్నాయి. అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను పక్కన పెట్టాయన్నమాట. దీనికి భిన్నంగా అమెరికా, ఇండియా, బ్రెజిల్



epaper.prajasakti.com

విశ్లేషణ

# ప్రైవేటీకరణ ప్యాకేజి

ఎ కోటిరెడ్డి



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

కోవిడ్ 19 మహమ్మారిని నివారించటం కోసం మే 17వ తేదీ వరకు విధించిన మూడవ దశ లాక్‌డౌన్‌ను పొడిగించాల్సి వస్తుందని తెలుపుతూ మే నెల 12వ తేదీన ప్రధాని నరేంద్రమోడి ప్రకటించిన 20 లక్షల కోట్ల రూపాయలప్యాకేజి ప్రైవేటీకరణ విధానాలను మరింత వేగంగా అమలుచేయటానికేనని తేలిపోయింది. దేశంలోని ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర పరిస్థితులను పట్టించుకోకుండా ఆత్మనిర్భర్ భారత్-స్వయం సమృద్ధ భారతదేశం-పేరుతో ప్రధాని ప్రజలను మోసగించటానికి పూనుకోవటం అత్యంత దారుణం. ప్రపంచాన్ని వణికిస్తున్న కోవిడ్-19 వైరస్‌తో భారత ప్రజలు కూడా తీవ్రమైన భయానక పరిస్థితులలో జీవిస్తున్నారు.

**20 లక్షల కోట్ల ప్యాకేజి పేరుతో దగా**

ప్రధాని ప్రకటించిన 20 లక్షల కోట్ల ప్యాకేజి వాస్తవంగా 2-3 లక్షల కోట్ల రూపాయలకు మించదు. ఈ కాలంలో కార్పొరేట్లకు 7.5 లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దుచేసిన ప్రభుత్వానికి ఆపత్కాలంలో పేదలకు ఉచితంగా డబ్బులు, ఆహారధాన్యాలు ఇవ్వటానికి మాత్రం మనసొప్పటం లేదు. ప్రధాని ప్రకటించిన 20.97 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజిలో మార్కెట్లో ద్రవ్యలభ్యత పెంచటం కోసం ఫిబ్రవరి, మార్చినెలలలో ఆర్‌బిఐ అందుబాటులోకి తీసుకువచ్చిన 8.04 లక్షల కోట్ల రూపాయలు కూడా ఉన్నాయి. దానితో పాటు మొదటిసారి లాక్‌డౌన్ విధించిన తర్వాత నిర్మలా సీతారామన్ ప్రకటించిన 1.7 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజి కూడా దీనిలోనే ఉంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 3 లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వ హామితో ఇస్తామని చెప్పిన రుణం కూడా ఉంది. ఈ రుణాన్ని నాలుగు సంవత్సరాల వ్యవధిలో వారికి ఇస్తారు మినహా ఈ మహమ్మారి సందర్భంగా తక్షణం అందజేసేది కాదు. వ్యవసాయం, విద్యుత్, మార్కెట్ రంగాలలో సంస్కరణలను అమలు జరిపే రాష్ట్రాలకు 90 వేలకోట్ల రూపాయల రుణం ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రాల రుణ పరిమితిని 3 నుండి 5 శాతానికి పెంచటాన్ని కూడా సంస్కరణలతో ముడిపెట్టారు. కార్మికులు, ఉద్యోగుల పిఎఫ్‌కు జమచేస్తామని చెబుతున్న 2 శాతంతో ఇప్పటికిపుడు కార్మికులు, ఉద్యోగులకు ఒరిగిపడేదేమీ లేదు. మిగతా దానిలో కూడా వాస్తవంగా ప్రస్తుతం ఖర్చుచేసేది తక్కువగానే ఉంటుంది. ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని సరళీకరణ సంస్కరణలను ముందుకు తీసుకుపోవటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. రక్షణరంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతం నుండి 74 శాతానికి పెంచింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల బోర్డులలో కార్పొరేట్ సంస్థలకు చెందినవారిని నియమించటం తదితర సంస్కరణలను ముందుకుతీసుకు వెళ్ళటానికి పూనుకున్నారు. అంతరిక్ష రంగంలోకి కూడా ప్రైవేటు, విదేశీ సంస్థలకు ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటన చేశారు. కోవిడ్ 19 మహమ్మారిని ఎదుర్కోవటానికి కృషిచేసేపేరుతో రక్షణ, అంతరిక్ష రంగాలను విదేశీయుల చేతిలో పెడుతున్నది. మన దేశ సార్వభౌమత్వాన్ని

**ఆర్థికాభివృద్ధికి దోహదం చేయని ప్యాకేజి**

పారిశ్రామికాభివృద్ధిని ప్రభావితం చేస్తున్నవాటిలో డిమాండ్ లేకపోవటం ప్రధానమైనది. లాక్‌డౌన్ విధించటానికి ముందే ఆర్థికవ్యవస్థ మాంద్యంలోకి జారిపోతున్నదని స్పష్టమైంది. లాక్‌డౌన్ విధించటానికి ముందే 2019-20 సంవత్సరంలో జిడిపి 5 శాతం కన్నా తక్కువగానే పెరుగుతుందని అంచనాలు వెలువడ్డాయి. జిడిపి పెరుగుదల 4.2 శాతమేనని మేనెల 29న కేంద్ర గణాంకాల శాఖ ప్రకటించింది. 2016-17లో నమోదైన 8.2 శాతం జిడిపితో పోల్చుకుంటే ఇది సగం మాత్రమే. అనేక రంగాలలో ఉత్పత్తి, అమ్మకాలు పడిపోయాయి. 2019-20 సంవత్సరం మూడవ త్రైమాసికలో ఉత్పాదక రంగం మైనస్ 2 శాతం, నిర్మాణరంగం 0.3 శాతం, విద్యుత్, గ్యాస్, ఇతర వినియోగ రంగాలు మైనస్ 0.7కు శాతం పడిపోయాయి. మార్చినెల పారిశ్రామికాభివృద్ధి మైనస్ 16.7 శాతం నమోదైంది. అనేక సంస్థలు కార్మికులు, ఉద్యోగులను తొలగిస్తుండటంతో దేశంలో గతంలో ఏనాడూ లేనివిధంగా నిరుద్యోగం పెరిగింది. భారీ పారిశ్రామిక యంత్రాల నుండి చిన్న తరహా వినియోగ సరుకుల వరకు అన్ని రకాలైన సరుకులను ఉత్పత్తి చేసే సంస్థలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కార్లను కొనుగోలు చేసేశక్తి తగ్గిపోవటంతో ఆ పరిశ్రమ గత 20 సంవత్సరాలలో లేని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రైవేటు పెట్టుబడులు తగ్గిపోయాయి. ఎగుమతులు జిడిపిలో 20 నుండి 19.3 శాతంకు పడిపోయాయి. లాక్‌డౌన్ విధింపుకు ముందే ఈ విధంగా మాంద్యం సమస్యను ఎదుర్కొంటున్న, లాక్‌డౌన్ కారణంగా ప్రతికూల పెరుగుదలను నమోదు చేయనున్న ఆర్థికవ్యవస్థను తిరిగి గాడిన పెట్టటానికి ప్రధాని ప్రకటించిన ప్యాకేజి ఏ మాత్రం దోహదం చేయదు. ఆర్థికాభివృద్ధిని తిరిగి పునరుద్ధరించాలన్నా, లాక్‌డౌన్ కారణంగా ఎదురౌతున్న ప్రతికూల పరిస్థితులను అధిగమించాలన్నా ప్రజల కొనుగోలు శక్తి పెరిగే విధంగా వారికి డబ్బును అందజేయాలి.



epaper.prajasakti.com

**❝ తొలుతగా కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులతో నిమిత్తం లేకుండా వలస కార్మికులతోపాటు ఆదాయపు పన్ను చెల్లించని ప్రతి కుటుంబానికీ నెలకు రూ. 7,500 చొప్పన మూడు మాసాల పాటు ఇవ్వాలి. అలాగే వలస కార్మికులతోపాటు ప్రతి వ్యక్తికీ నెలకు 10 కిలోలు చొప్పన బియ్యాన్ని ఆరు మాసాలపాటు ఇవ్వాలి. లబ్దిదారులకు ఆహారం వండుకునే సదుపాయాలు లేకపోతే వారికి ఆహర ధాన్యాలకు బదులు వండిన ఆహారం ఇవ్వడం అవసరం. ❞**

వంటి దేశాలు పెట్టుబడిదారులకు మాత్రమే ఉపయోగపడే ఆర్థిక చర్యలను చేపట్టాయి. దీనివలన ఆ దేశాలలో ప్రజాగ్రహం, అసంతృప్తి పెరుగుతున్నాయి. దీనిని ఏ విధంగా అదుపుచేయాలి? నిరంకుశ చర్యలతో అణచివేయడమే విధానంగా ఈ ప్రభుత్వాలు ఎంచుకున్నాయి. ఈ రోజు అమెరికాలో జార్జి హత్యకు నిరసనలు ఎంత తీవ్రంగా తలెత్తాయో చూస్తున్నాం. మన దేశంలో వలసకార్మికులయెడల ప్రభుత్వ నిర్లక్ష్యం సహించరానిదని సర్వత్రా వినిపిస్తున్న నిరసనగళాలను వింటున్నాం. ఈ వ్యతిరేకత ఎంతదాకా పోతుంది? అటు సంక్షోభాన్ని పరిష్కరించలేక, ఇటు నిరంకుశ విధానాలకు కూడా పాల్పడితే ఎంతకాలం ఈ ప్రభుత్వాలు మనగలుగుతాయి? పైగా 30 సంవత్సరాలపాటు కనపడకుండా పోయిందనుకున్న సోషలిస్టు ప్రత్యామ్నాయం మళ్ళీ ఆ దేశాలు కరోనాకు కళ్ళెం వేయగలగడంతో ప్రపంచ ప్రజలముందు ప్రత్యక్షమైంది.

అందుచేత శ్రమజీవులు వర్గపోరాటాలవైపు మళ్ళకుండా ఉండడానికి ప్రభుత్వమే తిరిగి సంక్షేమరాజ్య విధానాలను చేపట్టాలన్న వాదనలు ముందుకొచ్చాయి. తద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ మానవీయమైనదని, ప్రజల సంక్షేమానికి బాధ్యత వహిస్తుందని చెప్పి పెట్టుబడిదారీ విధానాన్ని ఎలాగైనా కాపాడుకోవాలని ఆ వాదనలు చెప్తున్నాయి. అదే సమయంలో సోషలిస్టు ప్రత్యామ్నాయం వైపు ప్రజలు మొగ్గకుండా చైనా కరోనాను నియంత్రించడంలో సాధించిన విజయాన్ని యథాశక్తి వక్రీకరించడం కూడా చేస్తున్నాయి.

అటువంటి ప్రయత్నమే స్లావోయ్ జిజెక్ చేశారు. తానొక కమ్యూనిజాన్ని ప్రత్యామ్నాయంగా ప్రతిపాదిస్తున్నానని ఆయన చెప్పారు. కమ్యూనిజం కొత్తగా జిజెక్ ప్రతిపాదించేదేముంటుంది? పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోస్తేనే కదా సోషలిజమూ, ఆ పైన కమ్యూనిజమూ వచ్చేది? ఎక్కడా ఈ విషయాన్ని రచయిత ప్రస్తావించలేదు. ఈ వ్యవస్థను ఏవిధంగా కాపాడాలి అన్నదే రచయిత తాపత్రయం. సంక్షేమవిధానాలను ప్రభుత్వాలు చేపట్టాలన్నదే ఆయన ప్రతిపాదించిన కమ్యూనిజం సారాంశం. మొండిగా కొన్ని పెట్టుబడిదారీ దేశాలు సంక్షేమరాజ్య విధానాలు అమలు చేయడానికి నిరాకరిస్తే అటువంటి దేశాలను కట్టడి చేయడానికి ఆ యా దేశాల సార్వభౌమత్వాన్ని కూడా నియంత్రించాలని జిజెక్ ప్రతిపాదిస్తున్నాడు. ప్రస్తుత విపత్కర పెట్టుబడిదారీ విధానానికి బదులు జిజెక్ విపత్కర కమ్యూనిజాన్ని ప్రతిపాదించానని చెప్పుకున్నాడు. అలా చెప్పడంలోనే ఆయన కమ్యూనిజం ఒక విపత్కరమైనదిగా భావిస్తున్నట్టు సూచిస్తున్నాడు.

పుస్తకం అంతా పూసలో దారంలా చైనాలో ఉన్నదొక నియంతృత్వ వ్యవస్థ అని చెప్పడానికే రచయిత ప్రయత్నించారు. అమెరికాలో, ఇతర సంపన్నదేశాలలో అద్భుతమైన, ఆదర్శవంతమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నట్టు ఆయన భావించినట్టుంది. సిరియాలో మానవహననం అంతా టర్కీ, రష్యాలదేపాపం అన్నట్టు రాశారు. అమెరికా గల్ఫ్ దేశాలలో గత మూడు దశాబ్దాలుగా ఆరనిచిచ్చులను ఏవిధంగా రగిల్చిందీ జిజెక్ పూర్తిగా విస్మరించారు. కాలుష్యం గురించి పలుచోట్ల ప్రస్తావించారుగాని, కాలుష్య నియంత్రణచర్యలను చేపట్టడానికి నిరాకరించిన ట్రంప్ గురించి, ఈ నాటి పర్యావరణ ముప్పు వెనక అమెరికా ప్రధాన బాధ్యత గురించి ఎక్కడా పేర్కొనలేదు. సంక్షోభం అంటేనే వర్గవైరుధ్యాలు తీవ్రం అవడం అని అర్థం. కాని జిజెక్ తాపత్రయం అంతా ఆ వైరుధ్యాలను ఏదోఒక విధంగా చల్లార్చి, చైనా వైపునుంచి దృష్టి మరల్చి, (వీలైన మేరకు చైనా పై విషం కక్కుతూనే) పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడాలనే. ఇంతకూ జిజెక్ బోధనలను ట్రంప్, బోల్సనారో, మోడీ వింటారా? లేక అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను అమలు చేస్తారా? రెండోదే ఖాయం. ఇక జిజెక్ మాటలగారడీలో పడేదెవరు? ఇంకెవరు? సామాన్యులే.

ఇన్నాళ్ళూ కొనసాగిన ప్రపంచీకరణ వలన కొంత ప్రయోజనం పొంది, అదే పరిస్థితి శాశ్వతంగా కొనసాగాలని కోరుకుంటూ అందుకోసమే సోషలిజం వంటి ప్రత్యామ్నాయాల గురించి కనీసపు ఆలోచనలు కూడా చేయకుండా ఉన్న మధ్యతరగతి మేధావులు బహుశా జిజెక్ రచనతో ఏకీభవించవచ్చు. కాని ఉపాధిపోయి, రేపు గడిచేదెలా అని ఆవేదనతో రగిలిపోతున్నవారు, లాంగ్‌మార్చ్‌లో ఉన్న వలసకార్మికులు, హక్కులను కోల్పోతున్న కార్మికులు, వీరికి బాసటగా ఉన్నందుకు నిర్బంధాలనెదుర్కొంటున్న ఉద్యమకారులు ఇంకా ఈ కోవకే చెందిన పలువురు జిజెక్ మాటలవెనక ఉన్న కుట్రను సులువుగానే గుర్తిస్తారు.

❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం, డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**




epaper.prajasakti.com

> **" ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన సహకారాన్ని అందిస్తే వారు వెంటనే ఉత్పత్తిని తిరిగి ప్రారంభించటానికి దోహదం చేసేది. అలా కాకుండా రుణాలు తీసుకోవటం అంటే రుణాలు ఇవ్వటం బ్యాంకుల పరిధిలో ఉంటుంది. ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని చెప్పినా ఆయా సంస్థల ఆర్థిక పరిస్థితులను మథింపు చేయకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వవు. "**

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రెండు మాసాలకు పైగా పనులు నిలిపివేసి, ఇపుడు రుణాలు తీసుకొని వెంటనే ఉత్పత్తిని ప్రారంభించటం సాధ్యం కాదు. ప్రభుత్వం ఈ సంస్థల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన సంస్థలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తే వారు వెంటనే ఉత్పత్తిని తిరిగి ప్రారంభించటానికి దోహదం చేసేది. అలా కాకుండా రుణాలు తీసుకోవటం అంటే రుణాలు ఇవ్వటం బ్యాంకుల పరిధిలో ఉంటుంది. ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని చెప్పినా ఆయా సంస్థల ఆర్థిక పరిస్థితులను మథింపు చేయకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వవు. కాబట్టి వారికి తక్షణం రుణం దొరకటం, ఉత్పత్తిని ప్రారంభించటం సాధ్యం కాదు. ఉత్పత్తి ప్రారంభం కాకపోతే ఆ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు నిరుద్యోగులుగా ఉండాల్సివస్తుంది. వారితో పాటు పరిశ్రమల యజమానులు కూడా ఉపాధిని కోల్పోతారు. ఇది ఒక పరిశ్రమ, ఒక బ్యాంకుకే పరిమితం కాదు. ఫలితంగా ఉపాధి కోల్పోయిన వారు లక్షల సంఖ్యలో నిరుద్యోగులలో చేరతారు. ఇప్పటికే రికార్డు స్థాయిలో ఉన్న నిరుద్యోగుల సంఖ్య మరింత పెరుగుతుంది.

దీనితోపాటు కార్మికచట్టాలలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు కార్మికవర్గంపై తీవ్రమైన భారాలను మోపటంతో పాటు, ఆర్థికమాంద్యాన్ని మరింత పెంచుతాయి. కోవిడ్ 19 మహమ్మారి విజృంభిస్తున్న కాలంలోనే ప్రభుత్వం పనిగంటలను 8 నుండి 12కు పెంచింది. ఫలితంగా యాజమాన్యాలు అంతకు ముందు పనిచేస్తున్న కార్మికులలో మూడింట రెండొంతుల మందితోనే పూర్తి ఉత్పత్తి చేసుకోవటానికి, కార్మికులపై మూడోవంతు పనిభారం పెంచటానికి యజమానులకు అవకాశం కల్పించింది. కష్టకాలంలో కార్మికుల వేతనాలకు ఎటువంటి గ్యారంటీని కల్పించకుండా కార్మికులపై భారాలు మోపుతూ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది.

**కోవిడ్ 19 మహమ్మారిపై పోరాటం చేస్తున్న ప్రభుత్వ వైద్యరంగం**

కోవిడ్ 19 మహమ్మారి దేశంలో రోజురోజుకూ విజృంభిస్తున్నది. కొత్తగా వ్యాధి సోకుతున్నవారి సంఖ్య శరవేగంగా పెరుగుతున్నది. వ్యాధి బారినపడిన వారికి వైద్యం చేయటం కోసం ప్రభుత్వ డాక్టర్లు, ఇతర వైద్యసిబ్బంది అహోరాత్రులు కృషిచేస్తున్నారు. వివిధ స్థాయిలలోని ప్రభుత్వ ఆసుపత్రులు కోవిడ్ 19 మహమ్మారికి వ్యతిరేకంగా పోరాటం చేసే కేంద్రాలుగా మారాయి. కోవిడ్ 19 మహమ్మారి ప్రారంభం వరకు ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్యం లభించదని, అసమర్థతకు కేంద్రాలని, సకాలంలో వైద్యం అందదని రకరకాలుగా ప్రభుత్వ ఆసుపత్రులపై తప్పుడు ప్రచారాలు చేశారు. ప్రైవేటు ఆసుపత్రులు సమర్థవంతమైనవని, అక్కడ నాణ్యమైన వైద్యం అందుతుందని, అన్ని రకాలైన ప్రమాదకరమైన జబ్బులకు ప్రైవేటు ఆసుపత్రులలోనే సమర్థవంతమైన వైద్యం లభిస్తుందని చేసిన ప్రచారాన్ని కోవిడ్ 19 మహమ్మారి పటాపంచలు చేసింది. ఇంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న కోవిడ్ 19 మహమ్మారిపై పోరాటంలో అంత "సమర్థవంతమైన" ప్రైవేటు ఆసుపత్రులు మొహం చాటేశాయి. సమర్థవంతులని ప్రచారం చేసుకున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది ఎక్కడాకనిపించటం లేదు. అసమర్థతకు మారుపేరుగా ప్రచారం పొందిన ప్రభుత్వ వైద్యశాలలు పోరాటకేంద్రాలయాయి. అక్కడి డాక్టర్లు, వైద్యసిబ్బంది పోరాటయోధులుగా మారారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి కోవిడ్ 19 మహమ్మారిపై పోరాటం చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల బండారాన్ని ఇది బట్టబయలు చేసింది. ప్రజల జేబులు కొట్టి తాము లాభాలు సంపాదించుకోవటానికి మినహా ఆపద సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడటానికి ప్రైవేటు ఆసుపత్రులు దోహదం చేయవని స్పష్టమైంది. కేవలం తమ లాభాలను మాత్రమే చూసుకొంటున్న ప్రైవేటు వైద్యరంగాన్ని జాతీయం చేయటం సరైనదని కోవిడ్ 19 మహమ్మారి నిరూపిస్తున్నది.

**కోవిడ్ 19 మహమ్మారిని అరికట్టటానికి తోడ్పడని లాక్‌డౌన్**

కోవిడ్ 19 మహమ్మారివ్యాప్తిని కట్టడి చేయటానికంటూ ఏ మాత్రం సన్నాహాలు, ప్రణాళిక లేకుండా ప్రధాని మొదట ప్రకటించిన 21 రోజుల లాక్‌డౌన్– మార్చి 25 నుండి ఏప్రిల్ 14 వరకు– పూర్తిగా విఫలమైంది. లాక్‌డౌన్ కోవిడ్ 19 మహమ్మారిని అరికట్టటానికి దోహదం చేయలేదు. లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత వైరస్ వ్యాప్తిని అడ్డుకోవటానికి అవసరమైన చర్యలు తీసుకోకపోవటం, వ్యాధి సోకినవారికి తగిన వైద్యసదుపాయాలను అందజేయటంలో లోపాలు, రోజువారీ పనిపాటలు చేసుకొంటూ పొట్టపోసుకొనే పేదలకు ఆహారధాన్యాలు, డబ్బును అందించటానికి చర్యలు తీసుకోకపోవటం, అంతర్రాష్ట్ర, రాష్ట్రాంతర వలస కార్మికులు తమతమ స్వంత గ్రామాలకు వెళ్ళటానికి ప్రభుత్వం తోడ్పాటు నందించకపోవటం ఈ పరిస్థితికి దారితీసింది. ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరితో పేదప్రజలు వర్ణించనలవిగాని ఇక్కట్లకు గురయ్యారు. పనుల కోసం వెళ్ళి దేశంలోని వివిధ ప్రాంతాలలో చిక్కుకుపోయిన వలస కార్మికులు వారి స్వంత ప్రాంతాలకు వెళ్ళటానికి భార్యాపిల్లలతో కలిసి ప్రారంభించిన వేల కిలోమీటర్ల కాలినడక ప్రయాణంలో తీవ్ర ఇక్కట్లను, విషాదకర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఈ సుదూర ప్రయాణంలో ఆకలిదప్పులు, ఎండవేడిమి, అధికశ్రమకు తట్టుకోలేక అనేకమంది మార్గమధ్యంలోనే కన్నుమూశారు. ప్రమాదాలలో వందల మంది మరణించారు. అనేకచోట్ల పోలీసులు లాఠీచార్జి, భాష్పవాయు ప్రయోగం చేశారు. కేంద్ర ప్రభుత్వం పూనుకుంటే వలస కార్మికులను వారి స్వరాష్ట్రాలకు తరలించటం కష్టమైన పనేమీకాదు. రైల్వే యంత్రాంగాన్ని పూర్తిగా వినియోగించి, వివిధ రాష్ట్రాల రవాణా వ్యవస్థలను సమన్వయం చేసుకొంటూ వలస కార్మికులను తరలించటానికి పూనుకున్నట్లైతే వారం రోజులలోనే వలస కార్మికులందరినీ వారి స్వరాష్ట్రాలకు చేర్చటం సాధ్యమయేది. ప్రభుత్వం ఏ మాత్రం ప్రణాళిక లేకుండా విధించిన లాక్‌డౌన్‌తో కోట్లాదిమంది వలస కార్మికుల జీవితాలు అతలాకుతలం అయ్యాయి. లాక్‌డౌన్ వలన పనులు కోల్పోయి చేయటానికి



epaper.prajasakti.com

పని, తినటానికి తిండిలేకుండా అలమటిస్తున్న పేదలను గాలికి వదిలివేయటం ప్రభుత్వ కౄరత్వాన్ని వెల్లడిస్తున్నది. బిజెపి నాయకత్వంలోని కర్ణాటక ప్రభుత్వమైతే రియల్ ఎస్టేట్ యజమానుల ప్రయోజనాల కోసం వలస కార్మికులను వారి స్వరాష్ట్రాలకు తరలించటానికి రాష్ట్రం నుండి నడపటానికి ఉద్దేశించిన రైళ్ళను రద్దుచేసింది. మరికొన్ని రాష్ట్రాలలో కూడా బిజెపి ప్రభుత్వాలు వలస కార్మికుల పట్ల ఇదేవిధంగా వ్యవహరిస్తున్నాయి.

“ లాక్‌డౌన్ విధింపు సందర్భంలోనే ప్రభుత్వం ఏ మాత్రం ముందుచూపు లేకుండా వ్యవహరించింది. ముఖ్యంగా నాలుగు గంటల వ్యవధితో లాక్‌డౌన్ విధింపుతో కోట్లాది మంది ప్రజలు చెప్పలేని ఇక్కట్లకు గురయ్యారు. చుట్టపు చూపుకోసం లేదా స్వంతపని ఉండో, ఇతర కార్యక్రమాల కోసమో వేరేప్రాంతానికి వెళ్ళినవారు రెండు నెలలకు పైగా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ”

లాక్‌డౌన్ విధింపు సందర్భంలోనే ప్రభుత్వం ఏ మాత్రం ముందుచూపు లేకుండా వ్యవహరించింది. ముఖ్యంగా నాలుగు గంటల వ్యవధితో లాక్‌డౌన్ విధింపుతో కోట్లాది మంది ప్రజలు చెప్పలేని ఇక్కట్లకు గురయ్యారు. చుట్టపు చూపుకోసం లేదా స్వంతపని ఉండో, ఇతర కార్యక్రమాల కోసమో వేరేప్రాంతానికి వెళ్ళినవారు రెండు నెలలకు పైగా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. కోవిడ్ 19 మహమ్మారి వ్యాప్తిని నిరోధించటం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాలలోని ప్రజలను ఒకజిల్లా నుండి మరొక జిల్లాకు, జిల్లాలో ఒకప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలివెళ్ళకుండా అడ్డుకుంటున్నాయి. అటువంటి పరిస్థితులలో వలస కార్మికులు గుంపులుగా వేలసంఖ్యలో రాష్ట్రాలు, జిల్లాలు దాటి రావటం అసలు లక్ష్యానికే ఎసరు పెట్టేదిగా మారింది. ఎక్కడివారిని అక్కడికి చేర్చి లాక్‌డౌన్‌ను అమలు చేయటం ప్రారంభించినట్లైతే ఈ సమస్య ఉండేది కాదు. ప్యాకేజిలో భాగంగా వలస వచ్చిన కార్మికులకు మనిషికి 5కిలోల బియ్యం లేదా గోధుమలు, 500 రూపాయలు అందజేస్తామని చెప్పినది కూడా వలస కార్మికులలో అత్యధికులకు ప్రయోజనం కలిగించేది కాదు. వలస కార్మికులను గురించి ఎటువంటి లెక్కలు, వివరాలు లేకుండా వారికి బియ్యం, డబ్బును ఏ విధంగా అందజేస్తారు? ఒకవేళ వలస కార్మికులలో కొందరికి ఆ మొత్తాలను అందజేయగలిగినా ఆ సంఖ్య 10 శాతం కూడా దాటదు. వాటిని అందుకున్నవారు కూడా ఆ మొత్తంతో ఎన్ని రోజులు బతకగలరు? పేదప్రజలు, ముఖ్యంగా వలస కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఈ అంశాలు వెల్లడిస్తున్నాయి.

ఇటువంటి సమయంలో పనులు లేకుండా ఉంటున్న వ్యవసాయ కార్మికులు, వలస కూలీలందరికీ ఉపాధిహామి చట్టం ద్వారా పనులు కల్పించటం అవసరం. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఉపాధిహామి పనులు 50 శాతం అదనంగా కల్పించామని ఆర్థికమంత్రి అవాస్తవాలు చెబుతున్నది. గత సంవత్సరం ఏప్రిల్‌లో 27.3 కోట్ల పనిదినాలు కల్పించగా ఈ సంవత్సరం ఏప్రిల్‌లో 11.1 కోట్ల పనిదినాలను మాత్రమే కల్పించారు. ఒక దశాబ్దకాలంలోనే ఇది అత్యంత తక్కువ. ప్రస్తుతం లాక్‌డౌన్ కారణంగా పనులు దొరకని పరిస్థితులలో ఎక్కువ పనిదినాలను కల్పించటం, దినకూలిని పెంచటం ద్వారా పేదల చేతుల్లోకి ఎక్కువ డబ్బు పెట్టటానికి పూనుకోవాలి. దానితో పాటుగా పనుల కోసం వివిధ రాష్ట్రాలకు వలసపోయిన కార్మికులు తిరిగి వారి స్వరాష్ట్రాలకు చేరుతున్నారు. వీరంతా గ్రామీణప్రాంతం నుండి వలస వెళ్ళినవారే. వారంతా తిరిగి తమ స్వస్థలాలకు చేరటంతో ఉపాధిహామి పనులకు డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి ఉపాధి హామి పనులు కల్పించటం కోసం అదనంగా కేటాయించామని చెబుతున్న 40 వేలకోట్ల రూపాయలు సరిపోవు. కూలీలకు పనులు కల్పించటం కోసం అదనంగా కనీసం లక్షకోట్ల రూపాయలైనా కేటాయించి, ఆ తర్వాత డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన మేరకు కేటాయింపులు చేయాలి. ఉపాధిహామి పనులు కోరుతున్న వారికి పనులు కల్పించటంపై ఎటువంటి పరిమితులు విధించరాదు.

### రైతాంగాన్ని బహుళజాతి సంస్థలకు అప్పగిస్తున్నారు

లాక్‌డౌన్ కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించటం కాకుండా ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని నయా ఉదారవాద సంస్కరణలను రైతాంగంపై రుద్దటానికి ప్రభుత్వం పూనుకుంది. ప్యాకేజిలో భాగంగా ఒకేదేశం ఒకే మార్కెట్ పేరుతో ఏకీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయటం, నిత్యావసరాల సేకరణ, నిల్వలపై ఉన్న పరిమితులను రద్దుచేయటం, నిత్యావసరాల చట్ట సవరణ, రైతులు పంటలు వేసేముందే ధరలపై కొనుగోలుదార్లతో ఒప్పందాలు చేసుకోవటం తదితర సంస్కరణలను ప్రతిపాదించింది. కోవిడ్ 19 మహమ్మారి వలన విధించిన లాక్‌డౌన్ కారణంగా జరిగిన నష్టాన్ని భర్తీచేయటానికి ప్యాకేజిని ప్రకటించిన ప్రభుత్వం ఎప్పటి నుండో రైతులపై రుద్దాలని ప్రయత్నిస్తున్న సంస్కరణలకు ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవటం అత్యంత దారుణం. లాక్‌డౌన్ కారణంగా పండి చేలోవున్న పంటలను మార్కెట్‌కు తీసుకురావటానికి అవకాశం లేకుండాపోవటంతో ఆ రైతులు పూర్తిగా నష్టపోయారు. కొన్నిచోట్ల పండ్లు, కూరగాయలు, ఇతర పంటలను కోయకుండానే వదిలివేయాల్సి వచ్చింది. ఇతర పంటలను కూడా వ్యాపారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేయటం వలన రైతులకు కనీసమద్దతు ధరలు కూడా లభించలేదు. పంటలను కళ్ళం నుండి మార్కెట్‌కు తీసుకురావటానికి కూడా రైతాంగం అనేక కష్టనష్టాలకు గురికావలసి వచ్చింది. లాక్‌డౌన్ కారణంగా ఇప్పటికి రెండు మాసాలకు పైగా పనులు దొరకకపోవటంతో చేయటానికి పనులు, తినటానికి తిండి లేక వ్యవసాయ కార్మికులు, పేదలు అల్లాడిపోయారు. ఇటువంటి స్థితిలో రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను ఆదుకోవటానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ప్రభుత్వాలు రైతుబంధు పేరుతో వారి ఎకౌంట్లలో వేస్తున్న 5,500 రూపాయలతో వారికి పరిమిత ప్రయోజనమే చేకూరుతుంది. అదికూడా రైతులందరికీ అందటం లేదు. దానితోనే పరిమితం కాకుండా పంటలు అమ్ముకోలేని రైతులకు తగిన సహాయాన్ని అందించాలి. ప్రధాని ప్రకటించిన ప్యాకేజిలో వారి సమస్యలను పరిష్కరించటానికి అటువంటి కేటాయింపులు లేకపోగా రైతాంగాన్ని కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అప్పగించే షరతులను అమలుచేయాలని ప్రతిపాదనలు



epaper.prajasakti.com

> **"కోవిడ్ 19 మహమ్మారితో దేశప్రజల జీవితాలకు ప్రమాదం ముంచుకొచ్చిన వేళ ప్రజలందరూ ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వ అండతో పాలకపార్టీ ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నది. ముస్లింలు కరోనాను వ్యాపింపజేస్తున్నారని, ఆహార పదార్థాలను కురగాయలు, ఇతర వినియోగ సరుకులను కలుషితం చేసి అందిస్తున్నారని, కాబట్టి వారి వద్ద సరుకులను కొనుగోలు చేయవద్దని తప్పుడు ప్రచారం చేస్తున్నది."**

చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసే, బడా రిటైల్ సంస్థలు, ఎగుమతిదారుల చేతుల్లో రైతాంగాన్ని పెట్టటానికి అవసరమైన నయా ఉదారవాద సంస్కరణలను కూడా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. వ్యవసాయరంగంలోకి పెట్టుబడులను ఆహ్వానించటం కోసం ఆహారధాన్యాలు, నూనెగింజలు, పప్పులు, బంగాళాదుంపలు, వంటనూనెలు, ఉల్లిపాయలు తదితరాల ధరలపై ఉన్న నియంత్రణను రద్దుచేస్తామని చెప్పారు. ఈ కామర్స్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను లాభసాటి ధరలకు దేశంలో ఎక్కడైనా అమ్ముకోవటానికి కేంద్ర చట్టాన్ని తీసుకురానున్నట్లు కూడా ఆమె ప్రకటించారు. తమ పొలంలో, ఉన్నవూరిలో, మండల కేంద్రంలోని మార్కెట్లో తమ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు అమ్ముకోలేని రైతులను దేశంలోని ఇతర రాష్ట్రాలలో లాభసాటి ధరలకు అమ్ముకోమని చెప్పటం వారిని పరిహసించటం కాదా? ఇటువంటి ఆపత్కాలంలో రైతుల పట్ల ఇంత క్రూరంగా వ్యవహరించటం బిజెపి ప్రభుత్వానికే చెల్లింది.

కార్మికులు, కర్షకులు, ఇతర పేదలకు ఈ ఆపత్కాలంలో అవసరమైన మేరకు సహాయం చేయకపోగా రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, పేదప్రజలకు ఉచితంగా డబ్బులివ్వటం వారిని సోమరులను చేస్తుందని, ప్రచారం చేస్తున్నారు. మరోవైపున మోడి ప్రభుత్వం కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేస్తుంటే, ప్రతి సంవత్సరం వారికి ఐదు లక్షల కోట్ల రూపాయలకు పైగా పన్ను రాయితీలను ఇస్తుంటే, స్వాతంత్ర్యానంతరం దేశప్రజలు తమ శ్రమతో నిర్మించుకున్న లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వరంగ సంస్థలను వారికి ధారాదత్తం చేస్తుంటే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలు దేశ ప్రయోజనాలకే భంగం కలిగిస్తున్నాయి. పేదప్రజలు ఆపత్కాలంలో బతకటానికి ప్రభుత్వం నామమాత్రమైన ఆర్థిక సహాయాన్ని మాత్రమే అందిస్తుంటే అదికూడా సహించలేక వ్యతిరేకంగా ప్రచారం చేయటం కార్పొరేట్ ప్రచార యంత్రాంగ నిజస్వరూపాన్ని వెల్లడిస్తున్నది.

కోవిడ్‌కు వ్యతిరేకంగా రంగంలో ఉండి పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఈ ప్యాకేజీలో ఏమీ పేర్కొనలేదు. వారి రుణపరిమితిని 3 నుండి 5 శాతానికి పెంచుతూ అందుకు షరతులను కూడా జతచేశారు. కేంద్రం రాష్ట్రాలకు చెల్లించాల్సిన జిఎస్‌టి బకాయిలను కూడా ఇంతవరకు చెల్లించలేదు. ఇటువంటి సమయంలో రాష్ట్రాలకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణం చెల్లించి, అవసరమైన అదనపు సహాయాన్ని కూడా అందించటం ప్రభుత్వ బాధ్యత. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించి రాష్ట్రాలపై కక్ష తీర్చుకొనే ధోరణిలో వ్యవహరిస్తున్నది.

### విద్వేషాన్ని పెంచుతున్నారు

కోవిడ్ 19 మహమ్మారితో దేశప్రజల జీవితాలకు ప్రమాదం ముంచుకొచ్చిన వేళ ప్రజలందరూ ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వ అండతో పాలకపార్టీ ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నది. ముస్లింలు కరోనాను వ్యాపింపజేస్తున్నారని, కోవిడ్ జిహాద్ చేస్తున్నారని, ఆహార పదార్థాలను మలినం చేసి అమ్ముతున్నారని, కురగాయలు, ఇతర వినియోగ సరుకులను కలుషితం చేసి అందిస్తున్నారని, కాబట్టి ప్రజలు వారి వద్ద సరుకులను కొనుగోలు చేయవద్దని ప్రజలలో సంఘ్ పరివార్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. ముస్లింలు వృత్తులు, వ్యాపారాలు చేసుకొంటున్న చోట వారిని వ్యాపారాలు చేసుకోకుండా బెదిరిస్తున్నారు. ఈ విధంగా ముస్లిం మైనారిటీలను మిగతా ప్రజానీకం నుండి దూరం చేయటానికి, సామాజికంగా ప్రజలను విభజించటానికి పూనుకున్నారు. సంఘ్ పరివార్ అనుయాయులు కోవిడ్ 19 మహమ్మారిపై పోరాటం కన్నా మిగతా ప్రజల నుండి ముస్లింలను దూరం చేయటమే ప్రధానలక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ

---

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**



epaper.prajasakti.com

> “ వాస్తవంగా కోవిడ్ మహమ్మారిని అరికట్టటానికి ప్రభుత్వానికి సమగ్రమైన విధానం ఉండాలి. ఇందుకోసం కోవిడ్ మహమ్మారిని సమర్ధవంతంగా అరికట్టి, దేశంలోనూ, అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన కేరళ రాష్ట్ర సహకారాన్ని తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. దేశప్రజలందరినీ ఈ పోరాటంలో భాగస్వాములను చేయాలి. ప్రజలను మత ప్రాతిపదికపై విభజించి, మైనారిటీలపై దాడులు చేసే విధానాలను తక్షణం విడనాడాలి. ”

విధానం యొక్క దుష్ఫలితాలు దేశంలో కోవిడ్ 19విజృంభణలో కనిపిస్తున్నాయి. మార్చి25న లాక్‌డౌన్ విధించేటపుడు కోవిడ్ 19 మహమ్మారి వ్యాప్తిలో అట్టడుగు స్థానంలో ఉన్న మనదేశం మే 25 నాటికి ప్రపంచదేశాలలో 10వ స్థానానికి చేరి, రోజువారీ కేసుల పెరుగుదలలో అమెరికా తరువాతి స్థానానికి చేరటానికి పరుగులు తీస్తున్నది.

**అమెరికాకు లంగుబాటు**

స్వయం పోషకత్వాన్ని గురించి చెబుతున్న గొప్పల మాటున అమెరికాకు లంగుబాటును కప్పిపుచ్చుకోవటానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఆ నాటకాలు కూడా ఈ సందర్భంలో బట్టబయలయాయి. దేశంలో వైరస్ వ్యాపిస్తున్న మొదటిలో వ్యాధివ్యాప్తిని నిరోధించటం కోసం చైనా నుండి తమిళనాడు ప్రభుత్వం తెప్పించుకొంటున్న పరికరాలను అమెరికా మధ్యలోనే అడ్డగించి తన దేశానికి తరలించుకు పోయింది. అమెరికా ఇంత అక్రమంగా వ్యవహరించినా ప్రభుత్వం కనీసం నిరసన కూడా తెలియజేయలేదు. తర్వాత అమెరికా నుండి వెంటిలేటర్లను దిగుమతి చేసుకోవటానికి మన ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇది మనం డబ్బు చెల్లించి తీసుకుంటున్నవి మినహా అమెరికా మనకు ఉచితంగా ఇచ్చేవి కాదు. అమెరికా మనకు రావలసినవాటిని అక్రమంగా తరలించుకెళితే ఖండించని ప్రభుత్వం అమెరికా చేయని సహాయానికి అభినందనలు తెలిపింది. అమెరికాకు ఈ విధంగా లంగిపోతున్న ప్రభుత్వం స్వయం పోషకత్వాన్ని గురించి చేస్తున్న ప్రకటనలు ప్రజలను మోసం చేయటానికే.

**మహమ్మారిని ఎదుర్కోవటానికి సమగ్ర విధానం ఉండాలి**

కోవిడ్ 19 మహమ్మారిని ఎదుర్కోవటం కోసం వివిధ దేశాలు తమ జిడిపిలో పెద్దమొత్తాలను కేటాయించాయి. జపాన్ 21.1 శాతం, అమెరికా 13 శాతం, స్వీడన్ 12 శాతం, జర్మని 10.7 శాతం, ఫ్రాన్స్ 9.3 శాతం, స్పెయిన్ 7.3 శాతం, ఇటలి 5.7 శాతం తమ జిడిపిలను కోవిడ్ 19 మహమ్మారిపై పోరాటానికి కేటాయించాయి. భారతదేశం 10.97 శాతం కేటాయించినట్లు ప్రకటించినా వాస్తవంగా ఇందుకోసం ఖర్చుచేసేది జిడిపిలో 0.7 నుండి 1.3 శాతానికి మించదని ఆర్థికవేత్తలు, వివిధ రేటింగ్ ఏజన్సీలు ప్రకటించాయి. ఇంత తక్కువ ఖర్చుతో కోవిడ్ 19 మహమ్మారిని అరికడతామని, ప్రజలకు ఉపాధి కల్పించి ఆర్థికవ్యవస్థను గాడిన పెడతామని ప్రచారం చేస్తూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది.

వాస్తవంగా కోవిడ్ మహమ్మారిని అరికట్టటానికి ప్రభుత్వానికి సమగ్రమైన విధానం ఉండాలి. ఇందుకోసం కోవిడ్ మహమ్మారిని సమర్ధవంతంగా అరికట్టి, దేశంలోనూ, అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన కేరళ రాష్ట్ర సహకారాన్ని తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. దేశప్రజలందరినీ ఈ పోరాటంలో భాగస్వాములను చేయాలి. ప్రజలను మత ప్రాతిపదికపై విభజించి, మైనారిటీలపై దాడులు చేసే విధానాలను తక్షణం విడనాడాలి. దేశ జిడిపిలో 10 నుండి 15 శాతం మొత్తాన్ని కోవిడ్ 19 నియంత్రణ కోసం కేటాయించాలి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సమన్వయం చేసుకొని తమ స్వరాష్ట్రాలకు వెళతామంటున్న వలస కార్మికులను వారి స్వరాష్ట్రాలకు చేర్చాలి. ఆదాయం పన్ను చెల్లించని కుటుంబాలన్నింటికీ నెలకు తలకు 10 కిలోల చొప్పున ఆహారధాన్యాలను అవసరమైనంత కాలం అందించాలి. నెలకు కనీసం 1500 రూపాయలకు తగ్గకుండా ఆ కుటుంబాల ఎకౌంట్లలో జమచేయాలి. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా చెల్లించి రైతాంగం పడించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. లాక్‌డౌన్ కాలంలో పంటలను కోయలేక, సరైన ధరలకు అమ్ముకోలేక నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలి. కౌలురైతులకు అదనపు పరిహారం అందించాలి. కార్మికచట్టాల సవరణలను అరికట్టాలి. పనిగంటలను 8 నుండి 12 కు పెంచుతూ జారి చేసిన ఆర్డినెన్స్‌ను ఉపసంహరించాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ఉద్యోగాలు కల్పించలేకపోతే నిరుద్యోగభృతిని అందించాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో ఉత్పత్తిని తిరిగి ప్రారంభించటానికి అవసరమైన మేరకు ఉచిత ఆర్థిక సహకారాన్ని అందించాలి. పరిశ్రమలకు అవసరమైన రుణాలను అందజేయాలి. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించే కార్యక్రమాలను తక్షణం రద్దుచేయాలి. కార్పొరేట్, బహుళజాతి సంస్థలు, ఇతర సంపన్నుల నుండి వసూలు చేస్తున్న పన్నురేట్లను పెంచాలి. కార్పొరేట్, బహుళజాతి సంస్థలు బ్యాంకులకు ఎగ్గొట్టిన 7.5 లక్షల కోట్ల రూపాయలను వసూలు చేయాలి. ఇటువంటి చర్యలతో కోవిడ్ 19 మహమ్మారిని అరికట్టటంతో పాటు ఆర్థికవ్యవస్థను సరైనగాడిలో పెట్టవచ్చు.

కాని ఇటువంటి చర్యలు తీసుకొంటే పెట్టుబడులు దేశం నుండి తరలిపోతాయని, అభివృద్ధి కుంటుపడుతుందని, విదేశీ పెట్టుబడులు రావని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నది. మరి ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేస్తున్నా ఈ సంవత్సరంలో ఇప్పటికి 1.25 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఎందుకు తరలిపోయాయి? కొత్తగా పెట్టుబడులు ఎందుకు రావటం లేదు? ఈ విషయాలను పక్కన పెట్టి అంతర్జాతీయ రేటింగ్ ఏజన్సిలు, ఐఎంఎఫ్, డబ్ల్యుబి తదితరాలను సంతృప్తి పరచటం కోసం ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక, దేశ ప్రయోజనాలకు విఘాతం కల్పించే విధానాలను అమలు చేయటానికి పూనుకొంటున్నది. దేశప్రజలంతా ఐక్యంగా కదిలి బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి. కోట్లసంఖ్యలో ఉన్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, చిన్న వృత్తులు, వ్యాపారాలు చేసుకొనే పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కోవిడ్ 19 మహమ్మారిని అరికట్టటం గాని, దేశ ఆర్థికవ్యవస్థకు జవసత్వాలు కల్పించటం కాని సాధ్యంకాదు.

❊



epaper.prajasakti.com

దశాబ్దాలలో రెండు ఖండాలు, ఆసియా, ఆఫ్రికా ఖండాల విముక్తితో ప్రారంభించాడు. దీనినుండి అతను ఈ దిగువ పేర్కొన్న ఆశ్చర్యకరమైన నిర్ధారణలకు వచ్చాడు. "గత సంస్కృతి అంతటికీ వారసురాలినని వాదిస్తున్న మార్క్సిజం దీనినంతటినీ పునరుజ్జీవనోద్యమం నుండి ఉద్భవించిన పశ్చిమదేశాలకు చెందిన సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్రం, ఇంగ్లీష్ రాజకీయ ఆర్థశాస్త్రం, ఫ్రెంచి సోషలిజం, గ్రీకు హేతువాదంకి పరిమితం చేయలేదు. ఇస్లాం సంస్కృతికి చెందిన ఒక అల్జీరియన్ హెగెల్, రికార్డో, సెయింట్ సైమన్ చెప్పిన వాటికి భిన్నమైన మార్గంలో శాస్త్రీయ సోషలిజానికి చేరవచ్చు. కార్మాతియన్ ఉద్యమంలో వారి ఊహాజనిత సోషలిజం, అతని కన్నా ముందు చారిత్రక భౌతికవాదాన్ని చెప్పిన ఇబన్ కాల్డన్, ఎవెరోస్‌లలో వారి హేతువాద, గతితార్కిక ఉద్యమ భావాలు ఉన్నాయి. ఈ సాంప్రదాయాల నుండి అతను శాస్త్రీయ సోషలిజాన్ని అర్థం చేసుకున్నాడు. అతని సాంస్కృతిక వారసత్వంలో మనం భాగం అయిన విధంగానే అతనిని మన సాంస్కృతిక వారసత్వంలో భాగంగా చేసుకోవటాన్ని ఇది ఏ విధంగానూ నిరోధించదు".

సంస్కృతికి సంబంధించి సమ్మిళితం అనేమాట తరచుగా దుర్వినియోగం చేయబడుతున్నది. కాని ఈ మాటను వినియోగించటంపై గరాడితో మనం తగవు పడాల్సిన అవసరం లేదు. ప్రపంచ సాంస్కృతిక వారసత్వంలోని అంశాలను బాగా అర్థం చేసుకోవటం ద్వారా మార్క్సిస్టు మౌలికసూత్రాలను మరింత బలపరచుకోవచ్చు. ఆసియా, ఆఫ్రికాలలో నూతనంగా విముక్తి పొందిన దేశాల సాంస్కృతిక వారసత్వంపై పునరంచనా వేయాల్సిన అవసరం ఉంది. సామ్రాజ్యవాదులు, వారి మద్దతుదారులు ఉద్దేశ్యపూర్వకంగా ఈ సాంస్కృతిక వారసత్వాన్ని దిగజార్చటం, వక్రీకరించటం చేస్తున్నారు. ఇది ఈ దేశాల ప్రజలకు తమ జాతీయ వారసత్వం లేకుండా చేసి, వారి నైతికస్థాయిని దిగజార్చటం ద్వారా సామ్రాజ్యవాదులకు ప్రయోజనం కలిగిస్తుంది. వారి పూర్వీకుల నుండి వచ్చిన వారసత్వాన్ని వక్రీకరించటం ద్వారా వాస్తవాలను పక్కనపెట్టి, తప్పుడు అభిప్రాయాలను, తనకు అవసరమైన భావనలను వారిలో ప్రవేశపెట్టటం ద్వారా సామ్రాజ్యవాదం ప్రయోజనం పొందుతుంది.

ఇదే అంశాన్ని గరాడి చెబితే మార్క్సిస్టులు అతనితో విబేధించాల్సిన అవసరం లేదు. అతను ఈ అంశాన్ని చెప్పటం లేదు కాబట్టి అతనితో తప్పనిసరిగా విబేధించాలి. వాస్తవంగా గరాడి మార్క్సిజానికి ప్రత్యామ్నాయాన్ని చెబుతున్నాడు. నూతనంగా విముక్తి అయిన దేశాలలోని సంస్కృతుల వారసత్వంలో ఉన్న వివిధ అంశాలను తీసుకొని ఈ ప్రత్యామ్నాయాన్ని నిర్మించవచ్చునని, మార్క్స్, ఎంగెల్స్ నడిచిన బాట ఒక్కటే మార్క్సిజం కాదని అతను మనకు చెబుతున్నాడు. మార్క్సిజంతో పాటు ఇతర మార్గాలు కూడా ఉన్నాయని, ఆ మార్గాలలో నడవటమే నూతనంగా విముక్తి అయిన దేశాల ప్రజలకు క్షేమం అని అతను చెబుతున్నాడు. అటువంటి ప్రతిపాదన వినాశకరమైనది. మార్క్స్, ఎంగెల్స్‌లు నడిచిన బాట వాళ్ళకువాళ్ళుగా ఎంచుకున్నది, ఏదో అనుకోకుండా జరిగిందని చెప్పటంతో సమానం. అదేగాని వాస్తవమైతే సిద్ధాంతం, ఆచరణ ద్వారా చారిత్రకంగా అభివృద్ధి అయి, ప్రపంచవ్యాపితంగా లక్షలాది మంది కార్మికులను తమ విముక్తి కోసం నడుపుతున్న, ఈ రోజు మనం చూస్తున్న మార్క్సిజం కూడా ఏదో యధాలావంగా వచ్చినది అయివుంటుంది. అల్జీరియన్‌లు కూడా తమ సాంస్కృతిక వారసత్వంతో భిన్నమైన మార్గంలో సాగి, మార్క్సిజానికి ప్రత్యామ్నాయాన్ని నిర్మించుకోవచ్చు. కాని వాస్తవంగా వారలా చేయగలరా? దీనిలో భారతీయులుగా తక్షణం మనకు వర్తించేదేమిటి? మన సాంస్కృతిక వారసత్వంలోని అంశాలను తీసుకొని మార్క్సిజానికి ప్రత్యామ్నాయాన్ని మనం నిర్మించగలమా? అలా చేయటం సాధ్యం కాదు. కారణం స్పష్టం. మార్క్స్, ఎంగెల్స్ నడిచిన బాట ఏదో అనుకోకుండా ఎంచుకున్నది కాదు. సాంప్రదాయక జర్మన్ తత్వశాస్త్రం, బ్రిటిష్ రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచి సోషలిజం గతితార్కిక క్రమం ద్వారా అసాధారణమైన పరిణామం పొందిన క్రమంలోనే మార్క్సిజం రూపొందటం అనుకోకుండా జరిగింది కాదు. చారిత్రక అభివృద్ధి క్రమంలో ఇది జరిగింది. అల్జీరియా, భారత్ తదితర ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధికి దీనితో పోలిక లేదు.

> **"భారతీయ సాంప్రదాయక తత్వశాస్త్రంలో, ప్రత్యేకంగా బుద్ధిజం ప్రారంభకాలంలో గతితార్కిక వాదానికి సంబంధించిన భావాలున్నాయి. అంతేకాకుండా పురాతన భౌతికవాదులైన చార్వాకులు, లోకాయతులు పదార్థం నుండి చైతన్యం అభివృద్ధి చెందిందన్న భావాల్ని వ్యక్తం చేశారు. భారతీయ సాంస్కృతిక వారసత్వంలో ఇవి చాలా విలువైనవి."**

ఉదాహరణకు భారతీయ సాంప్రదాయక తత్వశాస్త్రంలో, ప్రత్యేకంగా బుద్ధిజం ప్రారంభకాలంలో గతితార్కిక వాదానికి సంబంధించిన భావాలున్నాయి. అంతేకాకుండా పురాతన భౌతికవాదులైన చార్వాకులు, లోకాయతులు పదార్థం నుండి చైతన్యం అభివృద్ధి చెందిందన్న భావాల్ని వ్యక్తం చేశారు. భారతీయ సాంస్కృతిక వారసత్వంలో ఇవి చాలా విలువైనవి. వాస్తవ ప్రాధాన్యత ఉన్న ఇటువంటి అంశాలను పట్టించుకోకపోవటం ఘోరమైన తప్పిదం అవుతుంది. అయినప్పటికీ వీటికి అసాధారణ ప్రాధాన్యత ఇవ్వటం, స్పష్టత లేకుండా-మిస్టీరియస్-రెండింటినీ కలపటం వలన గతితార్కిక భౌతికవాదం, భౌతికవాద గతితర్కంకు దారితీస్తాయని భావించటానికి దారితీస్తుంది. ఇటువంటి భావాల అసంగతత్వం గురించి చర్చించటం అనవసరం. కాని శాస్త్రీయ సోషలిజాన్ని ప్రతిపాదించిన మార్క్సిజం ప్రతిపాదకులు ఈ మార్గానికి ఏ విధంగా ప్రయాణించారనేది అర్థం చేసుకోవటం ఇక్కడ ముఖ్యమైన విషయం. ఇక్కడ ఒక ఉదాహరణను చూద్దాం. 1874లో ఎంగెల్స్ ఈ విధంగా చెప్పాడు. "హెగెల్‌కు ముందున్న జర్మన్ తత్వశాస్త్రం లేకపోతే జర్మన్ శాస్త్రీయ సోషలిజం- ప్రపంచంలో ఉన్న ఒకే ఒక శాస్త్రీయ సోషలిజం- ఎప్పటికీ ఉనికిలోకి వచ్చేది కాదు".

ఆ విధంగా వాస్తవంగా ఆసియా, ఆఫ్రికాదేశాల సాంస్కృతిక వారసత్వంతో మార్క్సిజానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని నిర్మిద్దామనే ఆలోచన మార్క్సిజాన్ని తిరగదోడటానికి, దానితో కార్మికవర్గం చేతుల్లో అజేయమైన ఆయుధం లేకుండా చేయటానికి దారితీస్తుంది. మార్క్సిజానికి ప్రత్యామ్నాయ



epaper.prajasakti.com

సిద్ధాంతం

# భారతదేశంలో సైద్ధాంతిక పోరాటం : ప్రత్యేకతలు




రచయిత ప్రఖ్యాత
మార్క్సిస్టు తత్వవేత్త

**దేవీప్రసాద్ చటోపాధ్యాయ**

ఈ రోజు భారతదేశంలో జరుగుతున్న సైద్ధాంతిక పోరాటంలో మన సాంప్రదాయక ఆలోచనలలో సజీవమైనవి ఏవి, నిర్జీవమైనవి ఏవి అన్న విషయాల్ని అర్థం చేసుకోవాలి. మనం ఉన్న చారిత్రక సందర్భమే ఈ పరిస్థితులను అర్థం చేసుకోవలసిన అవసరాన్ని కల్పిస్తున్నాయి. శాస్త్రీయ సోషలిజం కోసం మనం చేసే పోరాటంలో ఎంత వరకు విజయం సాధిస్తామనేదే మన ఆశలు, ఆకాంక్షలు, చివరికి ఒక స్వతంత్రదేశంగా మన ఉనికి, మనుగడ సాగించటానికి కొలబద్దగా ఉంటుంది. ఈ పోరాటానికి దోహదం చేసేదే భారతీయ తత్వశాస్త్ర సాంప్రదాయంలో సజీవంగా ఉంటుంది. దీనికి వ్యతిరేకమైనదంతా గతానికి చెందినదిగా, మృతప్రాయంగా ఉంటుంది. ఈ పోరాటాన్ని బలవరిచే శక్తులేమిటి? లౌకికవాదం, హేతువాదం, శాస్త్రీయ దృక్పధం కలిగిన శక్తులు దీనిలో కలిసివచ్చేవిగా ఉంటాయి. ప్రకృతిని అర్థం చేసుకొని, దానిపై ఆధిపత్యం సాధించటం, ప్రకృతిలో ఒక భాగమైన మానవ సమాజంపై కూడా ఆధిపత్యం సంపాదించటం చివరి అంశంలో భాగంగా ఉంటాయి. కులతత్వం, మతతత్వం, మతపరమైన పురాణాలు, వేదాలపై ఆధారపడిన గ్రంథాలు, హేతువిరుద్ధత, అభివృద్ధి నిరోధకత్వం, అసహజమైన, అవాస్తవమైన అంశాలను పట్టించుకోకుండా మనం సోషలిజాన్ని నిర్మించటం సాధ్యమౌతుందా? సాధ్యం కాదు. ఈ విధమైన సిద్ధాంతాలన్నింటిపై పోరాడటం ద్వారా మాత్రమే మనం సోషలిజాన్ని నిర్మించగలం. భారతీయ తత్వశాస్త్రంలో ఇటువంటి శక్తులకు ప్రాతినిధ్యం వహించే భావాలను మనం మృతభావాలుగా పరిగణిస్తాం. ఈ భావాలు మన అభివృద్ధికి ఆటంకం కల్పించి, మన ధైర్యాన్ని దెబ్బతీస్తాయి. మనకు భవిష్యత్ దృక్పధం లేకుండా చేసి, ఏ మాత్రం ప్రతిఘటన లేకుండా నయా సామ్రాజ్యవాదానికి లంగిపోయే పరిస్థితికి తీసుకుపోతాయి. ఈ విధమైన భావస్పష్టతతో మనం ఈ రోజు భారతదేశంలో జరగాల్సిన సైద్ధాంతిక పోరాటాన్ని గురించి చర్చిద్దాం. మనం ఇప్పటి వరకు చేసిన చర్చ ఆధారంగా మన తత్వశాస్త్ర గతానికి సంబంధించి చైతన్యవంతమైన పరిశీలన చేసి వాటిలో మరణించినవి ఏవి, సజీవమైనవి ఏవి అన్నది నిర్ధారించుకోవాలి. రెండవది. గతంలోని భావాలలో ఏవైతే మరణించాయో వాటిని మన ప్రజల సామాజిక చైతన్యం నుండి తుడిచివేయటానికి ప్రయత్నించాలి. మూడవది. సమకాలీన విజ్ఞానం, అనుభవాలతో సజీవమైన దానిని మరింతగా పెంపొందించాలి. సాంప్రదాయక ఆలోచనలలోని శకలాలను తొలగించుకోవటానికి ఇది శక్తివంతమైన మార్గం అవుతుంది. ఈ అంశాలపై కొంత వివరణ కావాలి. ఈ అంశాలు తత్వశాస్త్ర సంబంధమైనవైనప్పటికీ తత్వవేత్తలు మాత్రమే ఈ కర్తవ్యాలను ఎందుకు సాధించలేరన్న అంశంపై కొద్దిపాటి వివరణతో మన చర్చను ముగిద్దాం. భారత కార్మికవర్గ ఉద్యమమే ఈ మొత్తం లక్ష్యాన్ని సాధించగలదు.

**సాధారణ, ప్రత్యేక కర్తవ్యాలు**

భారతదేశంలో సైద్ధాంతిక పోరాటానికి సంబంధించిన ప్రత్యేకమైన కర్తవ్యాన్ని మనం చర్చించాం. ఈ పోరాటంలో ఇది కాకుండా సాధారణమైన కర్తవ్యం లేదనుకుంటే మనం పెద్దతప్పు చేసినవారం అవుతాం. సాధారణ కర్తవ్యం అత్యంత ప్రాముఖ్యత కలిగినది. సాధారణ కర్తవ్యాన్ని నెరవేర్చటానికి ప్రయత్నం చేయకుండా ప్రత్యేక కర్తవ్యాన్ని పూర్తిచేయలేం. అదిలేకుండా ప్రత్యేక కర్తవ్యాన్ని నెరవేర్చటానికి ఎటువంటి దృక్పధం ఉండదు. మార్క్సిజాన్ని అర్థం చేసుకోవటం, ప్రచారం చేయటం, అమలుచేయటమే ఈ సాధారణ కర్తవ్యం. సోషలిజం వైపు వెళ్ళటానికి ఒకే ఒక మార్గం ఉంది. మార్క్సిజం మౌలిక సూత్రాలను అమలుచేయటమే ఆ మార్గం. అందువలననే మార్క్సిజం ఈ రోజు ప్రపంచవ్యాపితంగా చాలా ఆశలను కలిగించింది. వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. లెనిన్ నాయకత్వంలో మార్క్సిస్టు మౌలికసూత్రాలను జయప్రదంగా అమలు జరిపి, పాత సమాజపు కుళ్ళులో నుండి మొట్టమొంటిసారిగా నూతన సమాజపు ఆవిర్భావాన్ని చూసిన కార్మికవర్గం ఉత్తేజం పొంది, ఆశలను పెంచుకొంది. ఇదే కారణంతో స్వార్థపర వర్గాలు మార్క్సిజం పట్ల వ్యతిరేకతను పెంచుకొని, తమ ఉనికిని కాపాడుకోవటం కోసం సామ్రాజ్యవాద నాయకత్వంలో మేధో వనరులతో సహా అన్ని వనరులను సమీకరించి, మార్క్సిజం పనికిరాదని ప్రచారం చేస్తున్నాయి. వీటన్నింటిపైనా వివరమైన చర్చ జరగటం అవసరం. సాధారణ కర్తవ్యాలలో భాగమైన మార్క్సిజాన్ని సాధారణ ప్రజల వద్దకు తీసుకువెళ్ళటమే ఈ రోజు భారతదేశంలో జరిగే సైద్ధాంతిక పోరాటంలో అత్యంత మౌలికమైన అంశం. ప్రస్తుతం మనమున్న నిర్దిష్టమైన చారిత్రక పరిస్థితులలో మనకు ప్రత్యేకమైన కర్తవ్యం కూడా ఉన్నది. దీనిని అపార్థం చేసుకోవటం ద్వారా మన సైద్ధాంతిక పోరాట కర్తవ్యాల స్వభావాన్ని అర్థం చేసుకోవటంలో రెండు పొరపాట్లు జరిగే అవకాశం ఉంది. వీటిలో ఒకటి మితవాద ధోరణి వలన, రెండవది అతివాద ధోరణి వలన చోటుచేసుకుంటాయి. మితవాద పొరపాట్లకు ఉదాహరణగా రోజర్ గరాడి ఇరవైయవ శతాబ్దంలో మార్క్సిజం అన్న తన పుస్తకంలో చర్చించిన అంశాలను మనం చూడవచ్చు. ఆధునిక చరిత్రను తీవ్రంగా మార్చిన రెండు



epaper.prajasakti.com

**"18వ శతాబ్దానికి చెందిన విప్లవకారుల రచనలలో మృతప్రాయమైన అంశాలు కొన్ని ఉన్నాయి. అయినప్పటికీ వాటిలో కొంత సజీవమైన, ఇప్పటికీ ఉపయోగపడే అంశాలు కొన్ని ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సైద్ధాంతిక పోరాటంలో మొదటి దానిని పూర్తిగా ధ్వంసం చేసి, రెండవ దానిని అభివృద్ధి చేయటం మనకు అవసరం. మన నాస్తికవాద వారసత్వంతో మన విబేధాలను పరిష్కారం చేసుకోవాల్సిన ప్రధానాంశాలు ఇవి."**

ఆయుధం కార్మికవర్గం చేతుల్లో లేదు. ప్రజలను మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణతో సాయుధులను చేయటం భారతదేశంలో నేడు జరుగుతున్న సైద్ధాంతిక కృషిలో సాధారణ కర్తవ్యం-అత్యంత మౌలిక కర్తవ్యం. దానికి ప్రత్యామ్నాయాన్ని చూడాలని చెప్పటం వినాశనానికి దారితీస్తుంది.

### ప్రత్యేక కర్తవ్యం దాని ప్రాధాన్యత

భారతదేశంలో జరిగే సైద్ధాంతిక పోరాటంలో మితవాద అవగాహన ప్రమాదాన్ని గురించి చెబుతున్నామంటే అతివాద అవగాహన ప్రమాదాన్ని విస్మరించటమని అర్థం కాదు. ఈ పాక్షిక అవగాహన సాధారణ కర్తవ్యం ఒక్కటే మనం నెరవేరిస్తే సరిపోతుందని, కాబట్టి సాధారణ కర్తవ్య నిర్వాహణలో భాగంగా ప్రజలకు మార్క్సిజాన్ని గురించి అవగాహన కల్పిస్తే సరిపోతుందని, మనదేశంలోని గతకాలపు తత్వశాస్త్ర భావజాలంతో మన పోరాటాన్ని గురించి పట్టించుకోవకపోయినా, దానితో పోరాటం చేసి ఓడించకపోయినా ఫర్వాలేదని, సైద్ధాంతికంగా స్వచ్ఛంగా ఉంటే చాలన్నది ఈ దృక్పథం సారాంశం. సైద్ధాంతిక పోరాటంలో ఈ అంశానికి సంబంధించి 1922లో లెనిన్ చెప్పిన అంశాలతో దీనిని మనం బాగా అర్థం చేసుకోవచ్చు. "ఆధునిక సమాజం చేత అజ్ఞానం, చీకటి, మూఢత్వంలోకి నెట్టబడిన లక్షలాది మంది ప్రజలను(ముఖ్యంగా రైతులు, చేతివృత్తుల వారు) కేవలం మార్క్సిస్టు ప్రచారం ద్వారా మాత్రమే దాని నుండి తప్పించాలనుకోవటం అతిపెద్ద, తీవ్రమైన ప్రమాదం అవుతుంది. వారికి విస్తారంగా నాస్తిక ప్రచార సాహిత్యాన్ని సరఫరా చేయాలి. జీవితంలో భిన్నమైన పార్శ్వాలకు సంబంధించిన వాస్తవాలను వారు తెలుసుకొనేలా చేయాలి. సాధ్యమైన అన్ని మార్గాల ద్వారా వారిని చేరుకోవాలి. వారిలో ఉన్న మతపరమైన దృక్పథం నుండి వారిని మళ్ళించాలి. వివిధ రకాలైన మార్గాలు, పద్ధతుల ద్వారా వారిని కదిలించాలి". ఎంగెల్స్ చెప్పిన "శ్రామికవర్గపు సమకాలీన నాయకులు 18వ శతాబ్దానికి చెందిన తీవ్రవాద నాస్తిక సాహిత్యాన్ని విస్తారంగా ప్రజల మధ్య ఏ విధంగా పంపకం చేస్తున్నారన్న" అంశాన్ని తమ కామేడ్స్ ఏ విధంగా అమలుచేస్తున్నారని లెనిన్ చర్చించే సందర్భంలో ఈ అంశాలను పేర్కొన్నాడు. ఈ సలహాను అమలు చేయనందుకు లెనిన్ తన సమకాలికులను విమర్శించాడు. "మన ఉదాశీనత, అశక్తత, అసమర్ధతలను కొన్ని సమయాలలో గొప్ప మాటలు చెబుతూ సమర్ధించుకుంటుంటాం. ఉదాహరణకు 18వ శతాబ్దానికి చెందిన పాత నాస్తిక సాహిత్యం కాలం చెల్లినదని, అశాస్త్రీయమైనదని, ఉపయోగపడనిదని చెబుతుంటారు. ఇటువంటి నకిలీ శాస్త్రీయతకు మించిన కుతర్కం లేదు. ఇది సిద్ధాంతాన్ని గురించి పొసగని మాటలకు ముసుగుగా ఉపయోగించుకోవటానికి, మార్క్సిజాన్ని అపార్థం చేసుకోవటానికి దారితీస్తుంది. 18వ శతాబ్దానికి చెందిన విప్లవకారులు రచించిన నాస్తికవాద సాహిత్యంలో అశాస్త్రీయమైన అంశాలు చాలా ఉండవచ్చు. కాని వాటిని సంక్షిప్తం చేసి, 18వ శతాబ్దం తర్వాత మతాన్ని శాస్త్రీయంగా విమర్శించటంలో మానవజాతి సాధించిన అభివృద్ధిని, ఆధునికంగా సాధించిన అభివృద్ధిని జోడించి ప్రచురించటంలో ప్రచురణదారులను ఎవరూ నివారించలేరు".

ఈ మొత్తంలో ఉన్న సమస్యలను అర్థం చేసుకోవటానికి మనం ప్రయత్నం చేద్దాం. మతపరమైన భ్రమల నుంచి మార్క్సిజం మాత్రమే కార్మికవర్గాన్ని విముక్తి చేయగలిగినప్పటికీ, ఇందులో 18వ శతాబ్దంలోని నాస్తిక వారసత్వం అవసరం లేదని భావించటం పొరపాటవుతుంది. అంటే దానర్థం ఈ నాస్తిక సాహిత్యాన్నంతా ఎటువంటి విమర్శనాత్మక దృక్పథం లేకుండా ఆమోదించాలని కాదు. మనం దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఉండటం లేదా ఉన్నదానిని ఉన్నట్లుగా తీసుకొని ప్రచారం చేయటం కాని సరికాదు. మరి దానిపట్ల సరిగా వ్యవహరించటం ఎలా? దానిని ఈ దిగువ ఉదహరించిన సూచనలలో సంక్షిప్తంగా పేర్కొంటున్నాను. మొదటి అంశం. 18వ శతాబ్దానికి చెందిన విప్లవకారుల రచనలలో మృతప్రాయమైన అంశాలు కొన్ని ఉన్నాయి. రెండవది. అయినప్పటికీ వాటిలో కొంత సజీవమైన, ఇప్పటికీ మనకు ఉపయోగపడే అంశాలు కొన్ని ఉన్నాయి. మూడవది. ప్రస్తుతం జరుగుతున్న సైద్ధాంతిక పోరాటంలో మొదటి దానిని పూర్తిగా ధ్వంసం చేసి, రెండవ దానిని అభివృద్ధి చేయటం మనకు అవసరం. మన నాస్తికవాద వారసత్వంతో మన విబేధాలను పరిష్కారం చేసుకోవాల్సిన ప్రధానాంశాలు ఇవి. అదిలేకుండా ప్రజలను మతపరమైన భ్రమల నుండి విముక్తి చేయటానికి జరుగుతున్న ప్రస్తుత పోరాటం అసమగ్రంగా ఉంటుంది. పైన చెప్పుకున్న లెనిన్ చేసిన సూచనల ఆధారంగా భారతదేశంలో జరుగుతున్న సైద్ధాంతిక పోరాటం గురించి మనం చర్చించాలి. భారతదేశంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులలో మన ప్రస్తుత తత్వశాస్త్ర అవసరాలకు అనుగుణంగా తత్వశాస్త్ర గతంతో సంబంధాలను సరిచేసుకోవటంలో ఈ దిగువ అంశాలు ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి.

మొదటిది. 18వ శతాబ్దపు నాస్తిక వారసత్వంలో అశాస్త్రీయమైనది, నిరర్ధకమైనదంతా మృతప్రాయమైనది. కానిఅది గతంలోనిది, నష్టకరమైది అనే భావం ప్రజల దృక్పథంలో మాత్రం లేదు. అందుకు విరుద్ధంగా భారతీయ తత్వశాస్త్ర రంగంలో వాస్తవంగా మృతప్రాయమైనదంతా ప్రజలలో ప్రచారం అవుతూ, వారి చైతన్యంపై బలమైన పట్టుకలిగి ఉన్నది. వారిపైన అది ఇప్పటికీ తీవ్రమైన ప్రభావం కలిగిస్తున్నది. కాబట్టి సమస్య దానిని సరిచేయటం, పున:సమీక్ష చేయటం కాదు. దానిని నాశనం చేయటం, పూర్తిగా నిర్మూలించటం, ప్రజలను నిరర్ధకులను చేసే దాని ప్రభావం నుండి వారిని చైతన్యవంతులను చేయటం ప్రస్తుతం చేయాలి.

ఇందుకు శక్తివంతమైన మార్గం ప్రజల మధ్య మార్క్సిజాన్ని ప్రచారం చేయటమే. కాని ఇందుకోసం మార్క్సిస్టు మౌలికసూత్రాలను మాత్రమే ప్రచారం చేయటం సరిపోదు. పాతభావాలకు కట్టుబడి ఉండటం, హేతువిరుద్ధత, మతపరమైన భావజాలంపై శాస్త్రీయ భావాలను రుద్దటానికి ఇది



epaper.prajasakti.com

దారితీస్తుంది. దేశంలో పనిచేస్తున్న అనేకమంది శాస్త్రవేత్తలపైన ఇది ఎటువంటి ప్రభావం చూపుతున్నదో ఇంతకు ముందే మనం చర్చించాం. వారు శాస్త్రీయ అంశాలను అభివృద్ధి చేయటానికి బద్ధులై ఉంటారు. అదే సమయంలో అభివృద్ధి నిరోధక భావాలను అనుసరించటం  కూడా కొనసాగుతున్నది. ఇంతకు ముందున్న భావాలను అలాగే ఉంచి, వాటిపై మన భావాలను, దృక్పధాలను ప్రచారం చేయటమే భారతదేశంలో సైద్ధాంతిక పోరాటం చేయటంలో ఉన్న సమస్య. గతం నుండి కొనసాగుతున్న ఈ భావజాలం చైతన్యపూరితంగా లేదా అప్రయత్నంగా అయినా మార్క్సిస్టు విద్యను విస్తరింపచేయటాన్ని విఫలం చేస్తుంది. కాబట్టి మన తత్వశాస్త్ర గతంతో మనకున్న విబేధాలను పరిష్కరించుకోవాలి.

**“ మార్క్సిజంతో చైతన్యం పొందిన ఈనాటి భారత కార్మికవర్గ ఉద్యమం మాత్రమే భారతదేశ తత్వశాస్త్ర వారసత్వంలో ఉపయోగకరమైన అంశాలను వారసత్వంగా స్వీకరించి, వాటిని మరింత అభివృద్ధి చేసి ముందుకు తీసుకుపోగల ధైర్యం కలిగివుంది. ఈ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోవటంలో సమాజంలోని ఇతర తరగతుల ప్రజానీకానికి వివిధ రకాల ఊగిసలాటలు ఉంటాయి. ”**




**భారతీయ తత్వశాస్త్రంపై దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ అనేక పుస్తకాలు రాశారు. పై మూడు తెలుగులోకి అనువదింపబడిన పుస్తకాలలో కొన్ని**

కాని ఈ కర్తవ్యాన్ని ఏ విధంగా నెరవేర్చాలన్న సమస్య మనకెదురౌతుంది. దానిలో ఎక్కువ భాగం ఈనాటికి కూడా భారతదేశ ప్రజానీకంపై అవాంఛనీయ ప్రభావాన్ని వేస్తుంది కాబట్టి మన తత్వశాస్త్ర గతంపై మనం ప్రతికూల దృక్పధాన్ని ఏర్పరచుకోవాలా? దానిని గురించి పట్టించుకోకుండా, ఉదాసీనంగా, తిరస్కారభావంతో వ్యవహరించాలా? వివిధ కారణాల రీత్యా ఈ వైఖరి వినాశకర పరిణామాలకు దారితీస్తుంది.


మొదటిది మనం ఏ విధంగా వ్యవహరించాలని సామ్రాజ్యవాదం కోరుతుందో ఆ విధంగా వ్యవహరించటానికి ఈ వైఖరి దారితీస్తుంది. మన తత్వశాస్త్ర వారసత్వం పట్ల నిరాశావాద–నిహిలిస్టిక్– దృక్పధాన్ని ఏర్పాటు చేసుకోవటం, గర్వపడేలా ఉన్న మన జాతీయవాదం నుండి దూరం చేయటానికి, తద్వారా మనలను నిస్సహాయులుగా చేసి, వలసవాద కాలానికి తిరిగిపోయేలా చేస్తుంది. దానితోపాటు భారతదేశ తత్వశాస్త్ర వారసత్వం అంతా పనికిరానిది కాదు. సత్యాన్ని అన్వేషించటం కోసం 2,500 సంవత్సరాల పాటు చేసిన కృషిలో మన పూర్వీకులు మనకు అబద్ధాలు మాత్రమే చెప్పారని, మనల్ని మోసం చేశారని మన ప్రజలకు చెప్పటం కన్నా పెద్ద అబద్ధం ఏమీ ఉండదు. వారిలో ఒక తరగతి రుజువు చేయాలనుకున్న అంశాలు ఆ విధంగా మారి ఉండవచ్చు. కాని సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రంలోని ఈ విధమైన అంశాలను కూడా తేలికగా వదిలివేయరాదు. వారిని అటువంటి మోసపూరితమైన అంశాలను గురించి చెప్పటానికి, వారినివారు మోసం చేసుకోవటానికి దారితీసిన భౌతిక పరిస్థితులను మనం పరిశీలించాలి, అర్థం చేసుకోవాలి. వారి మనస్సాక్షికి వ్యతిరేకంగా ఇటువంటి మోసపూరితమైన అంశాలను గొప్పగా చిత్రించాలని కొందరిపై వత్తిడి తెస్తున్న సమాజంలోని స్వప్రయోజనపరుల స్వభావమేమిటనేది గుర్తించటంలో మనం దృఢ నిశ్చయంతో ఉండాలి. దీనిలో మరొక అంశం కూడా ఉంది. మన సాంప్రదాయక తత్వశాస్త్రవేత్తలలో ఒక తరగతికి చెందినవారు ఈ విధంగా మోసం చేయటం, అబద్ధాలు చెప్పటం చేయగా మరో తరగతికి చెందిన వారుఈ మోసాలు, అబద్ధాలకు వ్యతిరేకంగా తమ స్వంత పద్ధతిలో పోరాడారు. భారతదేశంలో తత్వశాస్త్ర అభివృద్ధి చెందిన పరిస్థితులను విభిన్నంగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉన్నది. భారతీయ తత్వశాస్త్రంలో నిగూఢత, అభివృద్ధి నిరోధకత, మతపరమైన భావజాలం ఇతర భావవాదపరమైన అంశాలున్నప్పటికీ వాటితో పాటుగా అత్యంత ప్రాధాన్యత కలిగిన హేతువాదం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పధంతో కూడిన భౌతికవాద దృక్పధం కూడా ఉన్నాయి. వీటికి సంబంధించిన విషయాలను మనం తెలుసుకోవటం, పూర్తిగా పునర్విశ్లేషణ చేసుకొని మొత్తం ఈ విషయాలన్నింటినీ మన ప్రజలకు చెప్పాలి. తమ పద్ధతులలో, తమకున్న సైద్ధాంతిక పరిమితులలో మన సాంప్రాదాయక తత్వవేత్తలలోని ఒక భాగం ఏ సైద్ధాంతిక ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారో అవే సైద్ధాంతిక శక్తులకు వ్యతిరేకంగా మార్క్సిస్టులుగా మనం ఈ రోజుకు కూడా పోరాడుతున్నామన్న చారిత్రక వివరాలను మన ప్రజలకు తెలియజెప్పాలి. ఈ రోజు మనం చేస్తున్న సైద్ధాంతిక పోరాటంలో ఈ కర్తవ్యం చాలా ముఖ్యమైనది. ఈ విధంగా పరిగణించటానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది మనం భారతీయ పరిభాషలో మాట్లాడటానికి అది అవకాశం కల్పిస్తుంది. దానిని ప్రజలు చాలా సులభంగా అర్థం చేసుకుంటారు. మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగానే కొన్ని మౌలిక భారతీయ తత్వశాస్త్ర భావాలు నిర్దిష్టమైన పరిభాషలో ఇంతకు ముందే ప్రజలకు పరిచయమై ఉన్నాయి. కాబట్టి ఈ సైద్ధాంతిక సమస్యలను అదే పరిభాషలో పరిచయం చేస్తే వాటిని వారు సులభంగా అర్థం చేసుకుంటారు. రెండవది సత్యాన్ని అర్థం చేసుకోవటం కోసం ప్రయత్నం చేసిన మన గతకాలపు తత్వవేత్తలలోని ఒకభాగం ఆనాడు వారికున్న పరిమితుల రీత్యా పూర్తిచేయలేకపోయిన కర్తవ్యాలను ఈనాడు



epaper.prajasakti.com

ఇంటర్వ్యూ

# పోరాటమే జీవన సూత్రం



## కార్ల్ మార్క్స్‌తో అమెరికన్ పాత్రికేయుని ఇంటర్వ్యూ

1880 సెప్టెంబరు 6న 'న్యూయార్క్ సన్' పత్రికలో మార్క్స్ ఇంటర్వ్యూ ప్రచురించారు. జాన్ స్వింటన్ అనే ఒక అమెరికన్ పాత్రికేయుడు తన యూరప్ పర్యటనలో కార్ల్ మార్క్స్‌ను కలిసి ఆయన ఇంటర్వ్యూ తీసుకున్నాడు. మార్క్స్ మరణించడానికి మూడేళ్లకు ముందు జరిపిన ఈ ఇంటర్వ్యూలో మార్క్స్ గురించి, ఆయన కుటుంబం గురించి కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించాడు. ఆ శ్రామికవర్గపు మహానేత మేధస్సు ఈ అమెరికన్ పాత్రికేయుడిని ఎంతగానో ప్రభావితంచేసింది. ఎంతో ఉత్సాహంతో మార్క్స్‌ను, ఆయన ఆలోచనల వైశిష్ట్యాన్ని ఈ ఇంటర్వ్యూ లో స్వింటన్ వివరించాడు.

"వర్తమాన ప్రపంచంలో పేరెన్నికగల వ్యక్తులలో ఒకరు, గత నాలుగు దశాబ్దాల విప్లవ రాజకీయాలలో అత్యంత లోతైన, ప్రభావితం చేయగలిగిన పాత్రను పోషించినవాడు కార్ల్ మార్క్స్. తనగురించి అందరూ తెలుసుకోవాలనే తాపత్రయంగాని, కీర్తిదాహంగాని, గొప్పలు చెప్పుకోవడంగాని, అధికారం కావాలనిగాని ఈ మనిషికి లేదు. తొందరపాటు లేదు. అలాగని నిదానంగా కూడా లేడు. బలమైన, విశాలమైన, ఉన్నతమైన ఆలోచనలు అతనివి. ఎంతో ఉన్నతస్థాయిలక్ష్యాలను చేరుకొనే పథకాలతో, ఎంతో తార్కికంగా ఉండే విధానాలతో, ఆచరణాత్మకమైన రీతిలో వ్యవహరిస్తాడతడు. దేశాలనెన్నింటినో కకావికలం చేసి, సింహాసనాలనెన్నింటినో కూల్చివేసిన 'భూకంపాల' వెనుక ఇతని పాత్ర చాలాఉంది.

బెర్లిన్ నగర విద్యార్థి, హెగెల్ సిద్ధాంతాల విమర్శకుడు, పత్రికాసంపాదకుడు, గతకాలంలో న్యూయార్క్ ట్రిబ్యూన్ పత్రికకు విలేకరిగా పనిచేసిన వ్యక్తి, పాలకవర్గాల నెంతగానో ఒకప్పుడు భయపెట్టగలిగిన 'ఇంటర్నేషనల్' వ్యవస్థాపకుడు, సూత్రధారి, 'పెట్టుబడి' గ్రంథ రచయిత అయిన ఈ వ్యక్తి యూరప్ ఖండంలోని సగంపైగా దేశాల బహిష్కారానికి గురైనవాడు. దాదాపు అన్ని యూరప్ దేశాలలోనూ ప్రవేశానికి అనుమతి నిరాకరించబడినవాడు. గత ముప్పై ఏళ్లుగా లండన్ నగరంలో ఆశ్రయం పొందుతున్నవాడు– ఆయనే కారల్ మార్క్స్.

లండన్‌లో రామ్స్‌గేట్ బీచ్ వద్ద రెండు తరాలకు చెందిన తన కుటుంబ సభ్యులతోసహా నివసిస్తున్న చిన్న ఇంటివద్ద, అతడిని నేను కలుసుకున్నాను. ప్రశాంత వదనంతో, తీయని గొంతుకతో చాలా హుందాగా నాకు గుమ్మం వద్దనే స్వాగతం పలికిన ఆ మహిళ, ఆ ఇంటి పెద్ద –ఇంకెవరు? జెన్నీ– కారల్ మార్క్స్ భార్య. ఆ వెనకనే, పెద్ద శిరస్సు, ఉదారస్వభావం, మర్యాదపూర్వక స్పందనలతో నెరుస్తున్న జుట్టుతో అరవైఏళ్ళ పెద్దమనిషి కారల్ మార్క్స్.

చాలా సరళంగా, స్వేచ్ఛగా, సృజనాత్మకంగా, తీక్షణంగా, నిజాయితీగా, అదే సమయంలో, కాస్త వెటకారమూ, హాస్యమూ, క్రీడాస్ఫూర్తి మేళవించి సాగిన అతని సంభాషణ నాకు సోక్రటీస్‌ను గుర్తుకు తెచ్చింది. యూరప్ లోని పలు దేశాల్లోని రాజకీయ శక్తులగురించి, ప్రజా ఉద్యమాలగురించి అయన మాట్లాడాడు. రష్యన్ల స్ఫూర్తి గురించి, జర్మన్ ప్రజల మానసిక సంవేదనలగురించి, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కార్యకలాపాలగురించి మాట్లాడాడు. రష్యా గురించిన ప్రస్తావనలో ఆశాభావం, జర్మనీ గురించిన ప్రస్తావనలో తాత్వికత, ఫ్రాన్స్ గురించిన చర్చలో హుషారు కనపడింది. అదే ఇంగ్లండ్ గురించి లేవనెత్తినపుడు బ్రిటిష్ పార్లమెంటులో లిబరల్స్ చాలా స్వల్పమైన ప్రభావం కలిగించే సంస్కరణలగురించి అనవసరంగా ఎక్కువ చర్చ చేస్తున్నారంటూ తన వ్యతిరేకతను వ్యక్తం చేశాడు.

యూరప్ ఖండంలో ఒక దేశం తర్వాత ఇంకొక దేశం గురించి వివరంగా మాట్లాడుతూ ఆయా దేశాల ప్రత్యేకతలు, పరిణామాలు పేర్కొంటూ, తెరపైన, తెరవెనుక ఉన్న వ్యక్తుల గురించి తెలుపుతూ, పరిణామాలన్నీ నడుస్తున్న దిశ బట్టి లక్ష్యం సాధించేవైపుగా అడుగులు పడుతున్నాయన్న విశ్వాసాన్ని అయన వ్యక్తం చేశాడు. ఆయన మాట్లాడుతున్నప్పుడు పలుమార్లు నేను ఆశ్చర్యానికి లోనయ్యాను. నెవా నుండి సియెనె



epaper.prajasakti.com

**❝ భావాల మధ్య జరిగిన ఘర్షణల ద్వారా భారతీయ తత్వశాస్త్రం అభివృద్ధి చెందింది. భారతీయ తత్వశాస్త్ర పరిభాషలో చెప్పుకోవాలంటే వివిధ పక్షాల మధ్య జరిగిన వాదోపవాదాల ద్వారా, అనుకూల, వ్యతిరేక పక్షాల మధ్య జరిగిన సజీవ చర్చల ద్వారా తత్వశాస్త్రం అభివృద్ధి చెందింది. కాబట్టి భారతీయ తత్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవటానికి మనం అడగవలసిన మొదటి ప్రశ్న దానిలోని మౌలిక వైరుధ్యాలకు సంబంధించినది. ❞**

మనం పూర్తి చేయటానికి పూనుకున్నామని ప్రజలలోకి తీసుకెళ్ళాలి. అలా తీసుకెళ్ళగలిగిన మేరకు మనం కట్టుబడిన సిద్ధాంతం మన సంస్కృతికి చెందినది కాదని, మన గత జాతీయ జీవనంతో మార్క్సిస్టులకు ఎటువంటి సంబంధం లేదని, కాబట్టి మనకు వ్యతిరేకంగా పోరాటం చేయటం వారి పవిత్ర కర్తవ్యమని అభివృద్ధి నిరోధక తాత్విక భావనలను పునరుద్ధరించాలని భావించే వారు మనపై ప్రచారం చేస్తున్న కట్టుకథలను తుత్తునియలు చేయగలుగుతాం.

మనం ప్రజలలో ప్రచారం చేసే అన్ని మార్గాలను ఇక్కడ పేర్కొనాల్సిన అవసరం లేదు. ముఖ్యమైన అంశం ఏమిటంటే ఈ ప్రచారానికి భిన్నంగా వాస్తవం ఉన్నదని పూర్తి విశ్వాసంతో ప్రజలకు చెప్పటానికి ఇది తగిన సమయం. మార్క్సిజంతో చైతన్యం పొందిన ఈనాటి భారత కార్మికవర్గ ఉద్యమం మాత్రమే భారతదేశ తత్వశాస్త్ర వారసత్వంలో ఉపయోగకరమైన అంశాలను వారసత్వంగా స్వీకరించి, వాటిని మరింత అభివృద్ధి చేసి ముందుకుతీసుకుపోగల ధైర్యం కలిగివుంది. ఈ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోవటంలో సమాజంలోని ఇతర తరగతుల ప్రజానీకానికి వివిధ రకాల ఊగిసలాటలు ఉంటాయి. ఈరోజు వారసత్వంగా స్వీకరించటానికి భారతీయ తత్వశాస్త్రంలో వాస్తవంగా సజీవంగా ఉన్నదేమిటి అన్న అంశం కేవలం ఆసక్తి గొలిపే అంశం మాత్రమే కాక అత్యంత ప్రాధాన్యత కలిగివున్నది. సమాజాన్ని విప్లవకరంగా మార్చటానికి మిగతా ఏ తరగతుల కన్నా అత్యంత ధైర్యసాహసాలు కలిగిన కార్మికవర్గ కార్యాచరణకు మార్గదర్శి అవుతుంది. చివరి అంశానికి చెందిన కొన్ని వివరణలతో మనం ఈ చర్చను ముగిద్దాం.

భావాల మధ్య జరిగిన ఘర్షణల ద్వారా భారతీయ తత్వశాస్త్రం అభివృద్ధి చెందింది. భారతీయ తత్వశాస్త్ర పరిభాషలో చెప్పుకోవాలంటే వివిధ పక్షాల మధ్య జరిగిన వాదోపవాదాల ద్వారా, అనుకూల, వ్యతిరేక పక్షాల మధ్య జరిగిన సజీవ చర్చల ద్వారా తత్వశాస్త్రం అభివృద్ధి చెందింది. కాబట్టి భారతీయ తత్వశాస్త్రాన్ని అర్థం చేసుకోవటానికి మనం అడగవలసిన మొదటి ప్రశ్న దానిలోని మౌలిక వైరుధ్యాలకు సంబంధించినది. ఈ వైరుధ్యం రెండు మౌలిక దృక్పధాలకు సంబంధించినదని మనం చేసిన విశ్లేషణలో వెల్లడైంది. ఒకటి హేతువిరుద్ధత, అభివృద్ధి నిరోధకత, మతపరమైన భావజాలానికి సంబంధించినది. రెండవది హేతుబద్ధత, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పధంతో కూడిన, అనివార్యంగా భౌతికవాదం వైపుకు దారితీసే దృక్పధం. స్వార్థపరవర్గాలు, వారి ప్రచారకుల వత్తిడి వలన భారతదేశంలో చట్టాలు చేసేవారికి రాజకీయ మద్దతు, ఆర్థిక సహకారం గొప్పగా లభించింది. కాబట్టి భారతీయ తత్వశాస్త్రంలోని ఈ దృక్పధానికి అత్యధిక ప్రాధాన్యత లభించింది. రెండవ దృక్పధానికి చెందిన ప్రతినిధులు ప్రతికూల చారిత్రక పరిస్థితులైన ఆర్థికాభివృద్ధిలో వెనుకబాటు, సామాజికాభివృద్ధి స్థంభించి పోవటం, శాస్త్ర, సాంకేతికాభివృద్ధిలో వెనుకబాటు తదితరాలపై పోరాటం చేయవలసివచ్చింది. ఇటువంటి చారిత్రక పరిస్థితులలో ఈ దృక్పధానికి చెందినవారికి ఒకస్థాయికి మించి తమ విధానాలను ముందుకుతీసుకుపోవటం సాధ్యం కాలేదు. అయినప్పటికీ భారతీయ తత్వశాస్త్రంలో సజీవంగా ఉన్నదానికి ఈ దృక్పధం ప్రాతినిధ్యం వహిస్తున్నది. కాబట్టి దానిని అభివృద్ధి చేసి, మరింత ముందుకు తీసుకువెళ్ళాలి. దీనికి అర్థం ఈ దృక్పధం వారసత్వాన్ని స్వీకరించి, సమకాలీన విజ్ఞానం, అనుభవాలతో మరింత అభివృద్ధి చేయాలి. ఈ పని చేయగల వారెవరు? ఈ కృషిలో ఒకదశ దాటితే వారి మౌలిక వర్గ ప్రయోజనాలకు ప్రమాదం కలుగుతుంది. కాబట్టి భారతీయ నిరంకుశ భూస్వామ్యవర్గం కాని, బూర్జువావర్గం కాని ఈ కర్తవ్యాన్ని నిర్వహించలేరు. ఉదాహరణకు హేతుబద్ధతను పూర్తిగా అమలు చేయటం ప్రారంభిస్తే తమకు కనిపించే తెరచాటున సమాజంలో ఏం జరుగుతున్నదో సామాన్యప్రజలు అర్థం చేసుకోవటానికి దోహదం చేస్తుంది. ఇతర వర్గాల ప్రజలకు దీని వలన ఎదురయ్యే సమస్యలు స్పష్టమే. జాతీయోద్యమకాలంలో భారత సమాజంలో ఆధిపత్యంలో ఉన్న వర్గాలు మన తత్వశాస్త్ర వారసత్వంతో తమ వివాదాలను పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నం చేశారని ఇంతకు ముందే చూశాం. భారతీయ తత్వశాస్త్రంలోని భావవాద, అలౌకిక భావనలను పునరుద్ధరించటానికి ఈ మార్గంలో ప్రయత్నం చేశారు. దీనిని పూర్తి గా ఉపయోగించుకొంటున్న అధునిక ప్రతీఘాతుకత్వం, పునరుద్ధరణవాదం, సామ్రాజ్యవాదులను తిరిగి ఆహ్వానించటానికి పూనుకుంటున్నది. భారతీయ తత్వశాస్త్రంలో ఉన్న మంచినంతటినీ వారసత్వంగా స్వీకరించటానికి, దానిని ముందుకు తీసుకుపోవటానికి తగిన ధైర్యం కార్మికవర్గానికి మాత్రమే ఉంది. లుడ్విగ్‌ఫ్యూయర్‌బాపై తన విశ్లేషణను ముగిస్తూ ఎంగెల్స్ చెప్పిన స్ఫూర్తివంతమైన మాటలను గుర్తుచేసుకుందాం. '' సిద్ధాంతాన్ని వక్రీకరించకుండా చేయగల శక్తి జర్మన్ కార్మికవర్గానికి మాత్రమే ఉంది. ఇక్కడ దానిని విధ్వంసం చేయటం ఉండదు. వ్యక్తిగత లబ్ధికోసం ప్రాకులాట, లాభాలు సంపాదించటం కోసం వెంపర్లాట, పైవారి నుండి ప్రశంసల కోసం ఎదురుచూడటం ఇక్కడ ఉండదు. అందుకు భిన్నంగా శాస్త్రీయాభివృద్ధి కార్మికుల ప్రయోజనాలు, వారి ఆకాంక్షలతో మరింతగా ఏకీభవించటంతో దృఢంగా, పక్షపాతం లేకుండా దానిని ముందుకు తీసుకుపోవటానికి ప్రయత్నం జరుగుతుంది. సమాజ చరిత్రను అర్థం చేసుకోవటానికి శ్రమ అభివృద్ధి చరిత్రను అర్థం చేసుకోవటం కీలకం అనేది నూతన ధోరణులలో వెల్లడౌతున్నది. ఈ ధోరణి ప్రారంభం నుండి కార్మికవర్గానికే ప్రాధాన్యత ఇచ్చింది. అధికారికంగా గుర్తింపు పొందిన శాస్త్ర విజ్ఞానం నుండి ఎటువంటి స్పందనను కోరుకోలేదు. జర్మన్ సాంప్రదాయక తత్వశాస్త్రానికి జర్మన్ కార్మికవర్గ ఉద్యమమే వారసురాలు".

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**



epaper.prajasakti.com

> **" అమెరికన్ పరిణామాలను మార్క్స్ చాలా సన్నిహితంగా పరిశీలిస్తున్నాడని నాకనిపించింది. అమెరికన్ సమాజంలో అప్పడప్పడే రూపు దిద్దుకుంటున్న కొత్త పరిణామాలగురించి, అమెరికన్ సమాజ జీవితం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు పలు కొత్త కోణాలను సృజించాయి. "**




లండన్‌లో 1851 నుండి 56 వరకు ఈ ఇంటిలో మార్క్స్ నివసించినట్లు గ్రేట్ లండన్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఫలకం

దాకా, యూరల్స్ నుండి పైరెనీస్ దాకా ప్రపంచంలో ఏమూల ఏ పరిణామం జరిగినా వాటన్నింటినీ గమనంలో ఉంచుకుంటూ, అదే సమయంలో ఉద్యమం ముందడుగువేసే దిశగా పావులు కదుపుతూ పని చేస్తున్న ఈ వ్యక్తిగురించి ప్రపంచానికి మాత్రం తెలిసింది చాలా తక్కువేనని చెప్పాలి. ఐతే అతని కృషి ఏమాత్రమూ వృధా కాలేదని, ఎన్నో పరిణామాలను ప్రభావితం చేసిందని, ముఖ్యంగా ఫ్రాన్స్‌లో ఆ ప్రభావం చాలా కనపడుతోందని చెప్పాలి.

అతనలా మాట్లాడుతూవుంటే "మీరిప్పుడేమీ చేయడంలేదెందుకని?" అని నేనడిగాను. బొత్తిగా చదువూ సంధ్యా లేనివాడు వేసిన ప్రశ్నలా అది అతనికి తోచిందేమో మరి, సూటిగా జవాబివ్వలేదు. ఎన్నో ఉద్యమ క్షేత్రాలకు విత్తనాలను అందించిన అతని గొప్ప గ్రంథం పెట్టుబడి జర్మన్ భాషనుండి రష్యన్, ఫ్రెంచి భాషలలోకి అనువదించబడిందికాని, ఇంకా ఇంగ్లీషు లోకి ఎందుకు అనువాదం కాలేదని అడిగాను. అనువదిస్తామంటూ న్యూయార్క్ నుండి ఒక ప్రతిపాదన వచ్చిందని ఆయన తెలిపాడు. ఇప్పటివరకు వెలువడింది మొదటి భాగం మాత్రమేనని, మరో రెండు భాగాలు కూడా ఉన్నాయని ఆయన నాకు తెలిపాడు. భూమి, పెట్టుబడి, ఋణం– ఈ మూడు అంశాలగురించి అందులో చర్చించానని అంటూ, ముఖ్యంగా అమెరికాలో ఋణం విస్తరించిన తీరు ఆశ్చర్యకరంగా ఉందని అన్నాడు.

అమెరికన్ పరిణామాలను మార్క్స్ చాలా సన్నిహితంగా పరిశీలిస్తున్నాడని నాకనిపించింది. అమెరికన్ సమాజంలో అప్పడప్పడే రూపు దిద్దుకుంటున్న కొత్త పరిణామాలగురించి, అమెరికన్ సమాజ జీవితం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు పలు కొత్త కోణాలను సృజించాయి. తిరిగి పెట్టుబడి గ్రంథం వైపు చర్చ మళ్ళింది. జర్మన్ మూలగ్రంథంకన్నా దాని ఫ్రెంచి అనువాదం చదవడానికి బాగుంటుందని ఆయన అన్నాడు. హెన్రీ రాష్‌ఫోర్ట్, బకునిన్, లాసల్లె వంటి గతించిన ఆయన అనుయాయుల ప్రస్తావన వచ్చింది. చాలామంది గొప్ప మేధావుల్ని మార్క్స్ ప్రభావితం చేయగలిగాడనిపించింది నాకు.

మధ్యాహ్నం గడిచి ఆ వేసవిలో సాయం సమయం వచ్చేసరికి మార్క్స్ సముద్ర తీరంవైపు పోయివద్దామని ప్రతిపాదించాడు. అలా బీచ్‌లోకి పోయేసరికి అక్కడ వేలాదిమంది జనాలు– ముఖ్యంగా చిన్నపిల్లలు ఆడుకుంటూ కనిపించారు. వారి మధ్య ఆ ఇసకలో అతని కుటుంబం అంతా కూచునివున్నారు. ఇంతకు ముందే నన్ను స్వాగతించిన అతని భార్య, ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు అల్లుళ్ళు, వాళ్ళ పిల్లలు అంతా ఉన్నారు. అతని అల్లుళ్ళలో ఒకరు లండన్ కింగ్స్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు, రెండవ అల్లుడు రచయిత అనుకుంటాను.

మొత్తం అంతా కలిపి పదిమంది ఉన్న ఆ కుటుంబంలో అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. కొత్తగా వచ్చిన ఈ అమెరికన్ అతిథితో వారంతా ఆ రాత్రి కాలక్షేపం చేశారు. ప్రపంచం గురించి, మానవుడిగురించి, కాలం గురించి, భావాల, ఆదర్శాల గురించి ఆ సముద్రతీరంలో చాలాసేపటిదాకా కబుర్లు చెప్పుకున్నాం. ఎంతో ఉత్సాహంతో తన జీవితానుభవాన్ని రంగరించి కాలం గురించి, మార్పులగురించి చర్చించిన ఆ వ్యక్తితో రోజంతా గడిపాక ఆ సాయంత్రం నాకొక ప్రశ్న ఉదయించింది. దానికి సమాధానాన్ని ఆ మహా తాత్వికుడినుండే పొందాలనుకున్నాను. "అస్థిత్వానికి సంబంధించి తుది నియమం ఏమిటి?" అని ఆ విప్లవకారుణ్ణి, ఆ తత్వవేత్తని అడిగాను. కొంచెంసేపు మౌనంగా ఉండిపోయి, అలా ఎదురుగా ఉన్న సాగరాన్ని చూస్తూ, అటూ ఇటూ ఉన్న జనసందోహాన్ని పరికించిన మార్క్స్ ఆ తర్వాత ఏమిటో చెప్పండని నేను మళ్ళీ రెట్టించాక చాలా లోతైన, గంభీరమైన స్వరంతో ఒకే ఒక్కమాట అన్నాడు–"పోరాటం"

నాకాయన సమాధానంలో ఒక్క క్షణంసేపు నిరాశ ధ్వనించినా ఆ వెంటనే బోధపడింది. అదే జీవిత సూత్రం అని." ❋





epaper.prajasakti.com


కారల్ మార్క్స్ ద్వి శతజయంతి ప్రత్యేకం

# కమ్యూనిస్ట్ లీగ్ ఏర్పాటు

ఎం శివరామకృష్ణన్

**1846** నాటికి పారిస్, లండన్ ప్రాంతాల్లో లీగ్ ఆఫ్ ది జస్ట్ శాఖలు ఏర్పడి పని చేస్తున్నాయి. లీగ్ ఆఫ్ ది జస్ట్ శాఖల్లో పనిచేస్తున్ననాయకత్వం ఆలోచనల్లో కూడా మార్పు ప్రారంభమైంది. ఊహాజనిత సోషలిస్ట్ ఆలోచనల నుండి బయటకు వచ్చి కార్మికవర్గ భావజాలంతో పనిచేయాలని లీగ్ ఆఫ్ ది జస్ట్ నిర్ణయం తీసుకుంది. లీగ్ ఆఫ్ ది జస్ట్ నాయకులు మార్క్స్- ఎంగెల్స్ చూపిన మార్గమే సరైనదని గుర్తించారు. వారి మార్గదర్శకత్వంలో పనిచేయాలని భావించారు. మార్క్స్- ఎంగెల్స్‌లు ఏర్పాటు చేసిన సంస్థలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకున్నారు. లీగ్ ఆఫ్ ది జస్ట్ మహాసభ 1847 మే ప్రారంభంలో నిర్వహించాలను కున్నారు. మహాసభలో ఏ అంశాలు ఎజెండాగా పెట్టి చర్చించాలో నిర్ణయానికి రాలేకపోయారు. మహాసభ ఎజెండా కోసం లీగ్ ఆఫ్ ది జస్ట్ నాయకులు మార్క్స్ - ఎంగెల్స్‌ను సంప్రదిం చాలని అనుకున్నారు. లీగ్ ఆఫ్ ది జస్ట్ లో ప్రధానంగా చేతివృత్తులు చేసే వారు సభ్యులుగా ఉన్నారు. హెన్రిచ్ బాయర్, వాచ్ మేకర్ జోసెఫ్ మోల్, అనేక పోరాటాల్లో చురుకుగా పాల్గొన్న కార్ల్ షాప్పర్ ముఖ్య నాయకులుగా ఉన్నారు. లండన్ కేంద్రం నుండి ప్రింటింగ్ అవుతున్న పీపుల్స్ ఛాంబర్ పత్రికలో ఫారెస్టర్, బ్రూవర్స్ చాలాకాలం నుండి డిటిపి ఆపరేటర్స్ గా పని చేస్తున్నారు. బ్రసెల్స్‌లో ఉన్న మార్క్స్‌ను, పారిస్‌లో ఉన్న ఎంగెల్స్ ను కలిసి వారిద్దరినీ లీగ్ ఆఫ్ ది జస్ట్‌లో చేరేలా అభ్యర్థించడానికి జోసఫ్ మోల్‌ను సంస్థ నియమించింది. జోసఫ్ మోల్ మార్క్స్ - ఎంగెల్స్ ను కలిసి లీగ్ ఆఫ్ ది జస్ట్ నాయకత్వం కోరికను తెలియజేసాడు. సంస్థలో చేరి మార్గనిర్ధేశం చేయమని మార్క్స్ - ఎంగెల్స్‌ను కోరాడు. లీగ్ ఆఫ్ జస్ట్‌లో చేరమని గతంలో నాయకత్వం కోరినా మార్క్స్ - ఎంగెల్స్‌లు నిరాకరించారు. ఈ సంస్థ ఊహాజనిత సోషలిస్ట్ కార్యక్రమంతో పనిచేస్తున్నందున, సంస్థాగత నిర్మాణం కూడా కుట్ర సూత్రాలపై ఆధారపడి ఉన్నందున సంస్థలో చేరడానికి మార్క్స్ - ఎంగెల్స్ లు విముఖత చూపారు.

జోసఫ్ మోల్ చెప్పిన అంశాలను మార్క్స్ ఓపికగా విన్నాడు. లీగ్ ఆఫ్ ది జస్ట్ ఊహాజనిత సోషలిస్ట్ ఆలోచనలను, కుట్ర



కమ్యూనిస్టు లీగ్ నిబంధనలు రూపొందిస్తున్న మార్క్స్, ఏంగెల్స్: ఊహా చిత్రం

పూరిత సాంప్రదాయాలను వదిలించుకోవాలని మార్క్స్ - ఎంగెల్స్ చెప్పిన ప్రాథమిక అభిప్రాయాలు సరైనవని వాటిని సంస్థ గుర్తించిందని మోల్, కారల్‌మార్క్స్‌కి సమాచారం ఇచ్చాడు. జోసఫ్ మోల్ చెప్పిన అంశాలతో మార్క్స్ సంతృప్తి చెంది ఒప్పుకున్నాడు. మార్క్స్, జోసఫ్ మోల్‌ను పారిస్‌కు వెళ్లి ఎంగెల్స్ తో కూడా చర్చించమని కోరాడు. జోసఫ్ మోల్ పారిస్‌కి వెళ్ళి ఏంగెల్స్‌ని కలిసాడు. జోసఫ్ మోల్ ఇచ్చిన హామీతో ఎంగెల్స్ కూడా సంతృప్తి చెందాడు.

మార్క్స్ - ఎంగెల్స్ లీగ్ ఆఫ్ ది జస్ట్‌లో చేరడానికి అంగీకరించారు. లీగ్ మహాసభను వాయిదా వేయాలని చేసిన సూచనను సంస్థ అంగీకరించి జూన్‌కు వాయిదా వేసింది. మార్క్స్ - ఎంగెల్స్ లీగ్ ఆఫ్ ది జస్ట్ లో చేరడానికి ఆహ్వానం అందుకున్నందుకు సంతోషించారు. అభివృద్ధి చెందుతున్న కార్మికవర్గ పార్టీ ప్రధాన కేంద్రంగా అంతర్జాతీయ కార్మిక సంస్థను మార్చడానికి మంచి అవకాశంగా భావించారు. అందుకనుగుణంగా కొత్త సిద్ధాంత సూత్రాల ప్రకారం లీగ్ ఆఫ్ ది జస్ట్‌ని ప్రాథమికంగా పునర్నిర్మించాలని నిర్ణయించు కున్నారు.

లీగ్ మహాసభ తేదీలు ఖరారు అయిన వెంటనే మార్క్స్ జర్మనీ, ఇతర దేశాల్లో ఉన్న తన సహచరులకు మహాసభ గురించి సమాచారం ఇచ్చాడు. సహచరులను లీగ్ ఆఫ్ ది జస్ట్‌లో చేరమని ఆహ్వానించాడు. లీగ్‌ని సంస్కరించి, పునర్మించాలని కోరాడు. లీగ్ సంస్థాగత నిర్మాణం, మహాసభ కోసం సన్నాహాలు, ప్రతినిధులను పంపడం తదితర అంశాలపై మార్క్స్ - ఎంగెల్స్‌తో చర్చించాడు. డబ్బుల కొరత కారణంగా మార్క్స్ లండన్‌కు వెళ్ళలేక పోయాడు. లీగ్ మహాసభకు హాజరై దిశా నిర్ధేశం చేయాలని బ్రస్సెల్స్ ప్రతినిధి విల్హెల్మ్ వోల్ఫ్, ఎంగెల్స్‌లను మార్క్స్ కోరాడు తేదీలు ప్రకటించిన విధంగానే లీగ్ మహాసభ 1847 జూన్ 2న ప్రారంభమై జూన్ 9న ముగిసింది. మహాసభ నిర్వాహకుల అభ్యర్ధన మేరకు లీగ్ కార్యక్రమం ప్రాతిపదికగా ఎంగెల్స్ 'డ్రాఫ్ట్ ఆఫ్ ఎ కమ్యూనిస్ట్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్' పేరిట పత్రాన్ని తయారు చేసే బాధ్యతను స్వీకరించాడు. ఈ సిద్ధాంత పత్రం ప్రశ్నలు - సమాధానాలు రూపంలో ఉంది.

లీగ్ ఆఫ్ ది జస్ట్ పేరును తొలగించి కమ్యూనిస్ట్ లీగ్‌గా మార్చాలని మహాసభ నిర్ణయించింది. మార్క్స్ - ఎంగెల్స్ సూచించిన మేరకు ప్రపంచ మానవులంతా సోదరులే అనే పాత నినాదాన్ని వదిలేసి ప్రపంచ కార్మికులారా

(మిగతా 35వ పేజీలో)



epaper.prajasakti.com

# మొదటి పార్టీ మహాసభ-1943

(2వ పేజీ తరువాయి)

అధికంగా శ్రమించవలసి ఆవశ్యకతను, ప్రజలందరినీ ఐక్యపరచవలసిన అవసరాన్ని తెలియచేసింది. దాని తరువాత వివిధ ప్రాంతీయ కార్యదర్శులు వారి వారి ప్రాంతాలలో చేసిన పని, నేర్చుకున్న గుణపాఠాల రిపోర్టులను సమర్పించారు. సర్దేసాయ్ దేశంలోని ఆహార పరిస్థితిని గురించిన నివేదిక ఇచ్చారు. నంబూద్రిపాద్ మరింత ఆహారాన్ని ఉత్పత్తి చేయవలసిన అవసరానికి గురించి వివరించారు. అరుణ్, విద్యార్థుల గురించి, కున్హినందన్ బాలల సంఘం గురించి, కనక్, యశోద, అన్నపూర్ణమ్మ మహిళల గురించి రిపోర్ట్ చేశారు. ఈ కామ్రేడ్లు కేవలం వారు పనిచేస్తున్న రంగాలలోని పరిస్థితులను మాత్రమే వివరించి ఊరుకోలేదు. పార్టీ విధానాలను వారి వారి రంగాలలో అమలుచేయడం వలన వచ్చిన ఫలితాల గురించి కూడా చెప్పారు. అధికారి, మారిన పరిస్థితుల దృష్ట్యా పార్టీ రాజ్యాంగంలో కొత్త శాసనాలను ప్రవేశ పెట్టారు.

మహాసభ రాజకీయ తీర్మానం, 'జాతీయ ప్రభుత్వం జయప్రదంగా ఏర్పాటుచేసుకోడం, జాతిని రక్షించు కోవడం, జాతి ఐక్యతను నిలుపుకోవడా' లను ప్రధాన అంశాలుగా ఆమోదించింది. ఈ కర్తవ్యాన్ని అమలుచేయడానికి పార్టీ మొత్తంగా ప్రజలలో ప్రచారం చేయాలని పిలుపునిచ్చింది. దీనితోపాటు 'జాతీయ నాయకులను' విడుదల చేయాలని, 'ఆహార సరఫరా విషయంలో జోక్యం చేసుకోవాలని, ఆహార ధాన్యాలను బ్లాకులో అమ్మడానికి నిల్వలు చేయడాన్ని(బ్లాక్ మార్కెటింగ్) నిలువరించాలని, ఆహారం కోసం దొమ్మీలు జరగకుండా చూడాలని' డిమాండ్ చేసింది.

కార్మికులందరూ, రైతాంగమంతా ఫాసిజాన్ని ఓడించడానికి ఐకమత్యంగా కలిసి పనిచేయాలని, పారిశ్రామిక, ఆహారధాన్యాల ఉత్పత్తులు పెంచాలని మహాసభ పిలుపునిచ్చింది. ఆ రకంగా ఫాసిజాన్ని ఓడించడానికి కలిసి పనిచేయకపోతే తమ తమ సంఘాలను బలోపేతం చేసుకోలేరు. 'పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం పెరుగుదల, వేతనాల పెరుగుదల, బోనస్, సంఘాల గుర్తింపు, భూపంపకం, నీటిపారుదల సదుపాయాలు, విత్తనాల కొరత, కవులు, అధిక వడ్డీల నుండి విముక్తి, పొందలేవని విశ్లేషించింది. "పార్టీ విద్యార్థుల ఐక్యతకు కూడా పిలుపునిచ్చింది. వారి విద్యాహక్కుల కోసం, విద్యా సంస్థల స్వేచ్ఛ కోసం వారిని కట్టుబడి ఉండమని పిలుపునిచ్చింది.

కమ్యూనిస్టుల కార్యకలాపాల వలన, ముఖ్యంగా బెంగాల్, ఆంధ్ర, మలబార్ ప్రాంతాలలో 'మహిళా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిందని,' అది 'ప్రజా జాగృతి యొక్క స్పష్టమైన రూపం' అని అంగీకరించిన పార్టీ మహాసభ, 'మహిళలను, ముఖ్యంగా శ్రామిక మహిళలను' సంఘటిత పరచడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిర్ణయించింది. మహాసభ అన్ని యూనిట్లను 'ప్రజా సంఘాలు నిర్మించడానికి ప్రణాళికలు' సిద్ధం చేయాలని, ఆ ప్రచారం ఆధారంగా 'ప్రజా కమ్యూనిస్టు పార్టీ' నిర్మించడానికి పునాది ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చింది.

మహాసభ పార్టీని రాజకీయ ప్రజాశక్తి నుండి రాజకీయ ప్రజా నిర్మాణంగా మార్పు చేయాలని, కేవలం లక్షలాది కష్టజీవులపై ప్రభావం చూపడమేకాక భారత ప్రజలందరిపైనా ప్రభావం చూపాలని తీర్మానించింది. అంతేకాక, పార్టీ సభ్యుల సంఖ్య, పూర్తికాలం కార్యకర్తల సంఖ్య, వలంటీర్ల సంఖ్య, నిధుల సమీకరణ, కార్మిక సంఘాల సభ్యత్వం, కిసాన్ సభ, విద్యార్థి సంఘాల సభ్యత్వం, మహిళల, బాలల సంఘాల సభ్యత్వం పెంచుకోవాలనే కర్తవ్యాన్ని తీసుకుంది.

రాజకీయ పరిస్థితిని అంచనా వేయడంలో, ఎత్తుగడలను నిర్ణయించడంలో ప్రతినిధుల మధ్య పరిమితులు ఉన్నప్పటికీ అన్ని రిపోర్టులు, తీర్మానాలు ఏకగ్రీవంగానే మహాసభ ఆమోదించింది. కేంద్ర కమిటీని, ప్రధాన కార్యదర్శిని ఏకగ్రీవంగానే ఎన్నుకుంది. 'స్వీయ విమర్శనాత్మక చర్చల ద్వారా ఎంతో నేర్చుకున్నామని ప్రతినిధులు భావించారని,' మహాసభను గురించి రిపోర్ట్ చేస్తూ పి సి జోషి చెప్పారు. 'ఉమ్మడి లక్ష్యం, ఉమ్మడి కార్యాచరణ, సంవత్సరాల తరబడి ఉమ్మడిగా పనిచేయడం వలన' మహాసభలో ఐక్యత కనిపించిందని వ్యాఖ్యానించారు.

అధ్యక్ష వర్గం తరపున పార్టీ సంస్థాపక సభ్యుడు ముజఫర్ అహ్మద్ మహాసభ ముగింపు ఉపన్యాసం చేస్తూ, 'మొదటి పార్టీ మహాసభ ముగిసింది. ''పార్టీ జవ జీవాలను నింపుకోవాలనే బృహత్తర కర్తవ్యాన్ని మోస్తున్నది. దానిని మనం పూర్తి చేద్దాం." అని అన్నారు.

### ఉప్పొంగిన కార్మిక వర్గం-1946

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో పారిశ్రామిక కార్మికుల సంఖ్య అంతకు ముందు కన్నా 50 శాతనికి పైగా పెరిగింది. యుద్ధం ముగిసిన తరువాత (1945) కార్మికులు తమ పరిస్థితులు మెరుగుపడతాయని ఆశించారు. కానీ అందుకు భిన్నంగా సమస్యలు మరింత జఠిలమయ్యాయి. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కి, అత్యధిక ఇతర కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టులు కార్మికుల సమస్యలకు మద్దతునిచ్చి, వారికి అండగా నిలిచి పెద్ద పెద్ద పోరాటాలు నడిపారు.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత కార్మిక వర్గం రెండు ప్రధానమైన సమస్యలను ఎదుర్కొంది - రెండో ప్రపంచ యుద్ధకాలంలో నియమించబడిన ఉద్యోగులనుపెద్ద ఎత్తున ఉద్యోగాల నుండి తొలగించడం, జీతాలలో కోతలు విధించడం. లండన్‌లోని టైమ్స్ పత్రిక కథనం ప్రకారం, వృత్తి విద్యలలో, పరిశ్రమలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, సైన్యంలో పనిచేస్తున్న వారిలో 50 నుండి 70 లక్షల మంది కార్మికులు యుద్ధం ముగియగానే తమ విధుల నుండి తొలగించబడ్డారు. పైగా 1946 జనవరి సెప్టెంబర్ మధ్య కాలంలో ధరలు 15 శాతం పెరిగాయి. యుద్ధకాలంలో పెరిగిన ధరలకు పరిహారంగా కార్మికవర్గానికి ఇచ్చిన బోనస్ ఏ మాత్రం సరిపోలేదు. దానికి తోడు దేశంలో ఆహారధాన్యాల కొరత భారం కూడా పేదవారి పైనే పడింది. రేషన్‌లో కోతలు విధించబడ్డాయి.

దేశవ్యాప్తంగా ఉప్పొంగిన పోరాటాల ద్వారా కార్మికవర్గం ఈ దాడులకు జవాబు చెప్పింది. 1946లో ఉధృతంగా పెరిగిన సమ్మెల సంఖ్య కార్మికవర్గం ఈ దాడులను తిప్పికొడుతున్నదనడానికి నిదర్శనం. ఆ ఒక్క ఏడే 1,629 సమ్మెలు జరిగాయి. అందులో 19,64,948 మంది కార్మికులు పాల్గొన్నారు. 1945లో జరిగిన సమ్మెలకంటే ఇవి రెట్టింపు. అప్పటికంటే ఇప్పుడు రెండున్నర రెట్లు అధికంగా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కార్మికవర్గ సమరోత్సాహం జాతీయ, సామ్రాజ్యవాద వ్యతిరేక సమస్యలపై స్పందించి సమ్మెలలో పాల్గొన్న తీరులో స్పష్టంగా కనిపిస్తుంది. రైల్వేలలో సమ్మెకు బ్యాలట్ నిర్వహిస్తే 100 శాతం కార్మికులు సమ్మెకు మద్దతు తెలిపారు.



epaper.prajasakti.com

మార్క్సిస్టు అన్ని శాఖలలో ఉద్యోగులు – బ్యాంకు ఉద్యోగులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు– సమ్మెలలో పాల్గొన్నారు. ప్రభుత్వోద్యోగులతో సహా మధ్యతరగతి ఉద్యోగులు సమ్మెలలో పాల్గొనడం రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఒక గుర్తించదగ్గ పరిణామం. ప్రభుత్వోద్యోగులను సంఘటిత కార్మికోద్యమ ఆందోళనలలో, పోరాటాలలో జోడించగలమని కార్మికసంఘాలు ఎన్నడూ భావించలేదు.

ఏ ఐ టి యు సి లోని కమ్యూనిస్టు నాయకులు కార్మికవర్గంలో పెరుగుతున్న అసంతృప్తికి, ఆగ్రహానికి సంఘటిత రూపాన్నివ్వడంలో కీలకపాత్ర పోషించారు. ఉద్యోగాల నుండి తీసివేయడం, కరువు భత్యాన్ని మూల వేతనంలో కలపడం, కనీస వేతనం, ఎనిమిది గంటల పనిదినం, ఆరోగ్య బీమా, వయోవృద్ధుల పెన్షన్, నిరుద్యోగ అలవెన్స్, ఇతర అనేక సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలను కమ్యూనిస్టులు లేవనెత్తారు. బెంగాల్, బీహార్, ఒరిస్సా, పంజాబ్, బొంబాయి, మద్రాస్ యునైటెడ్ ప్రావిన్స్‌లలోని కార్మిక కేంద్రాలలో సమ్మెలు, పోరాటాలు వరుసపెట్టి జరిగాయి. పాట్నా, బెగుసరాయ్ లాంటి ప్రాంతాలలో పోలీసులు కూడా సమ్మెలు చేసి తమ ఆర్థిక డిమాండ్లను సాధించుకున్నారు. ఉధృతంగా ఉప్పొంగుతున్న కార్మికవర్గ పోరాటాలను పోలీసు చర్యలతోను, ఇతర నిరంకుశ పద్ధతులలోను అణచివేయాలని ప్రభుత్వం భావించింది. ఎందరో కార్మికులు తమ ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది గాయాల పాలయ్యారు, ఖైదు చేయబడ్డారు. కానీ ఆ వీరోచిత కార్మికవర్గ పోరాటాలే ప్రజలు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు చేయడానికి స్ఫూర్తి నిచ్చాయి.

ఆ కాలంలో జరిగిన కార్మికవర్గ పోరాటాలన్నిటిలోను పోస్ట్స్ అండ్ టెలిగ్రాఫ్స్ విభాగంలో జరిగిన పోరాటం చాలా ముఖ్యమైనది. దేశాన్నంతటిని కదిలించింది. విస్తృతంగా ప్రజల సంఘీభావాన్ని పొందింది. కార్మికవర్గ జీవనంలోని వివిధ కోణాలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకించడంలో భాగమే పోస్ట్స్ అండ్ టెలిగ్రాఫ్స్ విభాగంలో జరిగిన సమ్మె. చాలీచాలని జీతాలు, అరకొర సౌకర్యాలు ఉండే పని ప్రదేశాలు పోస్ట్స్ అండ్ టెలిగ్రాఫ్స్ ఉద్యోగులను సమ్మెకు ఉసిగొలిపాయి. వారు ప్రభుత్వానికి 16 డిమాండ్లతో కూడిన ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. అందులో జీతాలు పెంచమన్నది ఒక డిమాండ్. ఆ డిమాండ్లను పట్టించుకోకుండా ప్రభుత్వం సమ్మె చట్ట వ్యతిరేకమని ప్రకటించింది. దీనిని ఖాతరు చేయకుండా కింది తరగతి ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. అదే సమయంలో అఖిల భారత టెలిగ్రాఫ్ సంఘం కూడా సమ్మెకు పిలుపునిచ్చింది. ఆర్ ఎం ఎస్ కార్మికులు కూడా సమ్మెకు పిలుపునిచ్చారు. కింది తరగతి పోస్టల్ ఉద్యోగుల సమ్మె మొత్తం భారతదేశంలోని పోస్టల్, టెలిగ్రాఫ్ విభాగాలలోని ఉద్యోగులకు కూడా వ్యాపించింది.

బెంగాల్, బీహార్, బొంబాయి, మద్రాస్, ఢిల్లీ, రాజపుతానా, సింధ్, బలూచిస్తాన్, కేంద్రపాలిత ప్రాంతాలన్నిటిలో సమ్మె విజయవంత మయింది. సమ్మె చేస్తున్న కార్మికులు, తమ చర్యలు బ్రిటిష్ పాలకుల కార్మిక వ్యతిరేక వైఖరిపై వెలిబుచ్చుతున్న తీవ్రమైన నిరసనలో భాగమని భావించారు. కార్మికవర్గ పోరాటంలో భాగస్వాములవుతున్న ప్రజలు ఈ పోరాటాలను సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల వెల్లువలో విడదీయలేని భాగంగా భావించారు. ప్రజల క్రియాశీల మద్దతు కార్మికవర్గ ఆర్థిక డిమాండ్లను జాతియొక్క సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల స్థాయికి పెంచింది. కమ్యూనిస్టు పార్టీ, వారి నాయకులూ పోస్టల్ విభాగం చేస్తున్న సమ్మెకు మద్దత్తు నివ్వడమేకాక, ఆ సమ్మెకు ఇతర కార్మికుల సౌహార్ధతను కూడా సమకూర్చి పెట్టడంలో కీలకపాత్ర పోషించారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉన్న విద్యార్థి సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు సౌహార్ద్ర కార్యక్రమాలలో చేతులు కలిపాయి. భారతదేశ ప్రజలందరూ సమ్మెకు మద్దతుగా నిలిచినా కాంగ్రెసు మాత్రం సమ్మెకు మద్దతు తెలపలేదు. అంతేకాదు, సమ్మె ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుందని, 'జాతి ప్రయోజనాలకు' భంగం కలిగిస్తుందని' కార్మికులు సమ్మెను విరమించుకోవాలని నెహ్రూ పిలుపునిచ్చాడు.

కాంగ్రెస్ నాయకత్వం అయిష్టతతో ఉన్నప్పటికీ అమితమైన ప్రజామద్దతు పొంద టం వలన ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లకు తలఒగ్గక తప్పలేదు. 12 డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించింది. కోటి రూపాయలు పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఉద్యోగులకు ఇవ్వడానికి అంగీకరించింది. చివరికి 1946 ఆగస్టులో సమ్మె విరమించడం జరిగింది. దేశం మొత్తాన్ని కదిలించిన మరో ముఖ్యమైన కార్మికవర్గ పోరాటం రైల్వే కార్మికుల సమ్మె. 1946లో ఆగస్టు–సెప్టెంబర్‌లో దక్షిణ భారత రైల్వే కార్మికులు సమ్మెకు దిగారు. అధికారులు సమ్మె చేస్తున్న రైల్వేమెన్లపై క్రూరంగా అణచివేత మొదలు పెట్టారు దీని ఫలితంగా తొమ్మిది మంది కార్మికులు మరణించారు. పోలీసుల కాల్పుల్లో వంద మందికి పైగా గాయపడ్డారు. 400 మంది కార్మికులను అరెస్టు చేశారు. సెప్టెంబర్ 18న సమ్మె చేస్తున్న రైల్వేమెన్లకు సంఘీభావం తెలిపే రోజుగా జరపాలని యూనియన్ పిలుపునిచ్చింది. ప్రతిస్పందనగా దేశంలోని వివిధ ప్రాంతాలలో, ర్యాలీలు, ప్రదర్శనలు జరిగాయి. సమ్మెలో ఉన్న కార్మికులకు సహాయం చేయడానికి నిధులు సేకరించారు. ఈ సమ్మె సుమారు ఒక నెలరోజుల పాటు కొనసాగింది. మధ్యంతర ప్రభుత్వంలోని రైల్వే మంత్రి అసఫ్ అలీ, కార్మికుల డిమాండ్లను నెరవేరుస్తారని హామీ ఇచ్చిన తరువాత మాత్రమే సమ్మె ముగిసింది.

అదే కాలంలో ఈశాన్య రైల్వే కార్మికులు కూడా సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మెలో కూడా, కమ్యూనిస్టులు, కార్మిక సంఘాలు ముందంజలో నిలిచాయి. వివిధ పోరాటాలలో వారు పోషించిన పాత్ర కారణంగా కార్మికులు కమ్యూనిస్టుల పక్షాన నిలిచారు. నార్త్ వెస్టర్న్ ప్రాంతంలోని ముస్లింలీగ్ నేతృత్వంలోని యూనియన్‌లతో సహా అన్ని యూనియన్లు సమ్మెలో పాల్గొన్నాయి. అందువలననే దేశ విభజన జరిగినప్పుడు వాయువ్య ప్రాంతంలో జరిగిన మతఘర్షణలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో కార్మికులు ధైర్యంగా నిలిచి పోరాడారు. ఇవికాక బొంబాయి, కాన్పూర్, ఢాకా వస్త్ర పరిశ్రమలలో, నాగ్‌పూర్, బీహార్‌లోని గిరిదిహ్‌లో బొగ్గు గనులలో, మైసూర్‌లోని కోలార్ బంగారు గనులలో, కలకత్తాలోని ఓడరేవు కార్మికులలో ముఖ్యమైన కార్మికవర్గ పోరాటాలు జరిగాయి. సంస్థానాల్లో ఎన్నడూ ఎరుగని రీతిలో కార్మికవర్గ పోరాటాలు జరగడం విశేషం. ట్రావెన్‌కూర్, హైదరాబాద్, మైసూర్, ఇండోర్ మరియు ఇతర సంస్థానాలలో సమ్మెలు ప్రారంభమయాయి. ఈ రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ ఉద్యమాలకు కార్మికవర్గ పోరాటాలు అనుసంధానంగా జరిగాయి. టావెన్‌కూర్ సంస్థానంలో జరిగిన పున్నప్రా–వయలార్ పోరాటం, హైదరాబాద్ సంస్థానంలో జరిగిన తెలంగాణా రైతాంగ ఉద్యమం కార్మికవర్గ పోరాటాలలో ముఖ్యమైన పాత్ర పోషించాయి.

ఈ కాలంలో ఏర్పడ్డ కాంగ్రెస్ మరియు కాంగ్రెసేతర ప్రభుత్వాలు, కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోకపోగా వాటిని వ్యతిరేకించడం ద్వారా మరింత పెంచాయి. వారు సమ్మెలు చేయవద్దని కార్మికులకు సలహాలు ఇచ్చారు. ఇది కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల బూర్జువా నాయకత్వం యొక్క వైఖరిని ప్రతిబింబిస్తుంది.



epaper.prajasakti.com

బొంబాయిలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి, 1946,పారిశ్రామిక వివాదాల చట్టాన్ని రూపొందించింది. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య వ్యతిరేక, కార్మికవర్గ వ్యతిరేక చట్టం. సహజంగానే కార్మిక సంఘాలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. కార్మికవర్గంలో పెరుగుతున్న రాజకీయ చైతన్యం కాంగ్రెస్‌లోని బూర్జువా నాయకత్వాన్ని భయపెట్టింది. వారి వర్గ ప్రయోజనాలను కాపాడుకోడానికి వారు ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని విభజించే దిశగా పావులు కదపడం మొదలు పెట్టారు. అందులో భాగంగా మొదటిదశలో డిసెంబర్ 1946లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నాయకత్వంలో ఉన్న కమ్యూనిస్టులందరినీ తొలగించాలని ఆదేశించింది. కాంగ్రెస్ సంస్థ లోపల నుండి మొదలయిన ఈ ప్రక్రియ యొక్క పరాకాష్ట ఎఐటియుసి విభజన.

ఈ ప్రయత్నాలన్నీ జరుగుతున్నప్పటికీ, 1946లో జరిగిన ప్రాంతీయ శాసనసభలకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ సాధించిన 3,21,607 ఓట్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు 1,12,376 కార్మికుల ఓట్లను సాధించారు. కమ్యూనిస్టు పార్టీ కార్మికులు ఎంపిక చేసుకున్న పార్టీగా ఉద్భవించింది.

## కయ్యూరు అమరవీరులు

కమ్యూనిస్టులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నడిపిన ఉద్యమాలలో ఘనమైనది కయ్యూరు అమరవీరుల విప్లవం. కయ్యూరు దక్షిణ కేరళలోని హొస్‌దుర్గ్ తాలూకాలోని ఒక గ్రామం. ఇది కన్నూరు జిల్లా పక్కనే ఉంటుంది. మద్రాస్ ప్రెసిడెన్సీలోని మలబార్ ప్రాంతానికి చెందుతుంది. ప్రస్తుతం కేరళలోని కాసర్‌గోడ్ జిల్లాలో ఉంది.

1943 మార్చ్ 29వ తేదీన నలుగురు యువ కమ్యూనిస్టు దేశభక్తులు – మదత్తిల్ అప్పు, కన్ హంబు నాయర్, చిరుకందన్, అబూబకర్ – ఉరితీయబడ్డారు. అందరూ 25 ఏళ్ల లోపు వారే. కానీ వారి గ్రామంలో వారు ప్రజానాయకులయ్యారు. కిసాన్ సభను స్థాపించారు. 1938-41 మధ్య కాలంలో జమిందారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీరోచిత రైతాంగ ఉద్యమాన్ని ప్రారంభించారు. పోలీసులు ఆ యువకులను వారి దేశభక్తిని చూసి వ్యతిరేకిస్తుంటే, జమీందారులు అక్కడి రైతాంగంలో కలిగిస్తున్న చైతన్యాన్ని చూసి వ్యతిరేకించారు. ఆ ప్రాంతంలో రైతులకు కవులు హక్కులు అన్నవి లేనే లేవు. అందువలన తీవ్రంగా అణచివేయ బడుతుండేవారు. రెండవ ప్రపంచయుద్ధం రావడం, ఆ యుద్ధాన్ని కమ్యూనిస్టులు వ్యతిరేకించడంతో బ్రిటిషువారి అణచివేత మరింత పెరిగింది. ఏకంగా ఒక మలబార్ పోలీస్ ప్రత్యేక దళాన్నే అక్కడ నియమించారు. ఇళ్లను సోదాలు చెయ్యాలనే పేరుమీద దోచేసేవారు. ప్రశ్నించాలనే నెపంతో రైతులను చితక బాదేవారు. ఈ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1941 మార్చ్ 28న ఒక ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. గ్రామంలో నియమించబడిన ఒక పోలీస్ కానిస్టేబుల్ ప్రదర్శనను చూస్తూ, అందులో పాల్గొన్న ఒక ముస్లిం మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. ప్రదర్శనలో పాల్గొన్న పురుషులు అతనిపై రాళ్లతో దాడిచేసి తరిమేసారు. ప్రజాగ్రహానికి జడిసి పరిగెడుతూ అతను నదిలో పడి మరణించాడు. ఆ సంఘటనలో పాల్గొన్నారనే నెపంమీద అప్పుడు ఊళ్ళో ఉన్న ఆ నలుగురు నాయకులను ఏ రుజువులూ చూపలేకపోయినా ఉరితీశారు. ఇటువంటి సంఘటనలో దోషులను కనుక్కోవడం కష్టమేనని సెషన్స్ జడ్జి ఒప్పుకున్నారు. పోలీసులు నెలరోజుల పాటు కుళ్ళబొడిచినా ఘటన చూసిన ఒక్కరిచేత కూడా సాక్ష్యం చెప్పించలేకపోయారు. అందువలన కేసు నిలవదని అందరూ భావించారు. కానీ జడ్జి నలుగురికీ ఉరిశిక్ష వేశారు. పార్టీ ఎంతగా ప్రయత్నించినా పై కోర్టులకు పెట్టుకున్న అప్పీళ్ళేవి నిలవలేదు. ఆ నలుగురు కయ్యూరు వీరులు రాజకీయ చైతన్యానికి, ధైర్యానికి పెట్టింది పేరు. వారికి పార్టీ పట్ల ఉన్న నమ్మకాన్ని, దేశమాత స్వేచ్ఛకోసం జరుగుతున్న పోరాటం పట్ల విధేయతను అనేక ఉత్తరాలలో తెలియచేసారు. ఉరితీయబడడానికి కొద్దీ రోజుల ముందు వీరు ప్రజలకు ఒక ఉత్తరాన్ని వ్రాసారు. దాని పూరి పాఠం ఇదే:

"మేము పెట్టుకున్న క్షమా బిక్ష పిటిషన్ వైశ్రాయ్ నిరాకరించిన విషయం మీకిప్పటికి తెలిసే ఉంటుంది. అంటే మేము మరణానికి మరింత చేరువయ్యామన్న మాట. ఈ తిరస్కారాలు, ఇతరులకు విచారాన్ని కలిగిస్తున్నా మమ్ములనుఎంతగానో ఆనంద పరుస్తున్నాయి. ఇప్పుడిక ప్రివి కౌన్సిల్‌కి అప్పీలు చేసుకోవడమే తరువాయి. ఆ అప్పీలు ఫలితాలు ఎలాగుంటాయన్న దానిపై మాకు ఏమాత్రం ఆందోళన లేదు. ఆ ఫలితాలకోసం మేము ఎదురు చూడడమే లేదు. ఎందుకంటే మేము మాకు మాత్రమే చెందము. మేము ప్రపంచ ప్రజలకు చెందుతాము. మేము దేశం కోసం ప్రాణాలను అర్పిస్తున్నందుకు గర్వపడుతున్నాము. మేము చావుకు భయపడుతూన్నామని భావించకండి. దేశ భక్తులుగా దేశంకోసం ప్రాణ త్యాగానికి, చావును ఎదుర్కోడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మేము "ఇప్పుడు ప్రాణాలను అర్పిస్తే కలకాలం మా త్యాగం భ[illegible] గుర్తుండి పోతుంది. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించేందుకు మాకు మాత్రమే ప్రత్యేకంగా దక్కిన ఒక అవకాశంగా దీన్ని భావిస్తున్నాము. జైలులోపల దేశభక్తి గీతాలు ఆలపించుకుంటూ మేము ఆనందంగా కాలాన్ని గడపుతున్నాము. భగత్‌సింగ్ లాంటి దేశభక్తుల గాధలు మాకెంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. కామ్రేడ్ లెనిన్ – ప్రపంచ కార్మికుల నాయకుడు – జార్ చక్రవర్తి పాలనను అంతంచేసి విప్లవాన్ని సాధించక మునుపు ఎన్నికష్టాలు పడవలసి వచ్చిందో మాకెరుకే.

"కామ్రేడ్ కుమారమంగళం ప్రివి కౌన్సిల్ ముందు పిటిషన్ వేసినట్టు ఉత్తరం రాసారు. మా పార్టీవారు, ప్రజలు కూడా మా జీవితాలను కాపాడడానికి వారు చేయగలిగినదల్లా చేస్తూనే ఉన్నారు. కేరళలోని మా పార్టీవారు మమ్మల్ని కలవడానికి వచ్చినప్పుడల్లా ఇదే విషయాన్ని చెప్తున్నారు. "బయటనున్న మన కామ్రేడ్లు, దేశ ప్రజానీకం కూడా తమ శక్తి వంచన లేకుండా ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితితో పాటు కృషి చేస్తున్నందుకు, భవిష్యత్తులో ప్రపంచంలో బలహీనులపై బలవంతులు జరిపే దాడుల నుండి వారిని రక్షించడానికి జరుగుతున్న ప్రయత్నాలు మాకు చాల సంతోషం కలిగిస్తున్నాయి. జపనీయుల పాశవిక చర్యలకు వ్యతిరేకంగా జరుపుతున్న కార్యక్రమాలలో గాని, దేశ స్వాతంత్ర్య పోరాటంలోగాని పాల్గొన లేక పోతున్నందుకు మాకు విచారంగా ఉంది. కష్టించి నిబద్ధతతో చేసే పని ద్వారా మా తోటి కామ్రేడ్స్ ప్రజలకు ఆదర్శవంతంగా నిలవాలని ఈ జైలు ఊచల వెనక నుండి మేము కోరుకుంటున్నాం. ప్రజలను ఉత్సాహ పరచాలి. అందరూ ఒకే వ్యక్తిగా కదలాలి, తమ సర్వస్వాన్ని దేశం కోసం త్యాగం చేయాలి. ప్రజలదే అంతిమ విజయం కానుందని మేము గాఢంగా విశ్వసిస్తున్నాము. భవిష్యత్తులో ప్రపంచం వెలుగులు విరజిమ్ముతూ అద్భుతంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితులలోనూ దేశ సమైక్యత కోసం నిలబడాలి. మన దేశ విముక్తికి ఉన్నమార్గం అదొక్కటే. కమ్యూనిస్టు పార్టీ కలకాలం వర్ధిల్లాలి. ఇంక్విలాబ్ జిందాబాద్."

ఉరి తీసేందుకు కొద్ది రోజులముందు పి సి జోషి పార్టీ తరపున ఆ నలుగురిని కలసి శుభాకాంక్షలు చెప్పాలని నిర్ణయించడం జరిగింది. పి సుందరయ్య, కృష్ణ పిళ్లై ఆయనతో పాటు వెళ్లారు. వారితో పాటు ఒక పెద్ద సంచినిండా దేశవ్యాప్తంగా ఉన్న రైతులు, కార్మికులు పంపిన సౌహార్ద్ర సందేశాల ఉత్తరాలు తీసుకెళ్లారు. వారితో జరిగిన సంభాషణని గుర్తు చేసుకుంటూ పి సి జోషి,



epaper.prajasakti.com

మార్క్సిస్టు తరపున వారితో ఇలా అన్నాను: “ పార్టీలో ఉన్న ఏ ఇతరులకన్నా మీరు గర్వించదగ్గ వారని పార్టీ భావిస్తున్నది. పార్టీలో ఉన్న 17,000 మంది మీరు సమున్నతంగా ఎత్తిన జండాని అలాగే రెపరెపలాడేలా నిలుపుతారు. మీ బాటలోనే ధైర్యంగా పోరాటాలు చేస్తారు. పార్టీ మిమల్ని కోల్పోడం లేదు, నలుగురు అమరవీరులను పొందుతున్నది. మిమ్మల్ని వారు ఉరితీస్తే తీయనీయండి. దానిని మనం ఆపలేము. మీ నలుగురి స్ఫూర్తి మరో నాలుగు వందల మందిని, నాలుగు వేలమంది కొత్త సభ్యులు తయారవుతారు. దానిని వారు ఆపలేరు. మేము అందుకోసం కృషి చేస్తాం. మీరేం సందేహించకండి. ఈ ప్రయత్నంలో మనం తప్పక గెలిచే తీరుతాం. మన లక్ష్యం లాగే మన పార్టీ కూడా శాశ్వితమైనది. మీరు ప్రజలను మీ తలిదండ్రులుగా భావించారు. మీ తలిదండ్రులలాగా మరే తలిదండ్రులు బాధలు అనుభవించ కూడదనుకున్నారు. పార్టీలోని 17,000 మంది మీ కుటుంబాలను తమ కుటుంబాలలాగే భావిస్తారనడంలో ఎటువంటి సందేహం పెట్టుకోకండి. పార్టీ తమ కుటుంబంగా మిమ్మల్ని కన్న తల్లిదండ్రులు భావించేటట్టు చేయడానికి, పార్టీలోని ప్రతి సభ్యుని తమ సొంత బిడ్డలలాగా మీ తలిదండ్రులు అనుకునే విధంగా చేయడానికి మా శక్తికొలది ప్రయత్నిస్తాము. మిమ్మల్ని కలుసుకునే అవకాశం వచ్చిన ఈ రోజు, నా జీవితంలో అత్యంత విలువైన రోజు.” ఇందుకు జవాబుగా కున్హాంబు, “పార్టీ నాలో పెంచిన సమర్ధత కారణంగానే నేను ప్రజలకు ఈ మేరకు చేయగలిగాను. నేను చేయాల్సినది చేసానని పార్టీ అనుకున్నట్టయితే, నాకు తగిన యోగ్యతా పత్రం దక్కినట్టే.”

చిరుకందన్ : “ మేము కేవలం నలుగురు రైతు బిడ్డలం. భారతదేశంలో ఎంతో మంది రైతు బిడ్డలున్నారు. మమల్ని ఉరితీయగలరు. కానీ రైతుబిడ్డల నందరిని నాశనం చేయలేరు కదా !.”

అప్పు: “పార్టీ బలానికి సంబంధించిన మంచి సమాచారాన్ని మీరు తీసుకొచ్చారు. ఇక ఇప్పుడు మేము నిశ్చింతగా ఉరికంబం ఎక్కుతాం.”

అబూబకర్: “మేము ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల నుండి స్ఫూర్తిని పొందాము. అటువంటి వారి సరసన చేరగలుగుతామని మేమెన్నడు కలగనలేదు. మా తోటి కామ్రేడ్స్ అందరికి మేము నిర్భయంగా ఉరికంబం ఎక్కామని చెప్పండి. నా సోదరులు చాల చిన్నవారు. వారికి పార్టీ పని నేర్పించండి.”

పొంగి పొర్లుతున్న కన్నీటికి అడ్డుకట్ట వేస్తూ జోషి నలుగురితోనూ కరచాలనం చేసారు. జైలులో ఉన్న పూలను చూపుతూ, “ రేపటికి ఈ పూలు వసివాడుతాయి, కానీ కామ్రేడ్స్, మీరు మాత్రం ఎన్నటికీ వసివాడని మానవ కుసుమాలు.” అన్నారు.

భారతదేశ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా 1943 మార్చి 29వ తేదీన రైతాంగ కుటుంబంలో జన్మించిన నలుగురు కమ్యూనిస్టు యోధులు ఉరితీయబడ్డారు. అతి పిన్న వయసులోనే వారు కమ్యూనిస్టు పార్టీలో, తిరుగులేని స్వాతంత్ర సమర యోధుల సైన్యంలో చేరారు. నిజమైన దేశభక్తులుగా జీవించారు. ఉన్నతమైన దేశభక్తులుగా, కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్ అని నినదిస్తూ వీరమరణం పొందారు.

ప్రజాగ్రహానికి భయపడి ఆ వీరుల భౌతిక దేహాలను సహితం కన్నూరు జైలు బయట వేచి ఉన్న ప్రజలకు ఇవ్వడానికి పోలీసులు అంగీకరించలేదు.

ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం పెరగకుండా ఆపడానికి బ్రిటిష్ వారు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. పైగా సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య వ్యవస్థని సమర్ధవంతంగా ఎదుర్కొనే శక్తిగా కమ్యూనిస్టు పార్టీ ఎదిగిందని, ఆ నాడు జరిగిన మొరఝా, కరివెల్లూరు, కయ్యూరు పోరాటాలు తెలియచేస్తున్నాయి.

**(అనువాదం: కె ఉషారాణి)**

# కమ్యూనిస్ట్ లీగ్ ఏర్పాటు

**(31వ పేజీ తరువాయి)**

ఏకం కండి అనే కొత్త నినాదాన్ని మహాసభ పిలుపునిచ్చింది. ఎంగెల్స్ – వోల్ఫ్ ప్రత్యక్ష భాగస్వామ్యంతో కొత్త విధానాలు రూపొందించబడ్డాయి. కమ్యూనిటీల్లో చర్చించిన తర్వాత భవిష్యత్‌లో జరిగే మహాసభలో ఆమోదించాలి. మార్క్స్, మోల్ మధ్య కుదిరిన అంగీకారం మేరకు కమ్యూనిస్ట్ లీగ్ అన్ని రకాల కుట్రపూరితమైన రహస్య కార్యకలాపాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. అంటే కొత్త సభ్యులను చేర్చుకునేటపుడు. రహస్యంగా ప్రమాణం చేయించడం, విశ్వాసం ప్రకటించడం, నాయకత్వానికి పూర్తి అధికారం కట్టబెట్టడం వంటి వాటిని విస్మరించాలని నిర్ణయించింది. ఇటువంటి చర్యలు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్నందునే మార్క్స్, మాల్ ఈ నిర్ణయానికి వచ్చారు.

కార్మికవర్గానికి చెందిన ఏ సంస్థలోనైనా నాయకుల వ్యక్తిత్వ ఆరాధనకు చోటు లేదని మార్క్స్ – ఎంగెల్స్ విశ్వసించారు. కమ్యూనిస్ట్ లీగ్ అత్యున్నత వేదిక మహాసభ మాత్రమే. స్థానిక సంస్థల నుండి ఎన్నికైన ప్రతినిధులతో మహాసభ జరుగుతుంది. మహాసభ అధికారాలను పరిమితం చేయాలన్న నిబంధననూ, మహాసభ చేసే నిర్ణయాలను అంగీకరించే లేదా తిరస్కరించే హక్కును కమ్యూనిటీలకు ఇవ్వాలనే నిబంధననూ తొలగించాలని మార్క్స్ పట్టుబట్టాడు. మహాసభ చేసిన నిర్ణయాలను అమలు చేసే కార్యనిర్వాహక సంస్థ కేంద్ర కమిటీ. కేంద్ర కమిటీకి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ బాధ్యత వహిస్తారు. కమ్యూనిటీ పరిధిలోని అన్ని కమిటీలను సెంట్రల్ కమిటీ గొడుగు క్రిందకి తీసుకురావాలి.

కమ్యూనిస్ట్ లీగ్ నిబంధనల ప్రకారం కొత్త సభ్యులను లీగ్‌లోకి తీసుకోవాలంటే సభ్యులు సిఫార్స్ చేయాలి. ఛైర్మన్, ఇంకా సిఫార్సు చేసిన సభ్యుని అనుమతితో కమ్యూనిస్ట్ లీగ్‌లోకి చేర్చుకోవాలి. క్రమశిక్షణ ఉల్లంఘించిన సభ్యులను లీగ్ నుండి బహిష్కరించడానికి, సభ్యుల నుండి సభ్యత్వ లెవీ వసూలు చేయడానికి, లీగ్ విధుల నిర్వహణకు డబ్బులు ఖర్చు చేయడానికి నిబంధనలు రూపొందించబడ్డాయి. మార్క్స్ చొరవతో లీగ్ సభ్యులు కమ్యూనిస్ట్ సూత్రాలను పాటించడం, కమ్యూనిస్టు ప్రమాణాల ప్రకారం జీవన విధానాన్ని పాటించడం, పార్టీ విషయాలను గోప్యంగా ఉంచడం, కమ్యూనిస్ట్ లీగ్‌కు వ్యతిరేకంగా ఉన్న కమ్యూనిటీలకు దూరంగా ఉండటం తదితర అంశాలపై నిబంధనలు లిఖితపూర్వకంగా తయారు చేయడం జరిగింది. ఇతర రాజకీయ లేదా జాతీయ సంస్థల్లో లీగ్ సభ్యులు చేరడంపై నిషేధం విధించారు.

కమ్యూనిస్ట్ లీగ్ మహాసభ సాధించిన ప్రధాన విజయాలు

1. శాస్త్రీయ సిద్ధాంతం ఆధారంగానే కమ్యూనిజం సాధిస్తామని బహిరంగంగా ప్రకటించిన మొట్ట మొదటి అంతర్జాతీయ కార్మికవర్గ సంస్థ కమ్యూనిస్ట్ లీగ్
2. కమ్యూనిస్ట్ లీగ్ సంస్థాగత నిర్మాణంలో అత్యున్నతమైన కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని ప్రవేశపెట్టారు.
3. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని కమ్యూనిస్ట్ లీగ్ మహాసభ ఇచ్చిన పిలుపుతో కార్మికవర్గం అంతర్జాతీయ వాదులనే ప్రాథమిక సూత్రాన్ని రూపొందించారు.

**(అనువాదం: ఎన్ హరికిషోర్)**



epaper.prajasakti.com

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-06-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20





# ప్రజా నిరసన

మే 26వ తేదీన అమెరికాలోని మిన్నియాపోలిస్ నగరంలో నల్లజాతి పౌరుడు జార్జి ఫ్లాయిడ్ హత్యతో తలెత్తిన నిరసన ప్రదర్శనలు కొద్ది రోజుల్లోనే దేశంలోని యాభై రాష్ట్రాలకూ వ్యాపించాయి. 46 ఏళ్ల ఫ్లాయిడ్‌ను జాత్యహంకార పోలీసులు కారునుండి బయటకు లాగి, చేతులు వెనక్కు విరిచి, బేడీలు వేసి, మెడపై కాళ్లతో నొక్కిపట్టి ఊపిరాడకుండాచేసి చంపారు. ఈ దారుణ ఘటన సోషల్ మీడియాలో ప్రపంచమంతా వైరల్ అవడంతో భగ్గుమన్న ప్రజా నిరసన అమెరికాలోని 400కు పైగా నగరాలకు, ఐరోపా, ఆఫ్రికా ఖండాల్లోని అనేక దేశాలకూ వ్యాపించింది. వారం రోజులు దాటినా ఆగ్రహజ్వాలలు ఆగకపోగా రోజురోజుకూ విస్తృతమవుతున్నాయి.

ఈ ప్రజాగ్రహం వెనుక అమెరికా సమాజంలో పేరుకుపోయి ఉన్న జాతి వివక్షపై తిరుగుబాటు మాత్రమే కాక, ఆ సామాజిక వ్యవస్థ సృష్టించిన నిరుద్యోగం, ఆకలి, అసమానతలు, అభద్ర పట్ల అసమ్మతి కూడా దాగి ఉన్నది. 'నల్లజాతి వారివి కూడా ప్రాణాలే' అనే నినాదంతో జరుగుతున్న ఈ ప్రదర్శనల్లో అన్ని జాతుల ప్రజలు పాల్గొంటుండడమే దీనికి నిదర్శనం. లాక్‌డౌన్ సందర్భంగా ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనేక పునరుద్ధరణ ప్యాకేజీలు ప్రకటించింది. కానీ కార్మిక వర్గానికి మాత్రం నిరుద్యోగం, ఆకలి మిగిల్చింది. లాక్‌డౌన్ పేరుతో పరిశ్రమల నుండి పెద్ద ఎత్తున కార్మికులను తొలగించడంతో దేశంలో నిరుద్యోగుల సంఖ్య 20 శాతానికి పైగా పెరిగింది. కరోనా మహమ్మారి వ్యాపించిన తరువాత ఉద్యోగాలు పోవడంతో 4 కోట్ల మంది అమెరికన్ కార్మికులు అంటే ప్రతి నలుగురిలో ఒకరు నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గత వారం రోజుల్లోనే అమెరికాలో రికార్డు స్థాయిలో 10 లక్షల మంది నిరుద్యోగులుగా నమోదు చేసుకున్నారు. అంతకు ముందే మాంద్యంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ ఉద్యోగాల కల్పనలో వెనుకబడిపోయిన తరుణంలో ఈ కరోనా నిరుద్యోగం ప్రజల్లో మరింత నిస్పృహను పెంచింది.

విఫలమైన ఆర్థిక వ్యవస్థ నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు జాత్యహంకారాన్ని, విదేశీ కార్మికుల పట్ల వ్యతిరేక భావాన్ని, అంతర్జాతీయంగా చైనా వ్యతిరేకతనూ రెచ్చగొడుతూ వస్తున్నాడు. ఈ జాత్యహంకారం పోలీసులకు వ్యాపించి ఇటీవలి కాలంలో వారు అనేక మంది నల్ల జాతి పౌరులను కాల్చి చంపారు. ఫ్లాయిడ్ హత్య తరువాత జరిగిన నిరసనల విషయంలో కూడా ట్రంప్ శాంతి నెలకొల్పడం కాకుండా జాత్యహంకారాన్ని రెచ్చగొట్టేట్లు మాట్లాడ్డంతో నిరసనలు మరింత పెరిగాయి. ఇది ఇంటా బయటా ట్రంప్ నాయకత్వ ప్రతిష్టను దిగజార్చింది. సైన్యాన్ని దించి నిరసనకారులను కాల్చి చంపేస్తానని బీరాలు పలికిన ఆయన వైట్‌హౌస్ ముందుకు నిరసన కారులు రావడంతోనే రహస్య బంకర్‌లోకి దూరి దాక్కోవడం నియంతల పరిస్థితిని తలపించింది.

ఏమైనా ఈ నిరసనాగ్ని అమెరికాతో ఆగిపోదు. ఇప్పటికే యూరోపియన్, దేశాలనూ ఆఫ్రికా ఖండంలోని అనేక దేశాలనూ తాకింది. అసలే ఆర్థిక మాంద్యం, ఆపై కరోనా మహమ్మారి. ఈ రెండు భారాలనూ కార్మికవర్గంపైకి నెట్టి తమ గరిష్ట లాభాలను కాపాడుకోవాలని పాలక వర్గాలు ప్రయత్నించినంత కాలం ప్రజా నిరసన పెరుగుతూనే ఉంటుంది. ప్రపంచాన్ని చుట్టుముడుతూనే ఉంటుంది.

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.10. Published on June 1, 2020


epaper.prajasakti.com